
# బైబిలు నందు నాయకత్వ పాఠములు

"నేను క్రీస్తును పోలి నడుచుకొనుచున్న ప్రకారము మీరును నన్ను పోలి నడుచుకొనుడి" 1 కొరింథి 11:1



రెవ. డా. జెర్రి స్మోమెయెర్

తెలుగు అనువాదము : రెవ. డా. జేకబ్‌ప్రభు

ప్రచురణ – ఆగష్టు, 2017
ప్రతులు – 5000

© సర్వహక్కులు రచయితవి

ఈ పుస్తకపు యే భాగమైనను, యే విధముగానైనను పునరుత్పత్తి చేయకూడదు. చేర్చి పెట్టకూడదు. పునస్సంపాదనము చేయకూడదు. ఏ రూపముగానైనను పంపకూడదు. విద్యుచ్ఛక్తి, యంత్రము మరియు ఛాయాచిత్రప్రతి తీయకూడదు. వీటిని ఏమైన చేసేముందు వీటి కొరకు ముందుగా ప్రచురణకర్త అనుమతిని పొందవలెను.

వెల : **రూ. 100/-**

ఈ పుస్తకము కొరకు సంప్రదించవలసిన చిరునామా :
**న్యూహోప్ ఫౌండేషన్**
8-2-293/129, రోడ్ నంబర్ 14,
వెంకటేశ్వరనగర్, బంజారాహిల్స్,
హైద్రాబాద్ – 500 034.
e-mail : newhopefoundation@gmail.com
Ph: 9866543468

ముద్రణ :
**స్ఫూర్తి గ్రాఫిక్స్**
హైద్రాబాద్.

# వాక్యమును ప్రకటించుము


| | | |
|---|---|---|
| తొలిపలుకు | | 8 |
| పరిచయం | | 10 |
| పీఠిక | | 11 |
| **1.** | **నాయకుడెవరు?** | 13 |
| **2.** | **యోసేపు జీవితము నుండి నాయకత్వ పాఠములు** | 18 |
| | 1. దైవభక్తిగల నాయకుడు తన పరిస్థితులను మించి ఉదయించును | |
| | 2. దైవభక్తిగల నాయకునికి జీవితమునందు దేవుడు ప్రసాదించిన కారణముండును | |
| | 3. దైవభక్తిగల నాయకుడు ఆటంకములున్నను పట్టుదల కలిగియుండును | |
| | 4. దైవభక్తిగల నాయకుడు ఆంతర్యశీలమును కలిగియుండును | |
| | 5. దైవభక్తిగల నాయకుడు ఏ స్థలమందైనను సేవ చేయును | |
| | 6. దైవభక్తిగల నాయకునికి జ్ఞాన వివేకములుండును | |
| | 7. దైవభక్తిగల నాయకుడు యితరులను ప్రేమించును మరియు క్షమించును | |
| | 8. దైవభక్తిగల నాయకుడు దేవునిచే వాడబడుచు దీవించబడును | |
| **3.** | **మోషే జీవితమునుండి నాయకత్వ పాఠములు** | 31 |
| | 1. దైవభక్తిగల నాయకుడు తన జీవితము, పరిచర్యలకు గల దేవుని యేర్పాటును పాటించును | |
| | 2. దైవభక్తిగల నాయకుడు వినయ మనస్కుడు | |
| | 3. దైవభక్తిగల నాయకుడు యితురులను ముఖ్యముగా కుటుంబీకులను సేవించును | |
| | 4. దైవభక్తిగల నాయకుడు విమర్శనమును తప్పక ఉపయోగించును. | |
| | 5. దైవభక్తిగల నాయకుడు న్యాయబుద్ధితో ప్రవర్తించును | |
| | 6. దైవభక్తిగల నాయకుడు దేవునితో ఒంటరి సమయమును గడుపును | |
| | 7. దైవభక్తిగల నాయకుడు పట్టుదల గలిగియుండును | |
| | 8. దైవభక్తిగల నాయకునికి సన్నిహిత మిత్రులుందురు | |

**4. యెహోషువ జీవితము నుండి నాయకత్వ పాఠములు** 47

1. దైవభక్తిగల నాయకుడు తాను ఒంటరిగా లేనివాడని యెరిగియున్నాడు
2. దైవభక్తిగల నాయకుడు తాను అధికారినని యెంచుకొనడు
3. దైవభక్తిగల నాయకుడు దేవుడు మరియు దైవసేవ పరిశుద్ధమైనదని జ్ఞాపక ముంచుకొనును
4. దైవభక్తిగల నాయకుడు విజయము దేవుని నుండియే వచ్చునని తలంచును

**5. దావీదు జీవితము నుండి నాయకత్వ పాఠములు** 56

1. దైవభక్తిగల నాయకుడు సవాలుల నెదుర్కొనుటకు ధైర్యము గలవాడు
2. దైవభక్తిగల నాయకుడు ఓపిక మరియు సహనము గలవాడు
3. దైవభక్తిగల నాయకుడు వినయము గలవాడు
4. దైవభక్తిగల నాయకుడు దేవునియందు లోతైన విశ్వాసము గలవాడు
5. దైవభక్తిగల నాయకుడు దేవుని యెడల విధేయత ప్రదర్శించువాడు
6. దైవభక్తిగల నాయకుడు పాపము చేయుటతో దాని నొప్పుకొనువాడు
7. దైవభక్తిగల నాయకుడు త్యాగపూరితమగు భర్త మరియు తండ్రి
8. దైవభక్తిగల నాయకుడు యితరులకు శిక్షణ నిచ్చు దూరదృష్టి గలవాడు

**6. నెహెమ్యా జీవితము నుండి నాయకత్వ పాఠములు** 72

1. దైవభక్తిగల నాయకుడు ప్రార్థనాపరుడు
2. దైవభక్తిగల నాయకుడు ఓపికతో ఆలోచించి పద్ధతి నేర్పరచువాడు
3. దైవభక్తిగల నాయకుడు జాగరూకత గలవాడు
4. దైవభక్తిగల నాయకుడు చర్యపూనుకొను సమయము నెరిగినవాడు
5. దైవభక్తిగల నాయకుడు అధికారమిచ్చి పంపువాడు
6. దైవభక్తిగల నాయకుడు ప్రతికూలత నెదుర్కొనువాడు
7. దైవభక్తిగల నాయకుడు ధైర్యశాలి
8. దైవభక్తిగల నాయకుడు సత్యము మరియు వినయము గలవాడు
9. దైవభక్తిగల నాయకుడు తన యెడల దేవునికి గల యేర్పాటుపై దృష్టి నుంచుకొనువాడు
10. దైవభక్తిగల నాయకుడు బృందమును నడిపించువాడు

11. దైవభక్తిగల నాయకుడు పాపుల యెడల సహనము గలవాడు

**7. యేసు జీవితము నుండి నాయకత్వ పాఠములు** 94

1. దైవభక్తిగల నాయకుడు దేవుని పిలుపు నంగీకరించువాడు
2. దైవభక్తిగల నాయకుడు పరిచర్య చేయుటకు సిద్ధపడువాడు
3. దైవభక్తిగల నాయకుడు శక్తివంతమగు భక్తి జీవితము గలవాడు
4. దైవభక్తిగల నాయకుడు యితరులు శిష్యులగునట్లు సవాలు నిచ్చువాడు
5. దైవభక్తిగల నాయకుడు యితరులకు తర్ఫీతు నిచ్చువాడు
6. దైవభక్తిగల నాయకుడు విశ్రాంతి కొరకు సమయము తీసికొనువాడు
7. దైవభక్తిగల నాయకుడు సేవకుడై యుండవలసినవాడు

**8. పేతురు జీవితము నుండి నాయకత్వ పాఠములు** 109

1. దైవభక్తిగల నాయకునికి దైవభక్తిగల భార్య ఉండవలెను
2. దైవభక్తిగల నాయకుడు దేవుడు అతని విశ్వాసమును విశాలపరచునట్లు కోరును
3. దైవభక్తిగల నాయకుడు దేవుడు ప్రత్యేకరీతులుగా దేవుని కార్యమును చేయుట చూచును
4. దైవభక్తిగల నాయకుడు వినయము గలవాడు
5. దైవభక్తిగల నాయకుడు పరిశుద్ధాత్మతో నింపబడినవాడు
6. దైవభక్తిగల నాయకుడు అవసరతలో సేవచేయువాడు
7. దైవభక్తిగల నాయకుడు నిరాకరణమును, హింసల నెదుర్కొనువాడు
8. దైవభక్తిగల నాయకుడు దేవుని వాక్యమును ప్రకటించువాడు
9. దైవభక్తిగల నాయకుడు తన పాపము నుండి పాఠము నేర్చుకొనువాడు
10. దైవభక్తిగల నాయకుడు మరణము వరకు నమ్మకస్థుడు

**9. పౌలు జీవితము నుండి నాయకత్వ పాఠములు** 127

1. దైవభక్తిగల నాయకుడు నమ్మదగినవాడు
2. దైవభక్తిగల నాయకుడు నడిపించునట్లు ప్రారంభము చేయువాడు
3. దైవభక్తిగల నాయకుడు క్లిష్టపరిస్థితులందు ధైర్యముగా నుండువాడు
4. దైవభక్తిగల నాయకుడు యితురులను ప్రోత్సహించువాడు

5. దైవభక్తిగల నాయకుడు పాపమునకు విరోధముగా నుండువాడు
6. దైవభక్తిగల నాయకుడు మంచిమాదిరిని ప్రదర్శించువాడు
7. దైవభక్తిగల నాయకుడు ఎటువంటి తరుణములోనైన పరిచర్యను కొనసాగించువాడు

**10. స్త్రీల నుండి నాయకత్వ పాఠములు** 140

1. దైవభక్తిగల నాయకురాలు సాతాను వలన మోసగించబడును - హవ్వ
2. దైవభక్తిగల నాయకురాలు యితరులకు తన్నుతాను సమర్పించుకొనును - రిబ్కా
3. దైవభక్తిగల నాయకురాలు వేషధారణతో పోరాడును - తామారు
4. దైవభక్తిగల నాయకురాలు నిస్సహాయతను భద్రపరుచును - మిర్యాము
5. దైవభక్తిగల నాయకురాలు అనుచరులను ప్రోత్సహించును - దెబోరా
6. దైవభక్తిగల నాయకురాలు ధైర్యశాలి - ఎస్తేరు
7. దైవభక్తిగల నాయకురాలు మిత్రుల యెడల రాజభక్తి గలిగియుండును - రూతు
8. దైవభక్తిగల నాయకురాలు ముఖ్యమైనదాని చేయుటకు సిద్ధముగా నుండును - మార్త
9. దైవభక్తిగల నాయకురాలు ప్రేమతో సవరించును. (ప్రిస్కిల్ల)

**11. ఈ పుస్తక రచయిత నుండి నాయకత్వ పాఠములు** 150

1. దైవభక్తిగల నాయకుడు తాను దేవునికి అనవసరమనియు, తనకే దేవుడవసర-మనియు యెరిగినవాడు
2. దైవభక్తిగల నాయకుడు ఎంతగా యెదిగినను మరింకను యెదుగుదలను కోరుచుండువాడు
3. దైవభక్తిగల నాయకుడు దేవునితో సన్నిహితముగా నుండుటయే తన ప్రథమ గురిగా పెట్టుకొనువాడు
4. దైవభక్తిగల నాయకుడు తన తలాంతుల నుపయోగించుట ద్వారా స్వకీయ విలువను లెక్కించుకొనలేమని యెరిగినవాడు
5. దైవభక్తిగల నాయకుడు వినయము అనునది సాధారణముగా పొందునది కాదని గ్రహించినవాడు
6. దైవభక్తిగల నాయకుడు తన భార్య ముత్యములకన్నను విలువగలదని యెరిగినవాడు
7. దైవభక్తిగల నాయకుడు కుటుంబమే తన ప్రథమ పరిచర్యయని యెరిగినవాడు

8. దైవభక్తిగల నాయకుడు బైబిలు ప్రతిసంవత్సరము మెరుగైయున్నదని యెరిగినవాడు

9. దైవభక్తిగల నాయకుడు సాతానుడు ఉనికిలో నున్నను సజీవ దేవుడు వానిని మించిన గొప్పదేవుడని యెరిగినవాడు

**12. మొదటి తిమోతి 3 మరియు తీతు 1 నుండి నాయకత్వ పాఠములు** 168

1. దైవభక్తిగల నాయకుడు భక్తిగల నాయకునిగా నుండు కోరిక కలిగి యుండవలెను

2. దైవభక్తిగల నాయకుడు భక్తిపూర్వకముగా ఆంతర్య యోగ్యతలను కలిగి యుండవలెను

3. దైవభక్తిగల నాయకుడు భక్తిగల పరస్పర సంబంధములు గలవాడు

4. దైవభక్తిగల నాయకుడు ఆత్మీయకీర్తిని కలిగినవాడు

5. దైవభక్తిగల నాయకుడు భక్తిగల ఆత్మీయ జీవితము గలవాడు

6. దైవభక్తిగల నాయకుడు భక్తితోకూడిన కుటుంబ జీవితము గలవాడు

7. దైవభక్తిగల నాయకుడు దైవభక్తితో కూడిన వ్యక్తిగత అలవాట్లు గలవాడు

**ముగింపు** 182

# తొలిపలుకు



"దైవికమగు నాయకత్వము స్వకీయ గుర్తింపు మాత్రమే కాదు. దాని యందు గల మన కర్తవ్యము కూడ చేర్చబడెను. అనగా మనము పలుకు మాటలు మరియు చేయు క్రియలు వాటియందు యిమిడి యున్నవి. ఇవి రెండును సార్ధకమగు నాయకునికి గృహము, ఉద్యోగము లేక క్రైస్తవ సంఘములందు అత్యవసరము. నాయకుని వ్యక్తిత్వ శీలము మరియు ఆ వ్యక్తి క్రియలు అనువాటిని ఈ పుస్తకము నందు చూడగలము" అని రచయిత లిఖించెను.

ఈ పుస్తకాంశము ప్రతి క్రైస్తవ వ్యక్తికి తాను కూడ నాయకునిగా నుండుటకు పిలువబడియున్నందున ప్రాముఖ్యమైయున్నది. అట్లుండుటకు ముందుగా "నాయకుడు మరియు నాయకత్వము"లను గూర్చి నేర్చుకొనుట అవసరము. నేర్చుకొని వాటిలో ఉత్తీర్ణత పొందిన తర్వాత నాయకత్వము"లను గూర్చి నేర్చుకొనుట అవసరము. నేర్చుకొని వాటిలో ఉత్తీర్ణత పొందిన తర్వాత నాయకత్వ స్థితిని పొంది దానిలో కొనసాగవలెను.

స్వకీయ లాభము కొరకు నాయకత్వ పాత్ర కోరబడలేదు. సేవ చేయునట్లే కోరబడెను. అదే రీతిని ఇశ్రాయేలు దేశపు రాజులు వారిని వారు తమ ప్రజల కంటే హెచ్చించుకొనక యుండిరి. పౌలు తన అపొస్తలత్వమును బట్టి అతిశయించి త్యాగపూరితమగు ప్రయాసకొరకైన పిలుపుగా నున్నదని చూచెను. సంఘకాపరులు తమ మందను కాయవలెను. త్యాగపూరితముగా మందను గూర్చిన శ్రద్ధ వహించవలెను.

మీపైని నాయకులుగా ఉన్నవారు లెక్క ఒప్పచెప్పవలసిన వారివలె మీ ఆత్మలను కాయుచున్నారు. వారు దుఃఖముతో ఆ పనిచేసిన యెడల మీకు నిష్ప్రయోజనము గనుక దుఃఖముతో కాక, ఆనందముతో చేయునట్లు వారి మాట విని, వారికి లోబడి యుండుడి" (హెబ్రీ 13:17).

"నా సహోదరులారా, బోధకులమైన మనము మరి కఠినమైన తీర్పు పొందుదుమని తెలిసికొని మీలో అనేకులు బోధకులు కాకుండుడి" (యాకోబు 3:1).

**రెవ. డా. జేకబ్ ప్రభు,** బి.డి., డి.డి.

అనువాదకుడు

# పరిచయం



రెవ. డా. జెర్రి స్మోయర్ గారు రచించిన "బైబిల్ నందు నాయకత్వ పాఠములు" అనే ఈ పుస్తకములో దైవభక్తిగల నాయకులు వారి తలాంతులను దేవుని మహిమార్థమై, ప్రజల ఆధ్యాత్మిక అభివృద్ధికి ఉపయోగపడునట్లు సేవ చేయాలని సూచించారు.

ఈనాడు నాయకులైనవారు దేవునిచేత పిలువబడి, వారు అంతర్యములో వున్నది బాహ్యాముగ కనుపరిచినపుడే వారు నిజమైన నాయకులు అని రచయిత తెలిపినారు.

నాయకులైన వారి లక్షణములు, వారి విధులు ఏ విధంగా పరిశుద్ధ గ్రంథమైన బైబిలులో వ్రాయబడినవో వాటిని ఆయా దైవభక్తిగల నాయకులు ఏ విధంగా దేవునిచే వాడబడినారో ఇందులో సంక్షిప్తముగా వ్రాసినారు.

ముఖ్యముగా యోసేపు, మోషే, యెహోషువ, దావీదు, నెహెమ్యా, యేసుక్రీస్తు, పేతురు, పౌలు మరియు ఇతర నాయకులు ఏ విధంగా నాయకులై జీవించారో వారి జీవిత విధానం ఇందులో పొందుపర్చారు మరియు రెవ. డా. జెర్రీస్మోయర్ గారి జీవితంలోని కొన్ని నాయకత్వపాఠములు ఇందులో తెలియపరిచారు. ఈ అంత్య దినములలో దైవభక్తిగల నాయకులు పురుషులైన, స్త్రీలైన బైబిల్ గ్రంథములోని ఆయా భక్తులను దేవుడు ఏ విధంగా వాడుకున్నాడో ఆ విధంగా మిమ్ములను కూడా వాడుకోవాలని ఆశిస్తున్నాము (1 కొరింథి 11:1).

దేవుడు మిమ్ములను మంచి నాయకులనుగా చేయునుగాక!

**రెవ. పోలిశెట్టి కరుణాకర్ మోసెస్**
సంఘకాపరి, బేతేల్ ప్రార్థనా సహవాసము
బంజారహిల్స్, హైదరాబాద్.

# పీఠిక

నాయకత్వమను అంశముపై ఒక పుస్తకమును వ్రాయుటకు గల కారణమేమి? ఒక పుస్తకమును చదువుట ద్వారా ఒకరు మెరుగైన నాయకుడగుటకు నేర్చుకొనగలడా? ఇదివరకే లిఖించబడిన యీ అంశముపై నుండు పుస్తకముల విషయమేమి? నేను దీని వ్రాయుటకు గల కారణము సంఘకాపరులకును, సంఘనాయకులకును దైవభక్తి గల నాయకుడై యుండుట అత్యవసరమనియే. అయినను ఒక మెరుగైన నాయకునిగా నుండుట కొరకు ప్రయోగాత్మకమగు, బైబిలు సమాచారమును కనుగొనుట కష్టతరము.

ఒక సంఘకాపరి లేక సంఘనాయకుడు వారి యితరమగు తలాంతులను వాడునట్లు నాయకత్వము అవసరము. ప్రజలు తనను వినునట్లును, తదుపరి వారిని విశ్వాస యెదుగుదల యందు నడిపించుటకును ఒక సువార్తికునికి శ్రేష్ఠమగు నాయకత్వము అవసరము. ప్రజలు నమ్ముచు ఆయన చెప్పు దానిని మరియు చేయు దానిని వెంబడించుట కొరకు ఒక సంఘకాపరికి నాయకత్వము అవసరము. కొందరు ఒక కార్యమును చేసినపుడు వారిలో ఒక నాయకుడు ఉండును. మెరుగైన నాయకుని వలన చేసిన కార్యమునందు ఫలితము కలుగును.

దైవభక్తిగల నాయకత్వ నిపుణత ఒకరి శీలమును మరియు న్యాయబుద్ధిని బయలుపరచును. ఆ వ్యక్తి ఎటువంటివాడో అతని ఆంతర్యస్థితిని చూపును. నాయకుని యందుగల నమ్మకమును మనస్సునందు పుట్టించును. దైవభక్తిగల నాయకత్వము మనమెవరై యున్నామో దానిపై ఆధారపడదు. మన కర్తవ్యముపై ఆధారపడును. అనగా మన మాటలు మరియు మనము చేయు కార్యములు.

గృహము, ఉద్యోగము లేక సంఘము నందు సార్థకమగు నాయకుడై యుండుట కొరకు ఈ రెండును అవసరము.

ఈ పుస్తకము నందు నాయకులైయుండిన బైబిలు వ్యక్తుల జీవితములను చూచుచు రెండు వైపులను గూర్చి తెలిసికొందము. ఒకరి శీలము మరియు అతని క్రియలు రెండింటిని చూడగలము. ఎటువంటి నాయకత్వమును మనము కలిగి యుండవలెనని దేవుడు కోరుచున్నాడో దానిని యివి అల్లుచుండును.

కాబట్టి నాయకత్వముపై మరొక పుస్తక మెందులకు? ఈ పుస్తకము బైబిలులోని వ్యక్తుల జీవితముల నుండి వివరణలను సులభముగా గ్రహించునట్లు చేయుచు వారినుండి నాయకత్వ పాఠములను తీసికొనగలము. ఇది కర్తవ్యమును చూపునది కాదు. ప్రయోగాత్మకమగు సూచనలతో ఎన్నో రీతులుగా ప్రతి యొక్కరము అభ్యసింపతగినవి. ఈ పుస్తకము నీవేవి చేయుచున్నను ఏ ఉద్యోగములోనున్నను నిన్ను మెరుగైన నాయకునిగా నుండుటకు సహాయపడగలదనియే నా ప్రార్థన.

**జెర్రి స్మోయెర్, 2017**

# 1. నాయకుడనగా ఎవరు?

కొన్ని విధములలో ప్రతి యొక్కరును నాయకుడే. నాయకత్వమునకు ఒక ప్రత్యేకమగు వ్యక్తిత్వముగాని, ఏదో తలాంతుగాని లేదు. ఒకరిని తన మాట పలుకుబడితో కదలించగలవాడే నాయకుడు. మాటతోనో లేక క్రియతోనో అట్లు చేయగలరు. అట్లు చేయువాడే నాయకుడు. ఏదోయొకరీతిగా ప్రతి యొక్కరును మరొకరిని వారి మాట, క్రియతో కదలించుచున్నందున అందరును నాయకులే. నీవు నాయకుడవైతే దానిలో ప్రత్యేకత లేదు, కాని ఏ విషయమునందు నాయకుడవో అదియే ప్రాముఖ్యము.

నీవు భర్తవైతే నీ కుటుంబము నందు నీవు నాయకుడవు. నీవు భార్యవైతే నీ పిల్లలకు మరియు యితరమగు స్త్రీలకు నాయకురాలవు. పెద్దపిల్లలు చిన్న పిల్లలకు నాయకులు. చిన్నపిల్లలు వారి మిత్రులపై వారి ప్రభావమును చూపుదురు. అవివాహితులు వారి మిత్రులు మరియు యితరులపై వారి మాట పలుకులతో వారిని కదలించుదురు. అందరమును నాయకత్వమును కలిగియున్నాము. అది మనకు బిరుదుగా రాలేదు. అది జీవితమునందు మనము పోషించు పాత్ర.

కొన్నిసార్లు మనము మంచి నాయకుడనగా స్నేహభావమును కలిగి యుండుటయని తలంచుదుము. అట్లు కాదు. లేక అందరితో పేరుగడించినవాడు. అదియును కాదు. నేనైతే అట్టివాడను కాను. నెమ్మదిపరుడను. ఒకరిని వెంబడించువాడనే కాని నాయకుడను కాను.

నేను కుటుంబమునందు, సంఘమందు దైవభక్తిగల ఒక నాయకునిగా నుండుట ఎట్లో నేర్చుకొనవలసి వచ్చెను. దేవుడు నన్ను కొన్ని సంవత్సరములుగా ఆ రీతిగా నాలో అభివృద్ధి తెచ్చుచుండెను. నాయకత్వమును నేర్చుకొంటిని. ఒక మంచి నాయకునిగా ఎట్లుండవలెనో యితరులను చూచుచు నేర్చుకొంటిని. కొన్ని సంవత్సరములు నాయకత్వ సూచనలేమిటో నేర్చుకొంటిని. బైబిలు వ్యక్తుల జీవితముల నుండి మంచి నాయకత్వ విలువలను నేర్చుకొంటిని. బైబిలును మించిన మరొక పుస్తకము లేదు. దైవజనులను మించిన వారెవరును లేరు. దేవుడు వారిలో పనిచేసెను. వారి మాదిరిని పాటించుచు దేవుడు కోరు మార్గములో మనము నడువగలము.

ప్రతి సంవత్సరము హిందూ దేశమునందు బైబిలు నాయకుల వలె వస్త్రము ధరించి నేనే అతనిగా యెంచుకొనుచు ఆ వ్యక్తి యొక్క కథను చెప్పుదును. నాయకత్వ పాఠములను వారి జీవితముల నుండి తీసుకొని వాటినే నేటి నాయకులకు వర్తింప జేయుదును. వారికి బోధించిన పాఠములనే నేను ఈ పుస్తకరూపముగా చేసితిని. బైబిలు నాయకులు వివిధ రీతులుగా నుండు వ్యక్తిత్వము, నిపుణత, సామర్థ్యము మరియు బలహీనత గలిగినవారు. వారు చేసిన మంచి మరియు చెడు క్రియల నుండి పాఠము నేర్చుకొనగలము. ప్రతి యొక్కరు వేరువేరుగా నున్నవారే. వారి నాయకత్వమును వేరుగా నున్నదే. అందరికిని ఒకే విధానము లేకుండెను. అందరమును వేరుగా నున్నందున మన నాయకత్వము కూడ వేరుగా నుండునదే.

బైబిలు వ్యక్తుల జీవితములను పఠించునపుడు వారితో గుర్తింపబడు వారు జ్ఞాపకమునకు వచ్చెదరు. నాకు మోషే జీవితమెంతో సహాయపడెను. నేను బహుగా కోరిన జీవితము మోషేకు చెందినది. నాయకుని కర్తవ్యమును ఎక్కువగా నేర్చుకొంటిని. అటువంటి వ్యక్తులను నీవును కలిసికొనగలవు. వారి జీవితములను పఠించి ఎక్కువగా జీవిత శైలిని నేర్చుకొనుము.

వీరి జీవితములను చూచుటలో దైవభక్తిగల నాయకత్వములోని మూడు ప్రధాన భాగములను గమనించగలము:

మొదటిది. తన గమ్యమును నాయకుడెరుగవలెను. గురిలేనిదే అక్కడికి చేరుట అసాధ్యము. నా జీవితము నందు దేవుని గురి ఏమై యున్నదో తెలియని యెడల దాని చేరుట కేలాగు ఎరిగి తెలిసికొందును? నా సంఘ విషయమై దేవునికి గల యేర్పాటు యేమై యున్నదో తెలియని యెడల నా సంఘస్తులనేలాగు నడిపించగలను? నా పరిచర్య ప్రారంభము నందు నా సంఘము ఎంతో పెద్దదిగా ఎదిగిన సంఘముగా నుండవలెనని కోరితిని. అట్లు కాలేదు. నా పరిచర్యలో అట్లు జరుగుట దేవుని కోరిక కాదు. దేవుని నుండి వినుటకు ముందు నేర్చుకొంటిని. నా జీవితమందును, సంఘమందును దేవుడు చేయవలసినదేదో దానిని ఆయన ఆత్మ తెలియజేయునట్లు వేచియుంటిని.

రెండవదిగా దైవభక్తి గల నాయకుడు తనను దేవుడు ఏ స్థలమునకు వెళ్లమని కోరునో అక్కడికెళ్లవలెను. గురిని యెరుగుటయు, గమ్యమును చేరుటయు రెండు కూడా ముఖ్యమే. నా సంఘమును దేవుడు బోధించు

వైద్యశాలగా రోగులు స్వస్థత పొందునట్లు యెదుగవలెనని కోరితిని. అట్లుండునట్లు చేయుటకు దేవుడు నా బోధను, హితోపదేశమును మరియు యితరులతో కలిసి పనిచేయునట్లును వారు ఆత్మీయ జీవితమునందు యెదుగునట్లు దేవుడు వాడుకొనెను. దేవుడు దేనిని సాధించునట్లు ప్రతి నాయకుని కోరునో, దానినేరీతిగా చేయవలెనో నేర్చుకొనుట తెలిసికొనవలెను.

మూడవదిగా, మన మెక్కడికి వెళ్లుదుమో, ఎట్లు అక్కడికి చేరెదమో తెలిసికొనిన పిదప ఒక మంచి నాయకుడు తనతో యితరుల నెట్లు తీసికొనవలెనో యెరుగవలెను. ఇతరులతో కలిసి పనిచేయుట ప్రాముఖ్యము. కొందరు నాయకులు వారెక్కడి కెళ్లుదురో, ఏలాగు వెళ్లుదురో తెలిసికొనియుందురు. కాని యితరులు వెంబడించునట్లు చేసికొనలేరు. వీటికి గల కారణములు : అహంకారము, అధికారము, ప్రేమలేని తనము మరియు వారియెడల గౌరవము లేకుండుటయే. ఇతరులైతే వారిని వెంబడించు వారిని ప్రేమించుచు, వారిని గౌరవించుచు వారు క్షేమముగా నుండునట్లు కోరుచుందురు. వారి యెడల స్నేహభావము చూపుచు వారి మెప్పుకోరుదురు. కాని వారిని దేవుడు ఎక్కడికి నడిపించుమని కోరెనో అక్కడికి నడిపించలేరు. వారి వ్యక్తిత్వము యితరుల నాకర్షించును కాని వారిని క్రీస్తునందలి యెదుగుదలకు తీసికొని రాలేరు.

ఒక దైవభక్తి గల నాయకుడు తన మాటలు, మాదిరి, మరియు శీలము ద్వారా యితరుల నాకర్షించవలెను. యితరులు వెంబడించురీతిగా ప్రవర్తించవలెను. ప్రేమ మరియు జాలి ప్రదర్శించుచు వారి విషయమైన

శ్రద్ధ తీసికొనుచు వారి నాకర్షించవలెనని వారితో సంభాషించినను ప్రజలు నన్ను గౌరవించిన యెడల నన్ను వెంబడించెదరు. నాలోని యదార్థత మరియు నమ్మకత్వమును గుర్తించినపుడు నన్ను వెంబడించెదరు. నాయకులు అందరును యిట్లుండవలసినదే.

నీవు నాయకుడవై యుండునట్లు దేవుడు యేర్పరచుకొనెను. ఇతర నాయకుల వలె వుండుటకు కాదు దేవుడు ప్రసాదించిన తలాంతులను వాడుచుండవలెను. ఈ పుస్తకములో నున్నవారి వలెనే అందరును వేరుగా నున్నవారే. మనము ప్రజలందరును యేసును యెరుగునట్లును, ఆత్మీయజీవితములో యెదుగునట్లు సహాయపడు నాయకులము. ప్రతి యొక్కరికి ఒకే విధానము లేదు. కాని ఈ పుస్తకమందలి సూచనలు బైబిలు నాయకుల నుండి తీసికొని వాటి నభ్యసించవచ్చును. దేవుడేమి చెప్పుచున్నాడో విని, చదువుట ద్వారా వాటిని ప్రయోగించుచుండుట అవసరము ఒక శ్రేష్ఠమగు నాయకునిగా అది నిన్ను నడిపించును. ఇది దీర్ఘకాల విధానము. ఈ పుస్తకమును వ్రాయుటలోని కారణము నీవొక దైవభక్తిగల నాయకుడవై ఎదుగుటకు సహాయము చేయుననియే.

# 2. యోసేపు జీవితము నుండి నాయకత్వ పాఠములు

**ఆదికాండము 37-50 అధ్యాయములను చదువుము.**



కొన్నిసార్లు ఇతరులనుభవించు కష్టములు నాయకులకు కలుగవని తలంచుదుము. జీవిత శోధనలు మరియు సవాళ్లు వారు అనుభవించరని తలంచుదుము. వారు ఆత్మీయ జీవితము నందు యెదిగి యున్నారని యితరులను నడిపించగలరని తెలియు చున్నది. కాని, అది నిజము కాదు. జీవితమునందు ప్రతి యొక్కరును కష్టములు మరియు సవాళ్ల నెదుర్కొందురు. గొప్ప నాయకులు వారి జీవితము నందు కష్ట సమయము ననుభవించినవారే. దానియేలు తన కుటుంబము నుండి తీసికొనబడి బబులోను దేశమునందు బంధకములో నుంచబడెను. తన సహోదరులు తృణీకరించి నందున దావీదు తన తండ్రి చేత మరువబడుటతో సమూయేలు వచ్చి అతనిని తదుపరి రాజుగా అభిషేకించెను. యోసేపు కూడ తన జీవితములో బహు కష్టము ననుభవించెను. అతని జీవితమును చూచుచు అతని నుండి దైవభక్తిగల నాయకత్వ పాఠములను నేర్చుకొనగలము.

## 1. దైవభక్తిగల నాయకుడు తన పరిస్థితులను మించి అధిగమించును

యోసేపు కుటుంబ చరిత్రయందు అతడు ఒక మంచి నాయకుడగునని యేమాత్రము తలంచలేదు. ఆతని తండ్రి పిల్లలు నలుగురు భార్యలకు పుట్టినవారై సరిగా ప్రవర్తించలేదు. అతనికి పదిమంది సవతి సహోదరులుండిరి. అతని తండ్రి అతని తల్లినెక్కువగా ప్రేమించెను. అతి ప్రియకుమారుడై యుండెను. ఇతర సహోదరులవలె తన యిష్టప్రకారము నడువకుండెను. దానిని బట్టి తన సహోదరులు అసూయపడి అతని యెడల కీడు తలపెట్టిరి. అట్టి పెరుగుదల యందు జీవితములో సమస్యలెదుర్కొనెను. కాని యోసేపు వీటిపైగానుండు జీవితముతో శక్తితో యెదిగియుండెను. సవాలులన్నియు అతనిలో యెదుగుదలను తెచ్చెను. పరిస్థితులను స్వాధీనము చేసికొనుచు బహుశ్రేష్ఠునిగా కనబడెను.

నేడు మనకును ఎంపిక చేసికొనవలసినవి ఉన్నవి. దేవుని కొరకు జీవించ వలెనా లేక మనకొరకే జీవించవలెనా అనువాటిలో దేనిని ఎంపిక చేసికొందుము? కష్టములను చూచి వదలుకొందమా లేక ఏమైనను సరే ముందుకు సాగుదమా? యోసేపు వలెనే బహుకష్టతరమగు బాల్యదశ ఉండవచ్చును. ఇతరులకు కష్టము లేవియు లేకుండుట చూచి వారి యెడల ద్వేషము కలిగి యుందుమేమో! లేక దేవుని కోరిక ప్రకారము మంచిగా నుండుటకు కష్టపడి ప్రవర్తించుదమా! యోసేపు ఎంపిక చేసికొనిన రీతిగా మనము కూడా అటువంటిది చేసికొనగలము.

ఒక సంఘకాపరిగా నుండవలెనా లేక సంఘనాయకునిగా

నుండవలెనా యను ఎంపిక చేసికొనవలెను. తనకు పరిచర్య చేయవలెనని దేవుడు బలవంతం చేయడు. సమస్యలను పరిష్కరించుట లేక వాటికి లొంగిపోవుట దేనిని ఎన్నుకొందుము? దేవుడు కోరికను కలుగజేసి పరిచర్య చేయునట్లు ప్రోత్సహించును. తన ఆత్మద్వారా వరములిచ్చును. కాని దేవుడుపిలిచినపుడు ఆయనను వెంబడించుటయా లేదా యని మనమే నిర్ణయించుకొనవలెను. నాయకుడై యుండుట సులభము కాదు. అతిశయించుచు అహంకారము కలిగి పరిచర్య చేసిన యెడల లేక అందరి గమనము కోరుచుండిన యెడల అపజయము ననుభవించెదము. సాతానుని ఎదిరింపులను అనుమతించిన యెడల, యితరులు మనలను ఓడించిన యెడల ముందుకు కొనసాగలేము. కాని దేవుడు మనకు ప్రసాదించిన ఒకే జీవితముతో శ్రేష్ఠమగు దానిని చేసిన యెడల యోసేపు వలెనే దైవికముగా సమస్తమును చేయగలము. ఈ పుస్తకము నందు యిది మొదటి పాఠము. మరియు మనకు కూడా మొదటిదియే. దేవుని కోరిక ననుసరించి ఆయనను సేవించుటకు ప్రతిష్ఠించుకొనని యెడల ఈ పుస్తకము నందలి యితర సలహాలు, హెచ్చరికలు మనకు వర్తించవు.

గతించిన కాలములోనైన, భవిష్యత్తులోనైన ఎన్ని ఆటంకములు వచ్చినను, కష్టము లెదుర్కొనుచున్నను వాటినిదివరకే అనుభవించి యున్నను నీవు దేవుని వెంబడించుచు సేవించెదవా? ఏమి జరిగినను యథార్థతతో కొనసాగగలవా? సంఘకాపరిగా నుండుటలోని మెప్పు నను భవించుటకు మాత్రమే పరిచర్యలో నున్నావా? సంఘనాయకుడై యున్నావా? దైవభక్తిగల నాయకుడై యుండుట సులభమగు కార్యము కాదు. సంపూర్ణ సమర్పణ లేకపోతే ముగింపు వరకు సేవలో కొనసాగలేరు.

## 2. దైవభక్తిగల నాయకునికి జీవితమునందు దేవుని ప్రణాళిక వుండును

తన జీవితము నందు ఎదుర్కొనిన కష్టములను చూచియు యోసేపు వాటిని తృణీకరించి దేవుని సేవించుటలో కొనసాగుటకు గల కారణములలో నొకటి దేవుడు అతని కిచ్చిన కలయే. యేసేపు దానిని జ్ఞాపకము చేసుకొని నమ్మెను (ఆది కాండము 37:5-9). దేవుడు తనను పిలిచి తన కుటుంబమును నడిపించుమని చెప్పెను. ఆ గురిపైనే దృష్టినుంచుకొనెను. తన కొరకు దేవుడు కోరినదదియే, అతడు అతిశయించలేదు. మొదటి స్థానమును కోరలేదు. ఎందుకనగా తన యెడల దేవుని యేర్పాటు అదియే అని తెలిసికొనెను. జీవితము ఎత్తు పల్లములు తెచ్చినను తన జీవితములోని దేవుని యేర్పాటును జ్ఞాపకములో నుంచుకొనెను. మరియు ఒక దినమున తన కుటుంబమును రక్షించుటకు దేవుడు తనను వాడుకొనుననియు యెరిగెను. కాబట్టి ఏమి జరిగినను తన జీవితమందలి దేవుని యేర్పాటుపై నిరీక్షణ నుంచుకొనెను. బానిసగా బంధకములో నున్నపుడును, చెరసాలలో బంధించబడి నపుడును, తన యెడల దేవునికి గల యేర్పాటును, కారణమును మరువలేదు.

నేడును ప్రతి యొక్కరిపై దేవుని యేర్పాటు ఉన్నది. హృదయములో నొక కోరిక యుంచును. ఆయన కొరకే ఏదో చేయుమని కోరెను. అది మన హృదయములను నడిపించు వెలుగై యుండును. లేక పెద్ద పరిచర్య కొరకును కానేరదు. ఇట్టివి మనకు రావచ్చును. రాకపోవచ్చును. కోరదగినదేమనగా, నీలో దేవుడు పెట్టిన యేర్పాటు మరియు కారణమును జరిగించుటయే. నేను యువకునిగా నుండినపుడు దేవుడు నాకు ఒక

సంఘకాపరి నుండి దేవునికి దగ్గరగా యెదుగునట్లు ప్రజలకు సహాయపడ వలెనను దర్శనము నిచ్చెను. తదుపరి దేవుడు నా హృదయమునందు ఒక కోరిక పెట్టెను: హిందూ దేశములోని సంఘకాపరులకు సహాయము చేయుట! ఆటంకములు, సమస్యలు ఎన్నియో యుండెను. కాని వాటిననుభవించునట్లు కోరెను. కాబట్టి నేను దాని నెరవేర్చుటకు విధేయతతో కొనసాగుచుంటిని.

నీ జీవితములో దేవుని యేర్పాటు, కారణము యేమైయుండెను? తనను సేవించునట్లు ఎటువంటి కోరికను నీ హృదయములో పెట్టెను? ఎటువంటి గురిని సాధించునట్లు చేసెను? ఏ కారణము చేత నీవు భూమిమీద జీవించుచున్నావు?

## 3. దైవభక్తిగల నాయకుడు ఆటంకములున్నను పట్టుదల కలిగియుండును

ఒక నాయకుడు దేవుని కోరికలను అనుసరించుచు జీవితములో దేవుని యేర్పాటు మరియు ఆయన కారణమును వెంబడించునని చూచితిమి. కాని ఈ రెండింటితో పాటు జతపరచవలసినది మరియొకటి యున్నది. కాని యోసేపునకు కష్టతరమగు సమయములందు తన కుటుంబమును నడిపించునని చూపెను. అయినను రాబోవు 15 లేక 20 సంవత్సరముల వరకు వేచి యుండవలెనని చెప్పెను. అతని సహోదరుల వలన యోసేపు ఒక గోతిలో పడవేయబడెను. తదుపరి ఐగుప్తులో బానిసగా నుండునట్లు అమ్మబడెను. ఇట్టి పరిస్థితులందు తన యథార్థతను ప్రదర్శించెను. అతని యథార్థత అతనిని చెరసాలలో

బంధించుటకు కారణమాయెను. అందరి చేత ముఖ్యముగా దేవునిచేత ఇతరుల చేత మరువబడిన వానిగా నుండెను. అయినను తన హృదయము నందు యథార్థత కలిగి యుండెను. అతడు ఓర్పును ప్రదర్శించెను. సహనము కనబరచెను. దేవుడు చెప్పినది సత్యముగా జరిగినది. జీవితము నందు తదుపరి స్థితిలో అతడు ప్రదర్శించిన ఓర్పు, సహనములకు ఫలితముగా సుఖము ననుభవించెను.

నాయకత్వము ఓర్పును, సహనమును కలిగియున్నది. ఈ సత్యమునే పౌలు తన ఆత్మీయకుమారుడైన తిమోతికి చెప్పెను (1 తిమోతి 4:16; 2 తిమోతి 2:3). ఒక దైవభక్తి గల నాయకునికి ఈ హెచ్చరిక యెంతో అవసరము. నాకు ఓర్పును, సహనమును నేర్పుటకు దేవుడు శోధనలను, కష్టములను వాడుకొనెను. నాకు బహుగా నచ్చిన కథలలో నొకటి కుందేలు మరియు తాబేలు! కుందేలు తాను చురుకైనదని పరుగు పందెములో తాబేలును సులభముగా ఓడించగలదని యెంచెను. కాబట్టి కుందేలు కొంత సమయము పరుగెత్తి, కొంత సమయము విశ్రమించెను. మరికొంతసేపు పరుగెత్తి తదుపరి నిద్రపోయెను. కాని తాబేలు నిదానముగానే నడుచుచు ఎక్కడైనను నిలబడక కొనసాగెను. కుందేలు యింకను నిద్రించుచుండగా తాబేలు పందెములో గెలిచెను. ఈ కథలోని నీతి యేమనగా మనము తొందరపడక సహనముతో కొనసాగుచుండవలెననియే.

దైవభక్తిగల నాయకులందరును అన్నియు తలంచిన రీతిగా జరుగనపుడు సహనమును ప్రదర్శించవలసినదే. ఏదో తప్పు ఉన్నదని లేక దేవుడు నీతో లేడని తలంచకూడదు. ఇటువంటి వాటిని కలిగించి

దేవుడు మనలో యెదుగుదల తెచ్చును. విశ్వాసమును హెచ్చు చేయును. మనము యేసును పోలియుండునట్లు చేయును. సాతానుడైతే మనలను నిరుత్సాహపరచి వదలివేయునట్లు చేయును. యోసేపు విషయము నందు సాతానుడు ఓడిపోయెను. కాని యితరులతో వాడు గెలిచెను. మనము యేసును పోలియుండుననుటకు దేవుడిటువంటి వాటిని అనుమతించును.

నేడు నీవు కోరినరీతిగా జీవితము నందు జరుగలేదను సమస్య నెదుర్కొను చున్నావా? యేసును ఓర్పుతో నమ్ముకొనుచు యథార్థతతో ఏమి జరిగినను పరిచర్యలో కొనసాగుచున్నావా? నిదానముగా నున్నను కదలుచు పోవుచున్నావా? లేక గొప్ప విశ్వాసమును కలిగియుండియు, దేవునితో సన్నిహితముగా నుండియు కష్టనష్టముల నెదుర్కొనుచు తొలగిపోయి దేవునికి దూరమగుచున్నావా?

## 4. దైవభక్తిగల నాయకుడు ఆంతర్యశీలమును కలిగియుండును

"యోసేపు బహుసుందరుడు మరియు ఆజానుబాహువు" అని బైబిలు చెప్పుచున్నది (ఆదికాండము 39:6). అతడు బుద్ధిమంతుడు. పోతిఫరు గృహము నందు అతడు చేసిన మంచి క్రియకు దేవుడతని వర్ధిల్లజేసెను (ఆదికాండము 39:2). అయినను వీటిని అతడు తన మెప్పుకొరకు వాడుకొనలేదు. కాని దేవుని సేవ యందే వాడెను. పోతిఫరు భార్య అతని శోధించినపుడు యోసేపు ఎవరికిని తెలియకుండనే పాపము చేసి యుండవచ్చును. దేవుడతనిని వదలిపెట్టి యుండినందున దేవుని యెడల యథార్థముగా ఎందుకు ఉండవలెనని తలంచి యుండవచ్చును. పాపము చేయు అవకాశమును తీసికొన యుండవచ్చును. కాని అట్లు చేయలేదు.

ఎందుకనగా అతనిలోని ఆంతర్య శీలము శ్రేష్ఠమైనది (ఆది కాండము 39:9).

ఇట్టిది మన వరములు, తలాంతులు వాడుకొను దానికి అభ్యసించుచున్నది. దేవుడు మనకు ఆత్మీయవరముల నిచ్చి వాటితో పరిచర్య చేయుమని చెప్పెను. వాటితో అతిశయించుటకుకాదు. దేవుడు వారితో చేసిన మంచి కార్యములకు కొందరు సంఘకాపరులు ఆ ఘనత వారిదేయని తలంచుదురు. మరికొందరు ఎవరును చూచుట లేరని సోమరులై యుండవచ్చును లేక పాపములో నుండవచ్చును. ఒక దైవభక్తిగల నాయకుడు సరియైన దానినే చేయును. ఎవరు చూడకపోయినను మంచినే చేయును. దీనిని యోసేపు తన బాల్యదశయందే నేర్చుకొనెను. క్లిష్ట పరిస్థితులందు దేవుని వెంబడించునట్లు తీర్మానము చేసికొనెను. పోతిఫరు బానిసగా అట్లే చేసెను.

నీవు ఒంటరిగా నున్నపుడు కొందరు చూచినయెడల యితరులు చూచుచుండగనే నీవేమైయున్నావో దానికన్నను వేరుగా నున్నట్లు చూచెదరా? వారు నీ తలంపులను తెలిసుకొనగలిగిన యెడల నీ మనస్సు నందు నిర్దేవత్వమును, పాపపు క్రియలను కనుగొందురా? నీవు ఆంతర్యము నందు మంచి శీలము గలవాడవని దేవుడు చెప్పునా లేక నీవు వేషధారివని చెప్పునా? పాపము నొప్పుకొనుచు సహాయపడుమని భక్తిగల జీవితమును జీవించుటకు సహాయపడుమని దేవుని కోరుచు ఆంతర్యశీలము కలిగియుండుము.

## 5. దైవభక్తిగల నాయకుడు ఏ స్థలమందైనను సేవ చేయును

తన జీవితమునందు యోసేపు సుఖముగా గడుపలేదు. దుఃఖము అనుభవించు చుండినందున బానిసగా నుండినపుడే పారిపోయి యుండవచ్చును. కాని అట్లు చేయలేదు. పోతిఫరు యెదుట నమ్మకస్థుడై యుండెను. మంచితనముతో పరిచర్య చేసెను. యథార్థతతో దేవుని వెంబడించుచు, పోతిఫరు భార్యతో పాపము చేయకుండినను చెరసాల ననుభవించెను. దేవునిచే వదలివేయబడినట్లుండెను. దేవుని వెంబడించక దేవునిపై కోపమును పెట్టుకొనియుండవచ్చును. కాని దానికి బదులుగా చెరసాయందుండియు యితర ఖైదీలకు సహాయపడుచుండెను. దేవుడే తనకు విడుదల కలుగజేయునని వేచియుండలేదు. యోసేపు ఉన్నంతవరకు దేవుడు పోతిఫరు కుటుంబమును వర్ధిల్ల జేసెను. చెరసాలలో యోసేపు చేసిన కార్యములను దీవించెను.

యథార్థతతో సేవించినపుడు దేవుడు దీవించుచు మన కార్యమును వర్ధిల్ల జేయును. ఎక్కువ ఫలితము కనబడకపోవచ్చును. కాని దేవుడు మన కార్యమును వాడుకొనును. "గృహ నిర్వాహకులలో ప్రతివాడును నమ్మకమైన వాడై యుండుట అవశ్యకము" (1 కొరింథి 4:2). మనమెక్కడున్నను యథార్థతను సేవించినపుడు దేవుడు దానిని ఫలింపజేయును. యథార్థతను ప్రదర్శించుచు దేవుడు మనలనెక్కడ యుంచెనో ఆ స్థలము నందు పనిచేయుమని కోరుచున్నాడు.

నీవెక్కడ దేవునిచే పంపబడితివో అక్కడ సంతోషముగా నున్నావా? లేక ఇంకను మెరుగైన దానిని కోరుచున్నావా? లాభము దొరుకకపోయినను

యోసేపు వలె యితరులకు సహాయపడగలవా?

## 6. దైవభక్తిగల నాయకునికి జ్ఞాన వివేకములుండును

ఇతరులు గ్రహించని ఘట్టములు యోసేపు జీవితములో దేవుని హస్తము ఉన్నదని యోసేపు నమ్మెను. అతని అనుభవమంతయును దేవుని అనుమతి చెందినవని గ్రహించెను. గొప్ప కరవు కారణముగా తన కుటుంబమును రక్షించుటకు చెరసాలకు వెళ్లెను (ఆదికాండము 45:5-8). సహోదరులు తనకు హాని పెట్టదలచినను దేవుడు అట్టి స్థితిని వారి లాభము కొరకై వాడుకొనెను. "మీరు నాకు కీడు చేయనుద్దేశించితిరి గాని ... బహుప్రజలను బ్రదికించునట్లుగా అది మేలుకే దేవుడు ఉద్దేశించెను" (ఆదికాండము 50:20). తన చుట్టు జరుగు విషయములను యోసేపు చూచినపుడు వాటి వెనుక దేవుని యేర్పాట్లు ఉన్నట్లు యోసేపు గుర్తించెను. తన యెడల దేవునికి గల యేర్పాటును, కారణమును జ్ఞాపకము చేసికొని వాటిని నమ్మెను. దేవుడు చూచిన రీతిగా సమస్తమును చూచెను. అట్లు చేయుటవలన జ్ఞానము సంపాదించెను. నాయకులుగా మనమును దేవుని హస్తమును మన పరిచర్యలో గుర్తించుకొనుచు మన జీవితములోని ఆయన కార్యమును గ్రహించవలెను. దేవుని గొప్ప యేర్పాటును చూచుచు దానిపై ఆధారపడి జ్ఞానమును వాడుచు తగిన తీర్మానములను చేసికొనగలము.

దేవుడు ఏ రీతిగా పరిచర్యలో నిన్ను వాడుకొనుచున్నాడు? ఇది వరకు దేవుడు నిన్ను ఏ రీతిగా వాడుకొనియుండెనో జ్ఞాపకము చేసుకొనగలవా? నీ యెడల దేవునికి గల కారణమును జ్ఞాపకములో

నుంచుకొని యున్నావా? లేక కష్టములను, సవాలును మాత్రమే ధ్యానించుకొనుచున్నావా? భవిష్యత్తులో దేవుడు నిన్ను వాడుకొనుటలో కొనసాగునని నమ్ముచున్నావా?

## 7. దైవభక్తిగల నాయకుడు యితరులను ప్రేమించును మరియు క్షమించుచుండును.

యోసేపు తన సహోదరులను వారు తన యెడల చేసిన కీడును తలంచక వారిని క్షమించెను. వారు తిరిగి కలిసికొనక ముందు అనేక సంవత్సరములకు ముందే యిట్లు జరిగెను. అతని సహోదరులు క్షమించబడుటకు అర్హత లేకుండెను. క్షమించుమని వారును కోరియుండలేదు. అతడు వారిని క్షమించవలసిన తరుణము లేకుండెను. అసలు విషయమేమనగా యోసేపు స్థితి గొప్పస్థితి. న్యాయమును జరిపించు స్థితియే. వారియెడల పగ తీర్చు సమయమే. ఆహార ధాన్యము కొరకు వారు వచ్చినపుడు వారిని బంధించి యుండవచ్చును. కాని ప్రేమను ప్రదర్శించెను. వారి భవిష్యత్తు నాలోచించెను. వారి యెడట కఠినత్వము కనబరచలేదు. కాని కనికరము చూపెను. వారినే మాత్రము క్షమించకూడదను తలంపును కలిగి యుండిన యెడల అతడు దైవభక్తి గలవాడై యుండకపోవును. కఠినత్వమును కూర్చుకొని యుండినచో యది విషముగా మారియుండును.

అదే రీతిగా నేడును నాయకులకు వర్తించుచున్నది. పై నుదహరించబడిన లక్షణములన్నియు కలిగి యుండవచ్చును. అయినను కనికరము మరియు క్షమించు గుణములు లేకుండిన యెడల యది

ఆలోచించవలసిన విషయమే. 1 కోరింథి 13 అధ్యాయము చెప్పుచున్నదేమనగా మనలో ప్రేమ లేని యెడల మనలో యేమియు లేనట్లే. ఎంతో పరిచర్య చేసినను అది శూన్యమే. ఇతరుల యెడల జాలి కలిగి యుండవలెను. వారు బాధపెట్టినపుడు వారిని క్షమించవలసినదే. వారు మనలను క్షమాపణ అడుగనవసరము లేదు. యేసు మనలను ఎప్పుడో క్షమించియుండెను. ఆయనను పోలియుండునట్లు మనమును క్షమించువారమై యుండవలెను. దేవుడు అట్లు చేయుమని ఆజ్ఞాపించి యున్నాడు (ఎఫెసి 4:31-32, కొలస్సి 3:12-13, మత్తయి 18:21-35; 6:14-15).

నీవు యింకను క్షమించని వారెవరైన ఉన్నారా? దేవుడు నిన్ను క్షమించిన రీతిగా నీవు యితరులను క్షమించుటకు సిద్ధపడియున్నావా? ఇతరుల యెడల ప్రేమ మరియు జాలి కలిగియున్నావా? లేకుండిన యెడల అట్లు కలుగజేయుమని దేవునికి ప్రార్థించుము.

**8. దైవభక్తిగల నాయకుడు దేవునిచే దీవించబడి ఆయనచే వాడబడును**

ఎన్నో కష్టములనుభవించి యుండినను యోసేపు తన జీవితమునందు దేవుని హస్తము గలదని యెరిగియుండెను. తన మొదటి కుమారునికి మనష్షే అని పేరుపెట్టెను. ఆ పేరునకు గల అర్థము దేవుడు తన కష్టములన్నిటిని మరుచునట్లు చేసెను (ఆదికాండము 41:51). మరియు రెండవ కుమారునికి ఎఫ్రాయిము అని పేరుపెట్టెను. ఎందుకనగా దేవుడతనిని ఫలవంతముగా చేసెను (ఆదికాండము 41:52). దేవుడతని విడిచిపెట్టెనను తలంపు యుండినను దేవుని సేవించుటకు నిర్ణయించు

కొనెను. దాని ఫలితముగా దేవుడతనిని తన మహిమార్థమై వాడుకొనెను.

దేవుడు మనలను కూడ వాడుకొనును. దానికి గల షరతు యథార్థతయే.

ఇది వరకు దేవుడు నిన్ను వాడుకొనియుండిన విధమును, దీవించిన రీతిని చూపు జాబితా లిఖించుము. దేవుడు నీ జీవితములో చేసిన వాటిని యితరులును తెలిసికొనునట్లు చేయుము. దేవునికి కృతజ్ఞత చెల్లించుము. భవిష్యత్తులో చేయబోవు వాటి కొరకును కృతజ్ఞత చెప్పుము.

యోసేపు జీవితము నుండి దైవభక్తిగల నాయకునిగా నుండుట కొరకు :

1. పరిస్థితులకు మించి ప్రవర్తించవలెను.
2. జీవితమునందు దేవుడు ప్రసాదించిన కారణమును కలిగి యుండవలెను.
3. ఆటంకములుండినను సహించుచుండవలెను.
4. ఆంతర్యశీలమును కలిగి యుండవలెను.
5. ఎక్కడకు పంపబడినను సేవను కొనసాగించవలెను.
6. జ్ఞానము మరియు వివేకమును కలిగియుండవలెను.
7. ప్రేమించుచు యితరులను క్షమించుచుండవలెను.
8. దేవునిచే దీవించబడుచు, ఆయనచే వాడబడవలెను.

ఈ లక్షణములు నీలో నున్నవా? ఇప్పుడు నీలో ఏవి కనబడుచున్నవి? ఏవి లేకుండ యున్నవి? అన్నిటిని పొందుట కొరకు నీకేమి అవసరమై యున్నవి. వీటిని గూర్చి ప్రార్థించుచు అన్నిటిని పొందునట్లు దేవునికి ప్రార్థించుము.

# 3. మోషే జీవితమునుండి నాయకత్వ పాఠములు



**నిర్గమకాండము 1-19; సంఖ్యా కాండము 12-14; అపొస్తలుల కార్యములు 7:20-43; హెబ్రీ 11:23-29 చదువుము.**

బైబిలు నందు మోషే అను నాయకుడు ప్రముఖులలో నొకడు. మరియు యూదా చరిత్రయందును ప్రముఖుడు. బైబిలునందు అతడు నాకెంతో ప్రియమగునాయకుడు. అతడు పొందిన పోరాటములు మరియు బలహీనతలు నాకును ఉండెను. అతడు వాటిని జయించిన రీతిగా నేను ఆయన నుండి నేర్చుకొంటిని. బైబిలునందలి కొన్ని పుస్తకములు అతని దీర్ఘ మరియు ఫలవంతమగు జీవితమును వివరించియున్నవి. అతడు 120 సంవత్సరములు జీవించెను. మొదటి నలువది సంవత్సరములందు అతడు ఎవరో ఒకరై యుండెను. రెండవ నలువది సంవత్సరములందు అతడు గుర్తింపు లేనివాడై యుండెను. చివరి నలువది సంవత్సరములందు గుర్తింపు ఏమియు లేనివానితో దేవుడే విధముగా తన మహిమార్థమై వాడుకొనునో అతడే నేర్చుకొనెను. మోషే విశ్వాసము గల వ్యక్తి. విధేయుడు మరియు నమ్మకస్థుడు. తన జీవితమునందు దేవుని వాక్యము మరియు ప్రార్థన గలవాడు. అతని

జీవితమునందు అపజయము లెన్నింటినో పొంది యుండెను. అయినను దేవుని కృపద్వారా ముందుకు కొనసాగు చుండెను. అతడు నాయకునిగా నుండ కోరలేదు. కాని దానినే దేవుడు తన నుండి కోరుచున్నాడని యెరుగుటతో విధేయుడాయెను. దాని నంగీకరించెను. పవిత్రుడై యుండక పోయినను దేవుని కోరిక ప్రకారము ప్రయత్నించెను. అతని జీవితము నుండి మనము ప్రాముఖ్యమగు పాఠములను నేర్చుకొనగలము.

## 1. దైవభక్తిగల నాయకుడు తన జీవితము, పరిచర్యలకు గల దేవుని యేర్పాటును పాటించును

ఎల్లప్పుడు దేవుని యేర్పాటు ఉనికిలో నున్నది. యూదులు ఐగుప్తు నుండి ప్రమాణ దేశమునకు రావలెనను యేర్పాటు ఉండెను (నిర్గమకాండము 3:7,8; 23:31). మోషే జీవిత విషయ మందును దేవునికి యేర్పాటు ఉండెను. యూదులు ఐగుప్తు నుండి ప్రమాణదేశమునకు నడిపించుట (అపొస్తలుల కార్యములు 7:35-45). దేవుని యేర్పాటును మోషే తన ప్రజల కందించెను. వారును దానినే ఆశించిరి (నిర్గమకాండము 6:6-8). యూదుల కొరకు మోషే యేమాత్రము తన స్వంత యేర్పాటును పరిచయము చేయలేదు. మరియు యితర దేశములకు చెందిన ప్రజల వలె నుండునట్లు చేయుటకు ప్రయత్నించలేదు. వారి యెడల దేవుని యేర్పాటు ఏమై యున్నదో దానినే వెంబడింప దలచెను.

అదే రీతిగా మన యెడలను దేవునికి యేర్పాటు గలదు. అది యేమైయున్నదో తెలిసికొనుటయే మన ప్రథమ విధియై యున్నది. దానినే

వెంబడించవలసి యున్నది. కొందరు నాయకులు వారి ప్రణాళికలతో వచ్చి వాటిని దేవుడు దీవించి వాటిని నెరవేర్చునట్లు చేయుమని కోరుదురు. అట్టిది యే రీతిగానైనను జరుగదు. దానికి బదులుగా మన ఆంతర్యము నందు వినబడుచుండు స్వరమును వినుచుండవలెను. మన యెడల దేవునికి గల యేర్పాటు యేమైయున్నదో తెలిసికొనగలము. మన జీవితము మరియు పరిచర్య ఏ రీతిగా నుండునో తెలియజేయబడును. కొన్నిసార్లు దేవుడు మనమేమి చేయవలెనో చూపుట కొరకు ఒక కోరిక లేక భారమును మనపై పెట్టును. కొన్ని పెద్దవిగా నుండును. లేక చిన్నవిగా యుండును. కొన్నిసార్లు మనము కొనసాగునట్లు తెరచిన ద్వారముల వలె అవకాశములు కలిగించును.

మొదటి అధ్యాయము నందు ఒక నాయకుడు ఎక్కడికెళ్ళుచున్నాడో, అక్కడి కెట్లు చేరుచున్నాడో మరియు యితరులను ఏ రీతిగా తన వెంట తీసికొను వెళ్లు చున్నాడో తెలిసికొంటిమి. మోషే తన గమ్యము నెరిగియుండెను. దేవుడతనితో ప్రజలను ప్రమాణ దేశమునకు తీసికొని వెళ్లుమని చెప్పెను. దేవుడే అక్కడికి చేరుమార్గమును చూపెను. మోషే తన చివరి నలువది సంవత్సరములను ప్రజలను అక్కడికి నడిపించుటలో గడిపెను.

నీ జీవితము మరియు పరిచర్య యందు నీ గమ్యము నెరిగితివా? నీ వ్యక్తిగత యెదుగుదల యందు దేవుడు ఎటువంటి గురినిచ్చెను? నీ పరిచర్య గమ్యము ఏమై యున్నది? నీ కుటుంబము ద్వారా దేవుడేమి సాధించ వలెనని కోరుచున్నాడు? వీటిని తెలియని యెడల ప్రార్థించుము.

దేవుని మాట వినుము, ధ్యానించుము. ఆయనను వెంబడించుము, స్వంత యేర్పాటులను కోరకుము. నీ విషయములో దేవుని యేర్పాటును గ్రహించి దానిని వెంబడించుము.

## 2. దైవభక్తిగల నాయకుడు వినయమనస్కుడు

కొందరు వారిని మెచ్చుకొందురని నాయకులై యుండగోరు వారున్నారు. మరియు వారు ప్రాముఖ్యులని యితరులు తలంచుదరని నాయకులుగా నుండ గోరుచున్నారు. మరికొందరు నాయకులగుటకు యిష్టపడరు. ఎందుకనగా నాయకత్వములో నుండు కష్టమును, పోరాటములను గూర్చిన భయము ఉండుటయే. దానితోపాటు అపజయము, తృణీకరములుండునను భయము కూడ ఉన్నది. ఇట్లుండుటకుగల కారణము ఈ తలంపుల వెనుక ఉనికిలో నుండు అహంకారమే. అహంకారమనగా యితరుల కన్నను మనము మెరుగైన వారమను తలంపు ఉండుట కాదు. అది యితరులు మంచిగా నున్నట్లు మనము లేమను అర్థము కూడ ఉన్నది. ఇట్లు తలంచుకొనుటలో స్వార్థము ఉన్నది. ఎల్లప్పుడు తనను గూర్చియే తలంచుకొనుట! అట్టి తలంపు అహంకారమును పుట్టించును.

భయము, నిరాకరించబడుట మరియు యితర తలంపులతో పోరాడితిని. అటువంటి తలంపు నన్ను నాయకునిగా నుండకుండునట్లు ఆటంకపరచెను. సరియైన దానిని చేయుట కన్నను యితరులేమని తలంచుదురో యనుకొంటిని. మోషేకు ఇటువంటి పోరాటము ఉండెను, నాయకునిగా ఉండుట కిష్టము లేకుండెను. అతడు నాయకునిగా

ఉండలేనని ఐదుకారణములను చూపెను (నిర్గమకాండము 4వ అధ్యాయము). అపజయము నెదుర్కొనునని భయపడెను. ప్రజలు తనను వెంబడించరేమోనని తలంచెను. లేక ఏదైన తప్పు చేయునేమోనని యెంచుకొనెను. అదియే అహంకారమును కలిగియుండుటయై యున్నది. ఎట్లనగా దేవుని గూర్చి తలంచకుండ స్వకీయం తలంపును కలిగియుండుటయే. అయినను దేవుడు మోషేతో కలిసి ఓపికతో మోషేతో నుందునని చెప్పెను. సహాయపడుదునని చెప్పెను. జ్ఞానము మరియు శక్తికొరకు తనపై ఆధారపడినపుడు మంచి నాయకుడగునని చెప్పెను. మోషే వినయముగా నుండుట నేర్చుకొనెను. అందరిని మించిన సాత్వికుడని బైబిలు చెప్పెను (సంఖ్యాకాండము 12:3).

వినయ మనస్కుడై యుండుట ఎట్లు నేర్చుకొనెను? తనపై ఆధారపడునట్లు దేవుడు మోషే జీవితము నందుండిన పోరాటములను వాడుకొని అతనిపై కాక తనపై ఆధారపడునట్లు నేర్పెను. దేవుని వైపు చూచుచు భయమును వీడుట నేర్చుకొనెను. ఇతరుల భయము నుంచుకొని దేవునిపై విశ్వాసముంచుకొనలేము. ఒకటి మరొకదానిని పారద్రోలును. దేవుని యందలి తన విశ్వాసమును యెదుగు చేసికొనవలెనని మోషే నేర్చుకొనెను. కాబట్టి యది యితరుల భయమును మించి దేవుని విశ్వాసము ఉండెను.

దేవుని వెంబడించుటలో ఆటంకపరచునదేమైన ఉన్నదేమో యని దేవుని అడుగుము. స్వార్థము ఉన్నదేమో అని కూడ అడుగుము. ఇతరులేమైన అనుకొందురాయని తలంచుదువేమో, అపజయము మరియు

నిరాకరించు స్థితి వచ్చునేమో యను భయము ఉండవచ్చును. మోషేవలె ఏ రీతిగా వినయము ప్రదర్శించగలవు?

## 3. దైవభక్తిగల నాయకుడు యితరులకు ముఖ్యముగా కుటుంబీకులకు పరిచర్య చేయును

యేసు వచ్చి యుండిన కారణము పరిచర్య చేయుటయే (మత్తయి 20:28; మార్కు 10:45). తన శిష్యుల పాదములను కడిగెను (యోహాను 13). దైవభక్తిగల నాయకుడు యితరులు తనకు పరిచర్య చేయవలెనని ఆశించక యితరులకే పరిచర్య చేయును. మోషే దేవుని సేవించుటకే నిర్ణయించుకొనెను. తన ప్రజలకు పరిచర్య చేయుచుండెను (హెబ్రీ 11:24-26). సంఘకాపరులముగా మనము సేవ చేయు వారము (1 పేతురు 5:4-5). తమ గొఱ్ఱెల కొరకు వారు త్యాగము చేయువారు. యేసు మనకొరకు అట్లే చేసెను (యోహాను 10:11). మోషే కూడ అదే రీతిగా పరిచర్య నేర్పరచుకొని యూదులకు పరిచర్య చేయునట్లు సమర్పించుకొనెను.

కాని తన కుటుంబ విషయము అట్లు చేయలేకపోయెను. సేవకులు తమ పరిచర్యకన్నను తమ కుటుంబములకే ప్రాధాన్యత నీయవలెను (1 తిమోతి 3:5). దురదృష్టవశాత్తుగా మోషే కుటుంబము యొక్క కథ సరిగా లేకుండెను. ఒకవేళ కాపరిగా నున్నందున ఎక్కువకాలము యింటి నుండి వెలుపల నుండెను. దేవుని ప్రజల పరిచర్య నిమిత్తము సంఘకాపరులు తమ కుటుంబముల నుండి వారి యొద్దకు వెళ్లుదురు. నాయకులుగా మనము ప్రజలకు పరిచర్య చేయవలసినదే. కాని

వారికన్నను ముందుగా మన కుటుంబములకు పరిచర్య చేయుటలో ప్రాధాన్యత వహించవలెను. దైవభక్తిగల నాయకునిగా మనలను వెంబడించు వారికిని పరిచర్య చేయవలెను. ఒక తండ్రి తన కుమారుల యెడల తీసికొను శ్రద్ధవలెనే పరిచర్య చేయవలెను.

మోషే సమస్తమును చేయునంత పరిచర్య అతనికుండెను. ఇతరులు తనకు సహాయపడునట్లు అవసరముండెను (నిర్గమకాండము 18:14-17). దేవుడతనికి సహాయము చేయట కొరకు యితరులను పంపెను (సంఖ్యాకాండము 11:16-17). అతడు యెహోషువ అను ఒక యువకునికి తర్ఫీతునిచ్చెను. తాను మరణించుటతో యెహోషువ నాయకుడై నడిపించునట్లు యేర్పాటు చేసెను. అదే రీతగా యేసు తన శిష్యులకు తర్ఫీతు నిచ్చెను. పౌలు తిమోతికి తర్ఫీతునిచ్చెను. పరిచర్య చేయునట్లు తీతు మరియు సీల అనువారు తర్ఫీతు పొందిరి. మనమును అట్లు చేయవలెను.

ప్రజలు ఇతరులకు సేవ చేసే నాయకుడని చెప్పుచున్నారా? లేక ఇతరుల చేత సేవ చేయించు కొనుచున్నావని చెప్పుచున్నారా? ఇతరుల అవసరముల కంటే ముందు నీ కుటుంబ అవసరములను చేయుచున్నావని నీ కుటుంబం అనుచున్నారా? నీ ప్రజలను సంతోషపెట్టటానికి సేవ చేస్తున్నావా లేక వారి మంచి కోరి వారి కొరకు సేవ చేస్తున్నావని అనుకొనుచున్నారా? నీ సేవలో ఇతరులకు తర్ఫీదు ఇస్తున్నావా?

**4. దైవభక్తిగల నాయకుడు విమర్శనమును తప్పక ఎదుర్కొనవలెను.**

మోషే ఒక మంచి యధార్థపరుడగు నాయకుడు మరియు దేవునిచే వాడబడిన వాడు. అయినను దానిని బట్టి నాయకత్వము సులభముగా

నుండునది కానేరదు. యూదులను నడిపించుట బహుగా ఎత్తు మరియు పల్లములను కలిగినది. కొన్ని పర్యాయములు ప్రజలు నాయకుని ప్రేమించుచు వెంబడించెదరు. మరికొన్ని పర్యాయములు వారు అతని మీద నింద మోపుచు వారి సమస్యలకు అతడే కారణమని అతని చంపకోరుదురు. తిరిగి వారు ఐగుప్తునకే వెళ్లగోరుదురు (నిర్గమకాండము 14:11-12; 32:1; 7:9; సంఖ్యాకాండము 12:1,8; 16:1,3). అట్టిది యేసు జీవితము నందును కలిగెను. యేసు కూడ అందరి వలన యిష్టము పొందకుండెను. అటువంటిదే మనము కూడ అనుభవించెదమని యేసు చెప్పెను (లూకా 6:26).

మనము విమర్శనెదుర్కొనినపుడు బైబిలు చెప్పుచున్నదేమనగా, మౌనము దాల్చవలెను. దాని గూర్చి వినవలెను (యోహాను 19:9; సామెతలు 17:27-28). స్వకీయ భద్రతకొరకు ఏమి చేయవలెనో దాని గూర్చి ఆలోచించవలెను (సామెతలు 15:28; యాకోబు 1:19-20). విమర్శనమును విని దాని నుండి నేర్చుకొనవలసినది ఏదోచూడుము.

దాని గూర్చి నీవు జవాబు చెప్పుటకు ముందుగా ఆలోచించుము (సామెతలు 15:1; 16:21; 25:15). నీవు జవాబు యిచ్చునపుడు ప్రేమ మరియు వినయములను ఉపయోగించుచు చెప్పవలెను. నీ జవాబును వారంగీకరించిన యెడల నీవు వాదించకూడదు. దేవుడే వారి హృదయములను ఆయన సమయము నందు జరుగును. నిన్ను నీవు తగ్గించుకొని అవసరమైన యెడల నీవే క్షమాపణను కోరుము (1 సమూయేలు 15:24, 30; 25:28). శాంతముగా నుండుట కొరకు దాని నంగీకరించకుము. జగడము ఏ మాత్రము చేయకుము (ఎఫెసి

4:31; సామెతలు 17:14). నిన్ను నీవు భద్రపరచుకొనుటకు ప్రయత్నించకుము. వినుచుండుము. సహాయకరమైన దానిని నేర్చుకొనుము. అవసరమైన యెడల క్షమాపణ కోరుము. వారిని క్షమించుము. సమాధానముతో సెలవు తీసికొనుము. అట్టి గుణములను నేర్చుకొనుటకు శ్రేష్ఠమగు స్థలము స్వకీయమగు గృహమే.

–నీవు విమర్శించబడినపుడు ఏ రీతిగా జవాబు నిచ్చెదవు? విమర్శ నుండి నీవు నేర్చుకొనునదేమి? నీవైపు నుండి క్షమాపణ కోరుట కిష్టపడుదువా లేక ఎదుటి వ్యక్తిని నిందించుటకు కారణములను కనుగొందువా? ఇతరులు నీపై నింద వేయునపుడు వారిని వెంటనే క్షమించుటకు సిద్ధపడుదువా?

## 5. దైవభక్తిగల నాయకుడు న్యాయబుద్ధితో ప్రవర్తించును

నీతిగల ఒక నాయకుడు మంచి పేరు ప్రతిష్ఠ కలిగినవాడై యితరుల యెడల గల తన ప్రవర్తనలో నిందారహితుడై యుండవలెను (1 తిమోతి 3:1-7). అతడు యథార్థపరుడు, నిష్పక్షపాతి, మరియు శ్రేష్ఠమైనవాడై యుండవలెను. తలాంతులను మించి యున్నదే మంచి శీలము. మోషే దైవభక్తిగల వాడై, యథార్థపరుడై యుండియు అతడు సంపూర్ణుడై యుండకుండెను. అతనిలో కోపము ఉండుట వలన ప్రమాణ దేశము నందు ప్రవేశించకుండెను (సంఖ్యాకాండము 20:12). అది వరకు ముందు అతడు ఒక ఐగుప్తీయుని చంపెను. కోపముతోనే పది ఆజ్ఞలు గల రాతిపలకలను పగులగొట్టెను. దానికి గల కారణము యూదులు పాపము చేయుచుండుటయే. బండతో మాట్లాడుమని దేవుడు చెప్పినపుడు ప్రజలపై

కోపము తెచ్చుకొనినందున ఆ బండను రెండుసార్లు కొట్టెను.

క్రైస్తవులకు ఆశానిగ్రహము లేకుండుట గొప్ప సమస్యయే. నాయకులకు అది అతి ప్రాముఖ్యమైనది. ఘనముగా, యథార్థముగా నుండవలసి యున్నది. ఒక కోపిష్ఠిని ఎవరైనను గౌరవించరు. భయముతో సహకరించుదురేమో. చాలామంది కాపరులు, నాయకులు వారి కోపముతో వారు తమ కిష్టమైన పనులను ఇతరుల చేత చేయించుకొందురు. యేసు అట్లు చేయలేదు. కాబట్టి మనుము ఆయనను పోలి యుండవలసినదే.

నీవెరిగియున్నవారి మధ్య నీకెటువంటి గౌరవము ఉన్నది? నిన్ను గూర్చి వారు ఏమనుకొనుచున్నారు? నీవు పలుకు మాటలకు వారు విధేయులై యుందురా? వారు నిన్ను నమ్ముచున్నారా? నీ కోపమును వారు చూచుచున్నారా? నీ కోపమును స్వాధీనపరచుకొనుటలో కష్టపడుచున్నావా? ఆశానిగ్రహము కొరకు నీవు చేయునదేమి?

## 6. దైవభక్తిగల నాయకుడు దేవునితో ఒంటరి సమయమును గడుపును

మోషేలోని లక్షణములలో నేను మెచ్చుకొను ఒకటి అతడు దేవునితో గడిపిన ఒంటరి సమయము. అతడు దేవునితో ముఖాముఖిగా మాట్లాడెను (నిర్గమ కాండము 33:7-11; 34:29-35; సంఖ్యాకాండము 12:5-8; 3-12-17). సమయమంతయు దేవుడేమి చేయవలెనోయని దేవుని అడుగలేదు. లేక తానేమి చేయుచున్నాడో దానిని కూడ తెలియపరచలేదు. దేవుడు సహాయము చేయవలెనని కూడ అడుగలేదు. మోషే చెప్పవలసిన దానిని దేవుడు ముందుగానే యెరిగి యుండెను. దానికి బదులుగా దేవుడు

తనకేమి చెప్పనై యున్నాడో దానిని వినుటకు సిద్ధపడి యుండెను. మనము దేవునికేమి చెప్పనైయున్నామో దాని కన్నను దేవుడు మనతో చెప్పునదే అతి ప్రాముఖ్యము. అందును బట్టి దేవునితో నుండి ఆయన చెప్పు మాటలను వినుటలో ఎక్కువ సమయము గడుపునట్లు చేసికొనవలెను. వ్యక్తిగత సంబంధములో ఇది వాస్తవమైనది.

దేవునితో నొంటరిగా నుండుట నేర్చుకొనుటకు సమయము తీసికొనును. దేవుని ఆత్మ ఆయన తలంపులను మన మనస్సులందు, భారములను మన హృదయములందు వేయుచుండగా వినుచుందము. ప్రతి దినము దేవుని మాటలను వినుచుండవలెను. కొందరు దేవునితో నొంటరి సమయము గడుపుట ఎంతో సహాయకరమని కనుగొనిరి. దేవునితో మాట్లాడుచు, ఆయన మాటలు వినుచు ఆయనతో సమయమును గడువవలెను. ఆయన వాక్యము ద్వారా దేవుడు మాట్లాడుచున్నాడు. దేవుని వాక్యమును చదువుటలో సమయమును గడుపుము. చదివిన దానిని ధ్యానించుము. దేవుడు నీతో మాట్లాడును. దేవుని మాటలను వినుటయే క్రైస్తవులకుగల ప్రాధాన్యత! యేసు పెందలకడనేలేచి దేవునితో సమయము గడిపెను. కొన్నిసార్లు ఆయన ప్రార్థించుటలో రాత్రిని గడిపెను. యేసు అట్లు చేసినపుడు ఎంత ఎక్కువగా నేడు మనము చేయుటకు అవసరమున్నది?

ప్రతి దినము మాత్రమే ఆ రీతిగా దేవునితో సమయము గడుపుట కాదు. సంవత్సరములో కొన్ని దినములను ప్రత్యేకించుకొని విశ్రమించుచు దేవునితో నొంటరి సమయము గడుపుచు వాక్యమును చదువుచు, ప్రార్థించుచు, ధ్యానించుచు గడుపుము. నేను బుధవారము ఉదయమున

సంఘ ఆవరణము నందు ఒంటరిగా నుండి ప్రార్థించుచు ఆరాధించెదను. ఇట్లు చేయుట కొంతవరకు కష్టముగా నుండినను ఆ వారములో ఆ దినము శ్రేష్ఠమైన దినమని యెంచితిని. నేను నడకలో నున్నపుడును ప్రార్థించుచుందును. దైవ స్వభావములో నున్నపుడు ఆయనతో సంబంధమును కలుగజేసికొని యుందుము. నీ వీలును బట్టి యిట్టి అలవాటు చేసికొనుట మంచిది.

వారములో ఒకరోజు సెలవు నీ పనికి సెలవు తీసుకొని నీకుటుంబముతోను, నీవు ప్రేమించినవారితోను గడుపుట చాలా అవసరము అలాంటి అభ్యంతరము లేని సమయము వారితో గడుపుట అవసరము. దేవుడు వారములో ఒకరోజైన ఏడవరోజు విశ్రాంతి దినమని చెప్పెను, ఇది ఆజ్ఞ. విచారకరమైన దేమిటంటే చాలామంది నాయకులు దానిని పాటించరు. దేవుడు ఆజ్ఞ కావున మంచి కారణమైనందును మనము దానికి విధేయులమై ఆయన ఆజ్ఞకు లోబడవలెను. నామట్టుకైతే విశ్రాంతి తీసుకొనినపుడు చాలా విశ్రాంతి తీసుకొని, ఆటంకములను ఎదుర్కొని, దేవునిచేత ఆదరణ, అభయము, లేక జ్ఞానము కలుగును. ఇంకా నా కుటుంబములో ఎక్కువ సమయము గడపగలను.

ప్రతి దినము దేవునితో ఎంత సమయము ఒంటరిగా గడుపుదువు? దేవునితో మాట్లాడుచు లేక ఆయన మాటలను వినుచున్నావా? దేవుని మాటలను వినుట ఎట్లో నేర్చుకొనియున్నావా? నీ మనస్సు నందు తలంపులను, నీ హృదయము నందు భారములను వేయునపుడు ఆయన మాటలను వినుచున్నావా? నీవు బైబిలు చదువునపుడు ధ్యానించునపుడు

ఆయన మాటలను వినుచున్నావా? నీ పని నుండి కొంత విరామము తీసుకొని నీ కుటుంబముతో స్నేహితులతో కొంత సమయమును గడుపుచున్నావా?

## 7. దైవభక్తిగల నాయకుడు పట్టుదల గలిగియుండును

కొన్ని సమయములందు ప్రతి నాయకుడు తన ఉద్యోగమును వదలివేయ వలెనని కోరును. మోషే ఆ రీతిగా ఎన్నోసార్లు తలంచెను (సంఖ్యాకాండము 11:14-15). పరిచర్య భారము ఎక్కువగా నున్నందునను, వ్యతిరేకత కొనసాగుచున్నందు నను మరియు మన శక్తి తగ్గిపోవుచున్నందునను యిట్లు జరుగుట సహజము. నేను దానిని అనుభవించితిని. కాని దానిని దేవుడు కోరలేదని యెరిగి కొనసాగితిని. ప్రతినాయకుడు దీని నెరుగవలసి యున్నది. నిరుత్సాహము సాతానుని బలీయమగు పరికరము. దానిని గుర్తించి తగిన జాగ్రత్త వహించవలెను.

నిర్గమకాండము 4:24-26 ప్రకారము మోషే యొక్క అనుభవము నందు తన భార్యపిల్లలు ఆయనను విడిచిపెట్టిరి. యూదులు అతనిపై ఫిర్యాదు చేయుచు అతని క్రియలను విమర్శించుచుండిరి. అతడైతే దేవునికి విధేయుడై యుండెను. మన వలెనే అతడు పాపముతో పోరాడెను. కోపమును అనుచుకొనక ఓడిపోయెను. దేవుడు కోరినరీతిగా మోషే యూదులను ప్రమాణదేశమునకు చేర్చలేకపోయెను. 40 సంవత్సరములు వారు యెదుగుదల లేక దేశదిమ్మరులైరి. నేడును సంఘ నాయకులు అనుభవమిదియే.

మోషే జీవితము నుండి నేను నేర్చుకొనిన పాఠము దేవునిపై దృష్టి

నుంచుకొనుట. పరిస్థితులపై కాదు. మనము యథార్థపరులమై ఆయన యెడల ప్రవర్తించునట్లు ఆయన కోరుచున్నాడు (1కొరింథి 4:2). మననుండి గొప్ప ఫలితము రావలెనని ఆయన కోరుట లేదు. కాని యథార్థతనే కోరుచున్నాడు. ఆయన పరిచర్యలోని యథార్థతనే కోరుచున్నాడు. ఇర్మీయా ప్రవక్త 50 సంవత్సరము పరిచర్య చేసినను ఒకరైనను మారుమనస్సు పొందలేదు. యెషయా ప్రవక్త పరిచర్యకూడ అదియే. కాబట్టి యథార్థతతో పట్టుదల కలిగి యుండవలెను.

దేవుడు నిన్ను చూచినపుడు ఏమి జరుగుచున్నను యథార్థతతో పట్టు విడువక కొనసాగుచున్నావని ఆయన చూచుచున్నాడా? బహు చురుకుగా వదలివేయ నుద్దేశించుచున్నావా? లేక నిదానముగా అట్లు చేయుటకు సిద్ధపడుచున్నావా? యథార్థతను తగ్గించుచున్నావా? పట్టుదల కలిగియుండుట యందు ఎటువంటి కష్టము నెదుర్కొనుచున్నావు? వీటి మధ్య ఏ రీతిగా కొనసాగగలవు?

## 8. దైవభక్తిగల నాయకునికి సన్నిహిత మిత్రులుందురు

పరిచర్యలో పట్టుదల కలిగియుండుటకు మరియొకటి సన్నిహితమగు మిత్రులను కలిగియుండుట. వారు మన పరిచర్యను ప్రోత్సహించుచు సహాయ పడువారు. ఇట్టిది నాయకత్వపు ప్రతిభాగము నందు సహాయపడును. వీరిలో ఒకరు నీ సతీమణియే. ఇతర మిత్రులు కూడ అవసరమే. కానివారు నాయకులై యుండవలెను. మోషేకు ఒక వృద్ధుడు సహాయకునిగా నుండి హెచ్చరిక లిచ్చుచుండెను. అతని మామయైన ఇత్రో. అతనికి ఒక మిత్రుడుండెను. అతడు మోషే సహోదరుడు

అహరోను. మోషే యొద్ద ఒక యువకుడు సహాయకుడు ఉండెను. అతని పేరు యెహోషువ. నీకును ఒక వృద్ధుడైన సహాయకుడు ఉండుట శ్రేష్ఠము. మరియు నీ వయస్సులో నుండు మిత్రుడు కూడ ఉండుట మంచిది. ఒకరికొకరు సహాయపడవచ్చును. పౌలునకు గల వృద్ధుడు లూకా, తన వయస్సుగల మిత్రుడు బర్నబా, యువకుడు తిమోతి తర్ఫీతు పొందువారు.

నీ సన్నిహిత మిత్రులెవరు? నీ పరిచర్యను గూర్చి వారితో సంప్రదింతువా? నీ జీవితమును గూర్చి నీ సేవను గూర్చి ఏ వృద్ధునితో సంభాషించెదవు? నీతోటివారి విషయములు నిన్ను బలహీనపర్చుచున్నవా? నీ అనుభవమును చూచు మరియొక సంఘకాపరిని కలిగియున్నావా? నీవెవరికి తర్ఫీతు నిచ్చుచున్నావు? వారు నీకు సహాయపడుచున్నారా?

ఇవన్నియు దైవిక నాయకత్వమును గూర్చి మోషే జీవితము నుండి నేర్చుకొన దగు పాఠములు. మోషే జీవితములో మనము చూచినట్లు దేవునిచేత వాడబడుచు యథార్థతను నాయకత్వములో ప్రదర్శించుట కష్టమని యెరిగితిమి. మోషే కొన్నిటిలో విజయమును పొందెను. మరియు ఓటమి కూడా పొందెను. అయినను దేవుడు మోషేతో కలిసియుండెను. దేవుడు సృష్టించిన వ్యక్తిగా తను కోరిన వ్యక్తిగా నుండునట్లు అతనికి సహాయపడెను. మన జీవితములందును అట్లే చేయగలడు. దానికి గల షరతు సమర్పణ. ఎటువంటి పరిస్థితులందును ఆయన పరిచర్య చేయుచు, వినయము కలిగినవారమై ఆయన ఆత్మద్వారా మార్పు పొందవలసి యున్నది.

మోషే జీవితము నుండి మనము చూచినదేమనగా దైవభక్తిగల నాయకునిగా నుండుట కొరకు :

1. జీవితము మరియు పరిచర్యల నిమిత్తము దేవుని యేర్పాటును వెంబడించ వలెను.
2. వినయమును కలిగి యుండవలెను.
3. ఇతరులకు మరి ముఖ్యముగా కుటుంబమునకు పరిచర్య చేయవలెను.
4. విమర్శలు ఎదుర్కొనవలెను.
5. యథార్థతను ప్రదర్శింపవలెను.
6. దేవునితో నొంటరి సమయమును గడుపవలెను.
7. పట్టుదల కలిగి యుండవలెను.
8. సన్నిహిత మిత్రులను కలిగి యుండవలెను.

ఇవన్నియు నీలో నున్నవా? ఏవేవి ప్రస్తుతము ఉన్నవి? ఏవేవి లేవు? వీటిని పొందుటకు నీవేమి చేయవలెను? వీటిని గూర్చి ప్రార్థించుచు దేవుని సహాయమును అన్నిటిని పొందునట్లు అడుగుము.

# 4. యెహోషువ జీవితము నుండి నాయకత్వ పాఠములు

**యెహోషువ 5:13 – 6:2 చదువుము**



యెహోషువ యొక్క సంపూర్ణ జీవితము నుండి దైవిక నాయకత్వ పాఠములెన్నో ఉన్నవి. కాని యిప్పుడు మనము అతడు మోషే నుండి పొందిన నాయకత్వమును గూర్చి తెలిసి కొందము. మోషే బహు తలాంతులు గలవాడు. బాగుగా శిక్షణ పొందిన వాడు. మరియు ఎంతో అనుభవము గలవాడు. అతడు మరణించుటతో అతని నాయకత్వమును యెహోషువ తీసికొనవలసి వచ్చినది. అది యతనికి కష్టతరముగా నుండెను. ఎందుకనగా అతడు సాధారణమైన వ్యక్తియై యుండెను. మోషేవలె ప్రత్యేకించ బడలేదు. అతడు చేయలేని దానిని అతడు చేయవలసి వచ్చెను. దానికతడు సిద్ధముగా నుండెను. అయినను యెహోషువ యూదులను ప్రమాణ దేశమునకు నడిపించువానిగా యుండునట్లు ఎన్నుకొనబడెను. సాధారణముగా దేవుడు అర్హులు కాని వారినే ఎంపిక చేసికొని తన ఉద్దేశ్యమును నెరవేర్చుకొనును. వారు దేవునిపై ఆధారపడుచు కార్యమును జరిగించెదరు. అందును బట్టియే దేవుడు యెహోషువను ఎంపిక

చేసికొనెను. నాయకుడుగా వుండుటనునది నీవు అనుకొనిన దానికంటే, ఎక్కువ కాని దేవుడు ఆ పనిలో వుండాలని ఆశించుచున్నాడు. కావున యెహోషువ జీవితము నుండి మనము మంచి పాఠములు నేర్చుకొందుము.

## 1. దైవభక్తిగల నాయకుడు తాను ఒంటరిగా లేనివాడని యెరిగియున్నాడు

యెహోషువ 5:13 "యెహోషువ యెరికో ప్రాంతమున నున్నపుడు అతడు కన్నులెత్తి చూడగా, దూసిన కత్తి చేత పట్టుకొనియున్న ఒకడు అతని యెదుట నిలిచి యుండెను. యెహోషువ అతని యొద్దకు వెళ్లి – నీవు మా పక్షమున నున్న వాడవా, మా విరోధుల పక్షమున నున్నవాడవా? అని అడుగగా

దేవుడు యెహోషువతో అతడు ఒంటరిగా లేడనియు, యూదులను నడిపించుటలో తాను దేవుని సహాయము పొందునని తెలియజేసెను. నాయకుడై యుండుటలో ఒంటరితనము అనుభవించవలసి యున్నది. ప్రాముఖ్యమగు తీర్మానములు మరియు జీవితమును మార్చు ఘట్టములు కొరకు నాయకునికి బాధ్యత ఉన్నది. అతని తలంపుల నెవరైనను అనుభవించలేరు. ఇతరుల నుండి వచ్చు ఒత్తిడి ఉన్నది. అతని నాయకత్వమును వ్యతిరేకించవచ్చును. లేక అతనిపై వారి ప్రభావమును చూపవచ్చును. తాను చేయవలసిన దానిని యితరులు చేయునట్లు ఏ నాయకుడైనను ఎదురుచూడడు. అది అతని బాధ్యతయే. ఔను, నాయకుడై యుండుట ఒంటరిగా నుండు పనియై యున్నది.

ఈ కారణమును బట్టియే మనము ఒంటరిగా లేమని యెరుగుట

ముఖ్యము. యెహోషువ తలంచిన రీతిగా ఒంటరిగా నున్నామని తలంచగలము. కాని దేవుని సన్నిధి ఎల్లకాలము మనతోనున్నది. అది యెహోషువ అనుభవము. దేవుని మనము చూడలేము. అయినను ఆయన మనతో నున్నాడని యెరుగుదుము (ద్వితీయోపదేశకాండము 3:16, హెబ్రీ 13:5), మరియు ఆయన మనలో నున్నాడు (1 కొరింథి 3:16). యెహోషువ మొదట నాయకత్వమును మోషే నుండి తీసికొనినపుడు దేవుడుతనితో తాను అతనికి తోడైయుండునని చెప్పెను: “నీవు బ్రదుకు దినములన్నిటను ఏ మనుష్యుడును నీ యెదుట నిలువలేక యుండును. నేను మోషేకు తోడై యుండినట్లు నీకును తోడై యుందును. నిన్ను విడువను, నిన్ను ఎడబాయను.” దేవుడు మరల దానినే పలుకుచు యెహోషువ జ్ఞాపకము చేసికొనునట్లు చెప్పెను.

దేవుడు ఎల్లప్పుడు మనతో నున్నాడని జ్ఞాపకము చేసికొనవలెను. ఆయన ఎల్లకాలము మనతో నున్నాడు. అట్లున్నాడని కనబడకపోయినను మనతో నున్నట్లే. ఆయన మనలో నున్నట్లు వాగ్దానము చేసెను. మనము ఎప్పుడైనను ఒంటరిగా నుండము. సాతానుడైతే దేవుడు మనలను విడిచిపెట్టెనని, శ్రద్ధ వహించలేదని, ఒంటరివారమని తలంచునట్లు మనయెడల తన ప్రయత్నము చేయుచున్నాడు. అవన్నియు వాడు చెప్పుచున్న అబద్ధములే. ఇదంతయు దేవుడు తన వాక్యములో నున్నదానికి వ్యతిరేకముగా నున్నది (ఫిలిప్పి 1:6).

నాయకత్వము నందు ఎక్కువగా ఎప్పుడు నిరుత్సాహపడుదువు? ఎప్పుడు నీవు ఒంటరితనము అనుభవించుచున్నావు? అదివరకు దేవుని

సరఫరాను గూర్చి తలంచుము. దేవుడు నీకు ఓటమి యిచ్చిన సమయములున్నవా? నీవు గ్రహించని ఘట్టములుండవచ్చును. కాని వాటితో పాటు నీతో దేవుడు ఉన్నాడు. నిన్ను నిరుత్సాహపచుటకు సాతానుడు నీలోనుంచు అబద్ధములేమై యున్నవి? దాని గూర్చి నీవు యేమి చేయగలవు?

## 2. దైవభక్తిగల నాయకుడు తాను అధికారినని యెంచుకొనడు

యెహోషువ 5:14 “అతడు – కాదు. యెహోవా సేనాధిపతిగా నేను వచ్చి యున్నాను అనెను. యెహోషువ నేలమట్టుకు సాగిలపడి నమస్కారము చేసి – నా యేలినవాడు తన దాసునికి సెలవిచ్చునదేమని అడిగెను.”

సంఘకాపరులు ప్రధానకాపరియగు యేసుక్రీస్తు యొక్క అధికారము క్రింద విధేయులై యుండువారు. మనము నడిపించు సంఘస్తులు ఆయన గొఱ్ఱెలుగా నున్నారు. మనకు చెందినవారు కారు (1 పేతురు 5:4). వారు ఆయనకు చెందిన వారు. క్రీస్తు ప్రభువు వారిని మనకు అప్పుగా యిచ్చి యున్నాడు. మన పిల్లలు మరియు మనము పరిచర్యచేయు ప్రజలును అదేరీతిగా నున్నారు. వారు గొఱ్ఱెలుగా నున్నందున దేవుని గొఱ్ఱెలు దేవుని శ్రద్ధలో నుందురు. ఆయన యేర్పాటు మరియు ఆయన ఆజ్ఞలను పాటించవలసినదే. మనము వారిని ధైర్యముగా నడిపించగలము కాని మన నమ్మిక దేవుని యందు ఉండవలసియున్నది. మనపై కానేకాదు.

ఎప్పుడైనను నీ కుటుంబీకులు, సంఘము మరియు పరిచర్య యివన్నియు నీకు చెందినవని తలంచుకొందువా? వారు దేవునికి

చెందినవారని, నీకు చెందలేదని ఎప్పుడైనను మరచిపోతివా? నీవు పోరాడు పోరాటములు నీకు చెందినవేయని ఎప్పుడైనను అనుకొంటివా? యేసే సమస్తమును స్వాధీనపరచుకొనుచున్నాడని ఎందుకు జ్ఞాపకము చేసుకొనుట అవసరమై యున్నది? దేవుని గొఱ్ఱెలను దేవుడు నడిపించుమని కోరిన రీతిగా నడిపించుటకు కష్టపడుదువా లేక నీ యిష్టప్రకారము స్వకీయమగు తలంపులతో నడిపించగోరుదువా?

## 3. దైవభక్తిగల నాయకుడు దేవుడు మరియు దైవసేవ పరిశుద్ధమైనదని జ్ఞాపక ముంచుకొనును

యెహోషువ 5:15 "అందుకు యెహోవా సేనాధిపతి – నీవు నిలిచియున్న యీ స్థలము పరిశుద్ధమైనది. నీ పాదరక్షలను తీసివేయుమని యెహోషువతో చెప్పగా యెహోషువ ఆలాగు చేసెను."

యేసు యెహోషువను పాదరక్షలు తీసివేయుమని అతడు పరిశుద్ధమగు స్థలముపై నున్నాడని చెప్పుచు వారి సంభాషణకు అంతరాయము కలిగించి యుండుట విడ్డూరముగా ఉండవచ్చును. ఆ స్థలమును పరిశుద్ధము చేసిన దెవరు? కొన్ని నిమిషములకు అది పరిశుద్ధముగా నుండలేదా? ఇప్పుడెందుకు అది పరిశుద్ధమైనది? దేవుడు పరిశుద్ధుడై యున్నందున అది పరిశుద్ధమైనదా? దేవుడు యెహోషువతో నున్నందుకు అది పరిశుద్ధమైనదా? దేవుడు పరిశుద్ధుడే. ఆ రీతిగా ఆయన ఉన్నందున ఆయనను ఘనపరచవలెను. ఆయన యెదుట పరిశుద్ధముగా జీవించినపుడు ఆయన యెడల ఘనతను, గౌరవమును చూపుచున్నాము.

దేవుడు మనల నెక్కడ నడిపించినను లేక మనలనేమి చేయుమని కోరినను అది ఎంతటి అనవసరమైనదిగా కనబడినను అది ప్రాముఖ్యమైనది. ఎందుకనగా దాని దేవుడు పరిశుద్ధపరచెను. ఆయన సన్నిధి దానిలో నున్నది. దేవుని దృష్టిలో చిన్న పరిచర్యలు ఉండవు. పిల్లలతో నుండు తల్లి, కుటుంబమును నడిపించు తండ్రి, బైబిలు తరగతులు, చిన్న సంఖ్యగల సంఘము ఏదియు చిన్నదని లేక ప్రాముఖ్యత లేనిదని లేదు.

నేను ఒక చిన్న సంఘమునకు కాపరిగా 35 సంవత్సరములు పని చేసితిని. ప్రజలు వచ్చుచు పోవుచునుండిరి. సంఘమునకు చెందని వారికెందరికో పరిచర్య చేసితిని, అయినను సంఘము ఏ మాత్రము సంఖ్యలో పెరిగియుండలేదు. ఆదివార ఆరాధనలందు 30 లేక 35 మంది మాత్రమే యుండిరి. కాని యితరులెందరో తర్ఫీతు కొరకు, నాయకత్వము కొరకు వచ్చెడివారు. దేవుడు నాకు నేర్పిన దేమనగా విజయము దేవుని దృష్టియందు ఆయన యెదుట యధార్థముగా నుండుటయే. సంఖ్య ప్రాముఖ్యము కాదు. ప్రతి పరిచర్య పరిశుద్ధమైనది. ఆయన కొరకు ప్రత్యేక పరచబడినదే. పరిచర్య నిమిత్తము ఆయన నిన్ను ఎక్కడ పెట్టినను ఆయన సన్నిధి నీతో నున్నది. అట్టిది దానిని పరిశుద్ధ పరచుచున్నది. చేయు ప్రతికార్యము పరిశుద్ధమగు కార్యమే. ఒక తల్లి యొక్క ప్రత్యేకత ఒక సువార్తికుని వంటిది. ఒక చిన్న సంఘపు కాపరి ఒక పెద్ద సంఘపు కాపరి యొక్క ప్రాముఖ్యతను కలిగి యున్నాడు. దేవుడు మన నమ్మకత్వమును చూచుచున్నాడు. పరిచర్య యొక్క గొప్పతనమును కానేకాదు. పరిచర్యస్థలములన్నియు పరిశుద్ధమైనవి.

నీకు యితరులను మించిన పెద్ద సంఘము ఉన్నందుకు యితరుల కన్నను గొప్పగా యున్నావని తలంచుకొందువా? లేక చిన్న సంఘములో నున్నందున యితరుల కన్నను పేరు లేనివాడవని యెంచుదువా? పెద్ద సంఘములు ప్రాముఖ్యమైనవనియు, చిన్న సంఘములు విలువలేనివని అనుకొనుచున్నావా? నీ పరిచర్యలో దేవుని సన్నిధి ఉన్నదని నీవు పరిచర్య స్థలమును గుర్తించుకొంటివా? నీవు పరిచర్య చేయు స్థలము దేవుని యెదుట పరిశుద్ధ స్థలముపై నున్నదని గుర్తించుకొంటివా?

## 4. దైవభక్తిగల నాయకుడు విజయము దేవుని నుండియే వచ్చునని జ్ఞాపకముంచు కొనును

యెహోషువ 6:1-2 "ఆ కాలమున ఇశ్రాయేలీయుల భయము చేత ఎవడును వెలుపలికి పోకుండను, లోపలికి రాకుండను యెరికో పట్టణము గట్టిగా మూసి వేయబడెను. అప్పుడు యెహోవా యెహోషువతో ఇట్లనెను - చూడుము. నేను యెరికోను దాని రాజును పరాక్రమముగల శూరులను నీ చేతికి అప్పగించుచున్నాను".

యెహోషువ ప్రభువును కలిసికొనినపుడు యుద్ధము అతనిది కాదనియు, అది దేవునికి చెందినదనియు కనుగొనెను. దేవుడు అది వరకే శత్రువును జయించెను. యెహోషువ చేయవలసిన దంతయు దేవుని మాటను వినుచు ఆయన ఆజ్ఞలకు లోబడవలసి యుండుటయే. మిగిలినదంతయు దేవుడు చేసెను. యెరికోను యూదులు దానిపైబడక ముందు ఆ పట్టణము వారిదై యుండెను. వారు విశ్వాసమును ప్రయోగించుచు ముందుకు కొనసాగుచు పోరాటములో దేవునికి విధేయులై

యుండవలసిన అవసరత యుండెను. దేవుడు సమస్తమును తన స్వాధీనము నందుంచుకొనుచు వారికి జయమును కలుగజేయుచుండెను.

మన పోరాటములును దేవుని హస్తములో నున్నవి. మనమే పోరాడుచు ఆయన సహాయము కొరకు ఎదురుచూడనవసరము లేదు. ఆయన వాక్యములోని నడిపింపును వెంబడించుచు ఆయన చెప్పిన దానికి విధేయులై యుండవలసినదే. మనము విశ్వాసమును ప్రయోగించుచు, దేవుడే మన కొరకు పోరాడి జయించును. అదే రీతిగా మన యుద్ధ పోరాటములు గెలువబడుచున్నవి. కొన్ని మనము మరణించునంత వరకు జయించబడక పోవచ్చును. విజయము దేవుని నుండియే కలుగుచున్నదని గ్రహించవలెను. మన నుండి కాదు.

కొన్నిసార్లు దేవుని ఉత్తరువులు తగిన రీతిగా ఉండక పోవచ్చును.

యెహోషువకు చెప్పబడిన విషయము : ఆరు దినములు ప్రజలు ప్రతి దినము ఒకసారి పట్టణము చుట్టు నడువవలెను. ఏడవ దినమున పట్టణము చుట్టు ఏడుసార్లు తిరుగవలెను. శబ్దము నెక్కువగా చేయవలెను. గోడలు పడిపోవుట చూడవలెను! ఈ విషయమునే వారు గ్రహించలేకపోయిరి. అయినను వారు దానికి విధేయులైరి. వెంబడించిరి. జయమును చేకూరెను. ఇట్లు మరల చేయుమని దేవుడు చెప్పలేదు. ప్రతి యుద్ధమునకు ఆజ్ఞ ఉత్తరువుగా వేరుగా నుండెను. ఒకసారి దేవుడు వడగండ్లను పంపెను. మరొకసారి సూర్యుడు అస్తమించక నిలుచుండెను. కాబట్టి శత్రువు రాత్రి లేనందున దాగుకొనలేకపోయెను. పోరాటమునకు ఒకే మార్గము లేకుండెను. దేవుడు వివిధరీతులుగా నడిపించు చుండెను.

కాని మనము ఎల్లప్పుడు జ్ఞాపకముంచుకొనవలసినదేమనగా విజయము దేవునివలననే కలుగును.

యెహోషువ జీవితములో యిది యొక చిన్న భాగము. ప్రారంభము నుండి దేవుడు యెహోషువకు మూలమగు నాయకత్వపాఠములు బోధించెనని తెలిసికొనుట ముఖ్యము. మనము నేర్చుకొనుటకు యివి ముఖ్యమైనవే.

నీ పోరాటము దేవునికి చెందినదని యెరిగి యున్నావా? ఆయన వాక్యమును అనుసరించుచు ఆయన యందు నమ్మిక యుంచుకొనియున్నావా? లేక నీ స్వశక్తితోనే జయించుటకు ప్రయత్నించుచున్నావా? ఆయనను నమ్ముకొనిన యెడల నీ పోరాటము నందు శాంతి ననుభవించెదవు.

యెహోషువ జీవితము నందు చూచిన ఘట్టము నందు మనము దైవభక్తిగల నాయకునిగా నుండుటకు :

1. మనము ఒంటరిగా లేమని యెరుగవలెను.
2. మనము అధికారములో లేమని గ్రహించవలెను.
3. దేవుడు మరియు ఆయన కార్యము పరిశుద్ధమైనదని జ్ఞాపక ముంచుకొనవలెను.
4. జయము దేవుని నుండియే వచ్చుచున్నదని మనస్సునందుంచు కొనవలెను.

ఇవన్నియు నీలో నున్నవా? ఏవేవి యున్నవి? ఏవి లేవు? మెరుగుగా నుండుటకేమి చేయగలవు? వీటిని గూర్చి ప్రార్థించుము. దేవుని సహాయమును కోరుము.

# 5. దావీదు జీవితము నుండి నాయకత్వ పాఠములు



**I సమూయేలు 4-21; II సమూయేలు అన్ని అధ్యాయములు; I రాజులు 1-2 చదువుము.**

దావీదు యొక్క కథ అతని ముత్తవ్వయైన రూతుతో ప్రారంభించ బడెను. ఆమెను బోయెజు అను వ్యక్తిని వివాహము చేసికొని బెత్లెహేముపురము నందు జీవించెను. ఆ కారణమును బట్టి మరియ మరియు యోసేపు లిరువురు రూతు మరియు బోయజుల వంశీయులైనందున జనాభా లెక్కలో నమోదు చేయబడుటకు అక్కడకు వెళ్ళియుండిరి (లూకా 2:1-7). బెత్లెహేము నందు రైతులు, గొఱ్ఱెల కాపరులుండిరి. బోయెజు, రూతుల కుమారుడు ఓబేదు. ఓబేదు కుమారుడు యెష్షయి. ఇతడే దావీదు యొక్క తండ్రి. దావీదు ఎనిమిదిమందిలో కనిష్ఠుడు.

యెహోషువ మరణించిన తదుపరి దేశమును గిద్యోను మరియు దెబోరా అను న్యాయాధిపతులు పరిపాలించిరి. కాని దేశప్రజలు యితరమగు దేశీయుల వలె ఒక రాజును కోరి యుండిరి. ఇట్లు

కోరియుండుటలో వారు దేవునే వారి రాజుగా నిరాకరించిరి. దావీదు జన్మించుటకు ఎనిమిది సంవత్సరములకు ముందు దేవుడు వారి రాజుగా సౌలు అను వ్యక్తి యుండునట్లు అనుమతించెను. ప్రజలు అతని యిష్టపడిరి. ఎందుకనగా అతడు ఎత్తుగా నుండి బలశాలియై యుండెను. కాని అతడు దేవుని వెంబడించలేదు. దేశమును తప్పుదారిలో నడిపించెను.

దావీదు క్రీ.పూ. 1035 సంవత్సర ప్రాంతమున జన్మించెను. కుమారులలో కనిష్ఠుడైనందున పొలములో పనిచేయవలసి వచ్చెను. గొఱ్ఱెలను మేపుచుండెను. కాని ఆ సంవత్సరములందు దావీదు నమ్మకస్థునిగా నుండుటకు, ప్రేమ చూపుటకు, మరియు దేవుని పరిచర్య చేయుటకు శిక్షణ బొందెను. దావీదు జీవితము నుండి దైవిక నాయకత్వమును గూర్చి పాఠములు నేర్చుకొనుటకు ఉన్నవి.

## 1. దైవభక్తిగల నాయకుడు సవాలుల నెదుర్కొనుటకు ధైర్యము గలవాడు

పది సంవత్సరముల వయస్సు వచ్చుసరికి దావీదు తన గొఱ్ఱెలను కాయునపుడు వాటిని భద్రపరచుట కొరకు ఒక ఎలుగుబంటిని, ఒక సింహమును చంపెను. అట్లు పోరాడుటకు ఒక యువకుని కెంతో ధైర్యము కలిగియుండవలెను. ఒక దైవభక్తిగల నాయకుని మొదటి పాఠము – యథార్థముగా దేవుని సేవించుటకును, యితరులను నడిపించుటకును ధైర్యము తెచ్చుకొనవలెను! భద్రతకును, విడుదలకును దేవుని నమ్మికొని ఆయననే హత్తుకొనునట్లు దేవుడు మనలను కొన్ని స్థలములందుంచుటలో కొనసాగుచున్నాడు. దేవునిపైనే ఎల్లప్పుడు ఆధారపడి యుండుటకు దావీదు నేర్చుకొనెను. ధైర్యమనగా అదియే. ఏమి జరిగినను దేవుడు

చూచుకొనునను నమ్మిక నుంచుకొనవలెను. దేవుని వెంబడించినచో యిక భయము ఉండదు. కాని సమస్తము సరిగా ఉండునని, పవిత్రముగా నుండునను అర్థము కాదు. దాని భావమేమనగా దేవుడు మనతో ఎల్లప్పుడు ఉన్నాడు. కాబట్టి ఏమి జరిగినను అది ఆయన చిత్తప్రకారము మరియు ఆయన మహిమార్థము జరుగుననియే.

దావీదు యిట్లు వ్రాసెను : "యెహోవా నాకు వెలుగును రక్షణయునై యున్నాడు. నేను ఎవరికి భయపడుదును? యెహోవా నా ప్రాణ దుర్గము. ఎవరికి వెరతును?" (కీర్తనలు 27:1). చిన్న విషయములందు ధైర్యము కలిగియుండునట్లు దేవుడు బోధించుచున్నాడు. తదుపరి సవాలు లెక్కువైనపుడు ఆయన యందు మన విశ్వాసము ఎక్కువగుచుండును. దావీదు గొల్యాతు నెదుర్కొనుటకు ముందుగా ఒక ఎలుగుబంటిని, ఒక సింహమును ఎదుర్కొనవలసి వచ్చెను.

నేడును నాయకులు యెగతాళి, విమర్శ మరియు హింసల యెదుట నిలబడుటకు ధైర్యము కలిగి యుండవలెను. కొన్నిసార్లు విమర్శలు యితర విశ్వాసుల నుండియే వచ్చును. యేసు కొరకు ధైర్యముగా నిలబడుటకు ధైర్యము అత్యవసరము. ఆయనను వెంబడించునట్లు యితరులను నడిపించుటకును ధైర్యము కావలెను. అట్టిది మన కుటుంబముల నుండి మరియు మిత్రుల నుండి ప్రారంభమగుచున్నది. ఇతరులేమనుకొనుచున్నను ఆయన వాక్యము ద్వారా దేవుని ఆజ్ఞలను ఆయన ఆత్మ ద్వారా జరిగించుచున్నావా? ఇతరుల నుండి వ్యతిరేకతను ఎక్కవగా ఎదుర్కొను చున్నావా? నీ నమ్మిక దేవుని మీదనే యున్నదా లేక నీ శక్తి మీదనే యున్నదా?

## 2. దైవభక్తిగల నాయకుడు ఓపిక మరియు సహనము గలవాడు

దావీదు 12 సంవత్సరములగుసరికి సమూయేలు బెత్లెహేము నందు సౌలునకు బదులుగా మరియొక రాజు నభిషేకించునట్లు యెష్షయి నొద్దకు వచ్చెను. దావీదు యొక్క తండ్రి అతడు చిన్నవాడైనందున యేమాత్రము వాని పట్టించు కొనలేదు. కాని దేవుడు వారికి అతడే తదుపరి రాజు అని చూపెను (1 సమూయేలు 16:3). కాబట్టి దావీదు తన 12 సంవత్సరముల వయస్సు నందే వారి రాజుగా అభిషేకించబడెను. కాని అతడు 42 సంవత్సరములగు నంతవరకు సింహాసనము నెక్కలేదు. అప్పటికిని ఎన్నో విషయములు జరిగినందున చివరికి 40 సంవత్సరము నకు దేశమంతటికి రాజుగా నియమించబడెను. అనగా అభిషేకించ బడియుండినను అతడు రాజగుటకు 37 సంవత్సరములు వేచి యుండవలసి వచ్చెను. ఆ సమయమంతయు దేవుడు దావీదునకు ఓపికను మరియు నమ్మికను బోధించు చుండెను. “యెహోవా కొరకు కనిపెట్టుకొని యుండుము” అని దావీదు వ్రాసెను (కీర్తనలు 27:14). అది అందరు నాయకులకు తగిన ప్రాముఖ్యమగు పాఠము. భక్తిగల నాయకుడైయుండుటకు ఎంతో సమయము తీసికొనుచున్నది. ఓపికతో నమ్ముకొనుచు దేవుని వెంబడించుటకు మరియు ఏమి జరిగినను పట్టుదల కలిగి యుండుటకు సమయము తీసికొనుచున్నది. ఓపిక అనునది ఆత్మఫలములో ఒక భాగము (గలతీ 5:22-23). అన్ని విషయములందు దేవుని సన్నిధిపై ఆధారపడి నపుడే దానిని పొందగలము.

చిన్న విషయములందు యథార్థత కలిగియున్నావా? పనిచేయుటలో దేవుని పరిచర్యయందు వేచియుండుట కిష్టపడుచున్నావా? లేక నీ కోరిక

రీతిగా అన్నియు జరుగవలెనని తలంచు కొనుచున్నావా? అన్ని యేర్పాట్లను నీవే చేసికొని దేవుడు వాటిని నెరవేర్చునట్లు కోరుచున్నావా లేక ఆయన నడిపింపు కొరకు వేచియున్నావా? నీవు ఓర్పుగలవాడవని నిన్నెరిగిన వారట్లు చెప్పగలరా? నీవు పట్టుదల గలవాడవని ఎట్టి పరిస్థితులందును అట్లుందువని దేవుడు చెప్పగలడా?

## 3. దైవభక్తిగల నాయకుడు వినయము గలవాడు

మరుసటి సంవత్సరము దావీదు 13 సంవత్సరముల వయస్సు గల వాడగుటతో అతడు రాజైన సౌలు యెదుట సంగీతము వాయించునట్లు ఎంపిక చేయబడెను (1 సమూయేలు 16:21-22). ఒక గొఱ్ఱెల కాపరిగా నుండిన వానికది గొప్ప భాగ్యము. ఎంతో అతిశయించి యుండవచ్చును. కాని అట్లుండలేదు. దేవుడు ఎంపిక చేసికొని అతని వాడుకొనుట చూసి ఎంతో ఆశ్చర్యపడెను: “ఇంతగా నీవు నన్ను హెచ్చించుటకు నేనెంతటివాడను? నా కుటుంబము ఏపాటిది?” (2 సమూయేలు 7:18). దావీదు అతడేమై యుండెనో అదంతయు దేవుని నుండి వచ్చినదని జ్ఞాపకము చేసికొనెను. తన కీర్తనలందు వీటిని గూర్చి లిఖించెను.

నేడును ఒక నాయకుడు నమ్మకస్థుడై, ధైర్యము కలిగి యుండియు వినయము గలవాడై యుండవలెను. దేవుని యందే నమ్మిక యుంచుకొనవలెను. తన శక్తిపై కానేకాదు. నాయకుని స్థానములో నుండుట గొప్ప భాగ్యము కాని దాని పొందినందుకు నీకు యోగ్యత ఉన్నదను భావము కాదు. దేవుని నుండి భాగ్యము కొరకు మనము ఏ మాత్రము అర్హులము కాము! ఆయనే మనలను నాయకులుగా చేయని

యెడల, మన బాధ్యతలను నిర్వహించునట్లు సహాయపడని యెడల, మనము ఓటమిని పొందెడి వారమే. అతిశయము అను పాపము సాతానుని దేవుని నుండి తొలగించినది. దేవుని సేవచేయు వారిని వాడు అతిశయమును పరిచయము చేయుచున్నాడు. మనమెంత గొప్పవారమో అను తలంపు నిచ్చుచున్నాడు. జాగ్రత్త వహించని యెడల వాని వలలోనే పడిపోదుము. "గర్వమునకు ముందు నాశనము నడుచును" (సామెతలు 16:18-28).

నీ పొరుగువారు నిన్ను వినయము గలవాడవని తలంచుకొను చున్నారా లేక అతిశయము గలవాడవని చెప్పుకొనుచున్నారా? అతిశయముతో ఎప్పుడు బహు కష్టపడి పోరాడితివి? దానిని వదలి వేయుటకు ఏమి చేయగలవు? దేవుడు తన సన్నిధి నీయక దీవెనను నీనుండి దూరపరచిన యెడల నాయకునిగా ఎట్లుండ గలవు?

## 4. దైవభక్తిగల నాయకుడు దేవునియందు లోతైన విశ్వాసము గలవాడు

రెండు సంవత్సరముల వరకు దావీదు సౌలునకు సంగీతము వాయించెను. అప్పుడే ఫిలిష్తీయులతో యుద్ధము ప్రారంభమైనది. వారు తమ వీరుని అనగా గొల్యాతును దేవుని యెగతాళి చేయుటకును, యూదులను ఓడించుటకును పంపిరి. అందరును అతనిని చూచి భయపడిరి. ఎందుకనగా అతడు బలశాలి, ఎత్తు గలవాడు. ఘనత పొందినవాడు. రాజైన సౌలు వానినెదిరించగలవాడే కాని భయపడెను. దేవుని మరియు దేవుని ప్రజలను గొల్యాతు నిందించుచుండుట వినినవాడై దావీదు కలవరపడెను. అతడు ఏమియు చేయలేకపోయెను. కనీసము

ఒక సైనికునిగానైనను ఉండలేదు. ఆయుధములను వాడుట, దావీదునకు తెలియదు. కాని దేవునిలోనున్న తన విశ్వాసమును బట్టి ధైర్యము తెచ్చుకొనెను. దేవుని సహాయముతో వాని ఓడించెను. ఇశ్రాయేలు సైన్యమునకు గొప్ప విజయము కలిగెను (1 సమూయేలు 17:40–54). దేవుని యందలి దావీదు విశ్వాసము కొన్ని సంవత్సరముల నుండి యెదుగుచుండెను. అందువలననే అసాధ్యమగు స్థితిగతులయందు దేవునిపైనే ఆధారపడునట్లు చేసెను.

ఈ రీతిగా జీవితములందు "గొల్యాతు"లను ఎదుర్కొందుము. మనము స్వాధీనపరచుకొనలేని స్థితులు, పరిస్థితులు వచ్చుచున్నవి. ఆరోగ్యము, ఆర్థికము బహు కష్టములు కలిగించును. ఇతరులతో నుండి సమస్యలు లేక మన పరిచర్యలో అనుభవించు కష్టములుండగలవు. కుటుంబములోని సమస్యలుండవచ్చును. వీటిని మనము పరిష్కరించుకొనలేము. ఇందును బట్టి మనము దేవుని నమ్మవలెను. దేవుడు వీటిని వంపుచున్నాడు. ఆ రీతిగా ఆయనపై విశ్వాసము ఎక్కువగా చేసికొనునట్లు బోధించుచున్నాడు. ఆయన సరఫరా మరియు విడుదల చూచునట్లు చేయుచున్నాడు.

ఇప్పుడు ఎటువంటి "గొల్యాతు"ల నెదుర్కొనుచున్నావు? ఏమి జరిగినను దేవుని నమ్ముకొనగలవా? వాటి వలన దేవునిపై దృష్టి నుంచుకొనుట కష్టతరమే. కాని ఆయనపై విశ్వాసము నుంచుకొనుటలో కొనసాగుచుందువా? నీకు భయము కలిగించునదేమి? అట్టి సమయములందు దేవుని నమ్ముకొనునట్లు ఏమి చేయగలవు?

## 5. దైవభక్తిగల నాయకుడు దేవుని యెడల విధేయత ప్రదర్శించువాడు

గొల్యాతుపై దావీదు యొక్క విజయమును బట్టి సైన్యములో నొక అధికారిగా దావీదు నియమించబడెను. సౌలు కుమార్తెను భార్యగా పొందెను (2 సమూయేలు 18:21). సౌలు కుటుంబములో చేర్చబడెను. అందరి యెదుట ప్రసిద్ధి గాంచి నందున సౌలు అసూయపడెను. దేవుడెంతగా దావీదును దీవించెనో అంత ఎక్కువగా సౌలు కోపగించుకొనెను. చివరికి సౌలు దావీదును చంపదలచెను. దావీదు తప్పించుకొని దాగుకొనెను. ఇరువది సంవత్సరముల వరకు అనగా దావీదునకు 35 సంవత్సరముల వయస్సు వచ్చువరకు దావీదు సౌలునకు కనబడక దాగి యుండెను. దావీదును పట్టుకొని చంపదలచెను. సౌలు యొక్క శత్రువులును దావీదుతో సహకరించినందున దావీదు వందలాది ప్రజలకు భద్రత కలిగించుటలో బాధ్యత వహించెను, దావీదునకు ఆరుగురు భార్యలుండిరి. ఎందరో బిడ్డల శ్రద్ధ వహించవలసి వచ్చెను.

కొన్నిసార్లు దావీదు దేవునిపై నాధారపడక స్వంతగా ప్రవర్తించు చుండెను. అబద్ధమాడుచు యితరులను మోసగించుచుండెను (1 సమూయేలు 27:10-12).

ఇందుమూలముగా ఒక పర్యాయము తనకు సహాయపడిన అమాయకులగు యాజకులు సౌలుచే హతమార్చబడిరి (1 సమూయాలు 22:17-21). మరొకసారి దావీదు మరియు అతని అనుచరులు అమాయకులగు అమాలేకీయులను చంపిరి. వారి ఆహారము నపహరించిరి (1 సమూయేలు 27:8-9). ఫిలిష్తీయులతో నున్నపుడు

పిచ్చివానివలెనటించి బంధించబడక తప్పించుకొనెను. దేవుని యెదుట తన విధేయతలో సంపూర్ణుడై యుండలేకపోయెను (1 సమూయేలు 21:13).

అయినను భద్రత మరియు నడిపింపుల కొరకు దావీదు దేవునిపై ఆధార పడెను. రెండుసార్లు సౌలు చంపబడుటకు దావీదునకు చిక్కెను. కాని దావీదు అతనిని చంపలేదు. ఎందుకనగా దేవుడే సౌలును శిక్షించునని నమ్మెను (1 సమూయేలు 24:26). అనేకసార్లు దావీదు తన హృదయమును దేవుని యెదుట పెట్టి ప్రార్థించి స్తుతించెను (కీర్తనలు 14:2). కీర్తనల గ్రంథములో ఇవన్నియు ఉన్నవి. సౌలు సమక్షము నుండి దాగియున్నపుడు అనేక కీర్తనలు వ్రాసెను. అనేకసార్లు దావీదు దేవుని మార్గము మరియు నడిపింపు కొరకు అడిగెను. దేవుడేమి చెప్పెనో దానికంతటికి విధేయుడాయెను (1 సమూయేలు 23:1-4).

నేటి నాయకులును వారి పరిచర్య మరియు ప్రవర్తన యందు దేవుని వాక్యమును ఆయన నడిపింపును అంగీకరించి విధేయులై యుండవలెను. కొన్నిసార్లు బైబిలు సూచనలను పాటించరు. కాని విధేయులు కాకుండుట కెటువంటి కారణము లేదు. ఇతర సమయములందు స్వయిష్టమునే కోరుచు అదివరకు చేయని ప్రార్థనలు చేయుచుందురు. స్వయిష్టమునే కోరుకొనుచు క్రైస్తవులు కానివారు చేయు క్రియలను చేయుచు సమస్యలను పరిష్కరించుకొందురు. దేవుడేమనుకొనుచున్నాడో యని దాని మాత్రము యేమియు ఆలోచించక యితరులేమనుకొందురోయని తలంచుదురు. దావీదు వలెనే తప్పుడు కార్యములను చేయుచు తమ్మును భద్రపరచు కొందురు లేక స్వకీయ కోరికలను జరిపించుకొందురు.

దేవుని యొద్దకు పోకుండ నీకు నీవే తీర్మానించుకొనిన తరుణము లుండినవా? దాని గూర్చి చింతించితివా? దేవుని మరియు ఆయన వాక్యమును త్రోసివేసి అవిధేయుడైన సమయములుండినవా? వాటి ఫలితమేమై యుండెను? దేవుని మార్గమును వెంబడించక స్వకీయ తలంపులనే నెరవేర్చుకొనుటకు శోధింపబడు చున్నావా? ఏ రీతిగా వాటిని మానుకొనగలవు?

**6. దైవభక్తిగల నాయకుడు పాపము చేయుటతో దాని నొప్పుకొనును**

దావీదు దేవునికి విధేయుడై యుండెను కాని సౌలు అట్లు విధేయుడై యుండలేదు. దాని ఫలితముగా యుద్ధమునందు సౌలు మృతిబొందెను. దావీదు రాజాయెను. పండ్రెండు తెగలపై దావీదు తన 49వ సంవత్సరము నందు రాజుగా చేయబడెను. అతడు చేసిన దానినంతటిని దేవుడు వర్ధిల్ల జేసెను. దేశము ఐశ్వర్యమును పొందెను. పెద్దదాయెను, ఫిలిష్తీయులు, మోయాబీయులు, మరియు సిరియనులు ఓడిపోయిరి. అన్ని యుద్ధములందు ఇశ్రాయేలీయులు జయమును పొందిరి.

సమస్తము సరిగా నుండు సమయమున తన 53వ సంవత్సరము నందు యుద్ధము చేయబడుచుండగా వెళ్లకుండునట్లు తీర్మానించుకొనెను. వెళ్లవలసిన వాడు యింటిలో నుండెను. ఒక నాయకుడు దేవుడిచ్చిన బాధ్యతను నిర్లక్ష్యపరచిన యెడల కష్టము వచ్చును. దావీదు అట్లు కష్టములో పడిపోయెను. దావీదు బెత్షెబ అను స్త్రీతో పాపము చేసెను. అతని పాపమును కప్పుకొనుటకు మరొక పాపము చేసెను. నేటి నాయకులకును యిందులో నేర్చుకొనవలసిన పాఠమున్నది.

ఒక విషయమునందు నాయకులు వారి బాధ్యతలను నిర్లక్షపరచ కూడదు. మరొక పాఠము ఏమనగా నాయకులకు శోధనలు రాకతప్పవు. యేసును ఎంత ఎక్కువగా వెంబడించుదువో అంత ఎక్కువగా పాప స్వభావము, సాతానుడు వాని అనుచరులు వ్యతిరేకించుదురు. కాబట్టి శోధనల బాధ ఎక్కువగుచుండును.

కొన్ని సంవత్సరముల నుండి దావీదు జీవితము నందు బెత్షెబతో చేసిన పాపమును గూర్చి సాతానుడు ఆలోచించుచుండెను. అతనికి ఎందరో భార్యలుండిరి. అతడు కోరిన స్త్రీని చూచుటతో ఆమెను వివాహము చేసికొని మరొక భార్యగా తీసుకొనెను. రాజై యుండుట వలన అట్లు చేయుట అతనికి సులభముగా నుండెను. బెత్షెబా అదివరకే వివాహితురాలు. అయినను దావీదు ఆమెను తీసికొనెను. సాతానుడు అందరికిని ఆలాగు చేయుచున్నాడు. చిన్నపాపము పెద్దదగుచుండును. పేరాశ, దురాశ, అహంకారములై యుండవచ్చును. అసూయ, మోసము, కోపము లేక భయములై యుండవచ్చును. అవి యేమై యున్నను అవి చిన్నగా నున్నపుడే వాటిని అదుపులో నుంచని యెడల పాపము ఎక్కువగుచు హతమార్చువరకు కొనసాగుచుండును.

సంఘనాయకులు యిటువంటి పాపమునందు ఆకర్షింపబడుదురు. ఇతరులు మనలను మెచ్చుకొనుచు ఘనపరుచుదురు. సంఘకాపరులను స్త్రీలు ఎంతో గౌరవించుదురు. అట్లు గౌరవించబడుటకెంతో ఆశింతుము. త్వరలోనే మన విధులను గృహమునందును, పరిచర్యయందును నెరవేర్చక నిర్లక్ష్యపరచు చుందుము. శోధనలకు లొంగిపోదుము. దావీదు వలెనే

పడిపోవు స్థితిననుభవించగలము. శోధనకు లొంగిపోకున్నను హృదయము లో అహంకారమునకు చోటు నిచ్చుటతో మనము పాపము చేసి దానితో నింపబడినవారమగుదము.

దేవుడు నిన్ను ఒక నాయకునిగా వాడుకొనుచున్నందునను, నీవు చేయు పరిచర్యను దీవించుచున్నందునను నీవు పాపము చేయలేవని ఎప్పుడైనను తలంచకూడదు. జాగ్రత్త వహించవలెను. తప్పిదము చేయుటతో దానినొప్పు కొనవలెను (1 యోహాను 1:9). దావీదు అట్లు చేయకుండెను. అదివరకు చేసిన పాపములను దాచిపెట్టి వాటిని కప్పిపెట్టుచుండెను. బెత్సెబాతో చేసిన పాపమునట్లే కప్పిపెట్టెను. అట్లు చేయుట వలన పాపము నెక్కువ చేసికొనెను. నరహత్య చేసెను. దేవుని నుండి దూరముగా నుండెను. దానివలన తన కుటుంబముతో పాటు దేశమంతయు శ్రమననుభవించెను. చివరికి అతడు పశ్చాత్తాపపడుటతో క్షమించబడెను. కాని దేశము అతని పాపమును బట్టి వర్ధిల్లకుండెను.

ఎటువంటి పాపములు నీకు జయము పొందకుండునట్లు ఆటంకముగా నున్నవి? అవి మొలకెత్తుచు బలముగా యెదుగుచున్నవా? అవి యేవి? నీ బలహీనతను ఎరుగని యెడల వాటి వలన ఓటమి నెదుర్కొందువు. వాటిపై జయము సాధించుటకు నీవేమి చేయవలసియున్నది? జయము కొరకు ఎవరిని ప్రార్థించెదవు? ఎవరి హెచ్చరికలను తీసికొందువు? దావీదు యొక్క పాపము నుండి నీవు నేర్చుకొనినదేమి?

## 7. దైవభక్తిగల నాయకుడు త్యాగపూరితమగు భర్త మరియు తండ్రియై వుండును

దావీదు శోధన యందు పేరుకు మాత్రమే పడిపోయి యుండలేదు. మరి యొక విషయములోను ఓటమి ననుభవించెను. ఒక భర్తగాను, తండ్రిగాను అతడు మంచి భర్తగా లేకుండెను. ఎందుకనగా అతనికి యితర భార్యలుండిరి. రాజుగా నుండినందున అనేక విషయములందు జోక్యము కలిగి యుండెను. బిడ్డల విషయమై నిర్లక్ష్యత చూపెను. దావీదు 57 సంవత్సరముల వయసు ఉండినపుడు అతని కుమారుడు ఆమ్నోను సోదరియైన తామారుతో పాపము చేసెను (2 సమూయేలు 13:1-20). దావీదు బహుగా కోపగించెను. కాని తామారును ఆదరించలేదు. అమ్నోనును సరిచేయలేదు (2 సమూయేలు 13:21). చివరికి తామారు సహోదరుడు అబ్షాలోము చర్య పూనుకొని అమ్నోనును చంపెను (2 సమూయేలు 13:23-35). మరల దావీదు యేమియు పట్టించుకొనలేదు (2 సమూయేలు 13:36-39). తదుపరి అబ్షాలోము తన తండ్రితో సమాధానపడుటకు ప్రయత్నించెను. కాని దావీదు అబ్షాలోమును కలిసికొనుట కిష్టపడలేదు (2 సమూయేలు 14:25-33). అబ్షాలోము తండ్రియగు దావీదుతో జగడము చేసి దేశములో యుద్ధమును రేపెను. అతడు యితరులతో చంపబడెను (2 సమూయేలు 15-18 అధ్యాయములు). దావీదునకు అది బహు దుఃఖకరమగు సమయము. దేశము కూడ దుఃఖించెను.

నాయకులు దేవుని పరిచర్యలో నిమగ్నులై వారి ప్రథమ బాధ్యతయగు కుటుంబమును నిర్లక్ష్యము చేయుదురు. బైబిలు చెప్పున దేమనగా ఒకరు

మంచి భర్తగా మరియు తండ్రిగా ఉండకపోయిన యెడల అతడు సంఘకాపరియై యుండ కూడదు (1 తిమోతి 3:4–5,12). తన సంఘమునకు ముందు తన కుటుంబ అవసరతలను తీర్చవలెను. మరియు వారిని ఆత్మీయ రీతిలో యెదుగునట్లు సహాయపడవలెను. గృహమునందు ప్రార్థించుచు బోధించవలెను. భార్యబిడ్డల యెడల ఎటువంటి షరతు లేని ప్రేమను ప్రదర్శించవలెను. ప్రేమయందే తన బిడ్డలకు తగిన క్రమశిక్షణను నేర్పవలెను. కుమారులను, కుమార్తెలను సమానముగా గుర్తించవలెను. ఒక మంచి తండ్రి లేక తల్లిగా నుండుటయనునది గొప్ప పరిచర్య చేయుటకన్నను మించినది. దానినే దేవుడు విలువ పెట్టును. ఇంకా తెలుసుకొనుటకు జెర్రి స్మోయర్‌గారు వ్రాసిన వివాహము మరియు పరిచర్య అనే పుస్తకము చదువుము.

నీ పరిచర్యకు ముందు కుటుంబమును ముందుగా పెట్టుచున్నావని నీ భార్య చెప్పగలదా? ఇతరుల ఆత్మయస్థితిలో సహాయపడుట కన్నను ఎక్కువగా కుటుంబీకుల ఆత్మీయవిషయమై శ్రద్ధ ఉన్నదా? లేక ఎక్కువ కాలము కుటుంబము వెలుపల గడుపుచున్నావా? నీ సంఘస్తుల కన్నను నీ బిడ్డల శ్రద్ధ నీకు ఎక్కువగా నున్నదని నీ పిల్లలు చెప్పగలరా? నీ వలెనే నీ పిల్లలు పెద్దవారైనపుడు వారిని గూర్చి అతిశయపడగలవా? ఒక మంచి భర్తగా, భార్యగా, తల్లిగా, తండ్రిగా నుండుటకు నీవేమి చేయగలవు?

## 8. దైవభక్తిగల నాయకుడు యితరులకు శిక్షణ నిచ్చు దూరదృష్టి గలవాడు

దావీదు ఒక నాయకునిగా నుండుట నేర్చుకొనుటలో కొనసాగుచుండెను. తన సైన్యమును నడిపించుచుండెను. తన 63వ

సంవత్సరమున మరొక ఫిలిష్తీయ వీరుని ద్వారా చంపబడవలసి యుండెను. కాని దేవుడు తప్పించెను (2 సమూయేలు 21:15–17). దేవుడు దావీదు, బెత్షెబాలను దీవించి యొక కుమారుని దీవెనగా అనుగ్రహించెను. అతని పేరు సొలొమోను. అతడే దావీదు తదుపరి రాజుగా నుండబోవువాడు. దావీదు శ్రేష్ఠమగు తండ్రిగా నుండెను. సొలెమోనుతో సమయమును గడుపుచు తర్ఫీతునిచ్చుచు దైవభక్తి గలవానిగాను, నాయకునిగాను చేసెను (1 రాజులు 1 అధ్యాయము; 1 దినవృత్తాంతములు 22 అధ్యాయము). దావీదునకు 72 సంవత్సరముల వయస్సు వచ్చినపుడు దావీదు సొలొమోనునకు దేవాలయపు పునర్నిర్మాణమును చేయు బాధ్యత నప్పగించెను (1 దినవృత్తాంతములు 28:1–21). రెండు సంవత్సరములైన తదుపరి దావీదు మరణించెను. సొలొమోను రాజాయెను (1 రాజులు 2:10–12).

నాయకులు ఎల్లప్పుడు యితరులను తర్ఫీతు చేయుచుండవలెను. పరిచర్య చేయుట నేర్పవలెను. ఇది గొప్పది. దేవుడు ప్రసాదించిన బాధ్యత (ఎఫెసి 4:12). ఒక మంచి నాయకుడు యితరులకు శిక్షణ నిచ్చుటలో బహుచురుకుగా నుండును (2 తిమోతి 2:2). దావీదు వలెనే మన బిడ్డల శిక్షణ ఉండవలెను.

నీవు ఎవరికి నీవు చేయు పరిచర్య చేయునట్లు శిక్షణ నిచ్చుచున్నావు? జీవిత చివరి సంవత్సరముల వరకు వేచియుండకుము. యేసువలెనే ఆయన మాదిరిని పాటించుచు ఆసక్తి చూపువారు శిక్షణ పొందునట్లు చేయుము.

బైబిలునందు దావీదు బహుగా ప్రేమింపదగినవాడు. అతని గూర్చి చదువుము. నాయకత్వ పాఠములు ఎక్కువగా నేర్చుకొనుము. దావీదు జీవితములోని నాయకత్వము :

1. సవాలుల నెదుర్కొనుటకు ధైర్యముగా నుండుట.
2. ఓపిక మరియు సహనము గలిగియుండుట.
3. వినయమును కలిగియుండుట.
4. దేవుని యందు లోతైన విశ్వాసము కలిగియుండుట.
5. దేవుని యెడల విధేయత ప్రదర్శించుట
6. వెంటనే పాపము నొప్పుకొనుట
7. త్యాగము చేయు భర్త, తండ్రిగా నుండుట.
8. ఇతరులకు శిక్షణ నిచ్చు దూరదృష్టి గలిగియుండుట.

ఇవన్నియు నీలో నున్నవా? నీలో ఉన్నవేమి? ఏవి కొదువగా నున్నవి? అభివృద్ధి జెందుటకేమి చేయుదువు? వీటిని గూర్చి ప్రార్థించుము. సహాయపడుమని దేవుని అడుగుము.

# 6. నెహెమ్యా జీవితము నుండి నాయకత్వ పాఠములు



**నెహెమ్యా గ్రంథమంతయు చదువుము**

కొనసాగుచుండు వారి అవిధే యతను బట్టి యూదులు బబులోను దేశము నందు బంధకములో నుంచ బడిరి. తానిచ్చిన వాగ్దానము నను సరించి దేవుడు ఏబది సంవత్సరముల తర్వాత యెరుబ్బయలు అధికారములో నుండునట్లు కొందరు యూదులను తిరిగి వచ్చునట్లు చేసెను. వారు ధ్వంసము చేయబడిన దేవాలయమును తిరిగి నిర్మించిరి. మొదటి దేవాలయమంతటి గాంభీర్యత లేకుండెను. వారి బోధకులు హగ్గయి మరియు జెకర్యా అనువారు. ఆ సమయమందు ఎస్తేరు రాణిగా నుండి యూదులను భద్రపరచెను. యూదులలో ఎక్కువ మంది వారి జీవితము సుఖదాయకమై యుండుటను బట్టి బబులోను నందే యుండుట కిష్టపడిరి. తిరిగి వచ్చి నాశనమైన పట్టణమును తిరిగి కట్టుట కన్నను అక్కడే యుండుట మెరుగు గదాయని తలంచుకొనిరి.

85 సంవత్సరములు గడిచిన తదుపరి ఎజ్రా అను దైవ సేవకుడు ఒక చిన్న గుంపును పర్షియా దేశము నుండి యెరుషలేమునకు నడిపించెను

మరి యింకను 15 సంవత్సరములైన తర్వాత దేవుడు నెహెమ్యా యను ఒకని ఎన్నుకొని మూడవ తుది గుంపును తిరిగి వచ్చునట్లు చేసెను. యెరూషలేము పతనమైనపుడు నెహెమ్యా యొక్క ముత్తాతలు, అవ్వలు బంధకములోనికి తీసికొని వెళ్లబడిరి. వృద్ధులుగా యుండినవారు తమ దేవుని యందలి విశ్వాసమును కొనసాగించు కొనిరి. అందును బట్టి నెహెమ్యా అని పేరు పెట్టిరి. దాని అర్థము "ప్రభువు ఆదరించును."

అర్తహషస్త రాజు యొక్క ప్రభుత్వము నందు నెహెమ్యా బహు ప్రాముఖ్యమగు స్థలము నందుండెను. అతడు రాజునకు గిన్నె అందించువాడు (నెహెమ్యా 1:11). ఆ దినములందు రాజు పానము చేయవలసిన పదార్థమును ముందుగా గిన్నె నందించు వాడు త్రాగవలెను. ఎందుకనగా ఎవరును దానిలో విషము కలుపకుండా ఉన్నదని యెరుగుట కొరకే. అట్టి స్థితి నెహెమ్యా కాలము నందు గొప్పదై యుండెను. నెహెమ్యా సహాయకులలో ఉన్నత స్థితియందుండెను. రాజునకు సలహాల నిచ్చువాడై యుండెను.

## 1. దైవభక్తిగల నాయకుడు ప్రార్థించును

క్రీ.పూ. 446వ సంవత్సరము నందు షూష అను రాజధాని పట్టణములో నుండగా భయంకరమగు యెరూషలేము స్థితిని గూర్చియు, అక్కడ నివసించు యూదులను గూర్చియు నెహెమ్యాకు వార్త వచ్చెను. యెరూషలేము యొక్క గోడలు తిరిగి నిర్మించబడలేదు. అట్టివి ప్రజలకును వారి దేవునికిని అపకీర్తి తెచ్చెను. పొరుగు దేశములు దాని చూచి ఇశ్రాయేలు దేవుడు ఆయన ప్రజల విషయమై తగిన శ్రద్ధ వహించలేదను

ఋజువు వెల్లడాయెను. యూదులు తిరిగి వచ్చి 150 సంవత్సరములైనది. కాని యెరూషలేము పట్టణ పునర్నిర్మాణ విషయమై శ్రద్ధ వహించలేదు. ఇట్టిది నెహెమ్యానెంతో బాధపరచెను. అతడు కొన్ని దినములు ఉపవాసములో గడిపి ప్రార్థన చేసెను (నెహెమ్యా 1:1–5).

కొన్ని వందల మైళ్ల దూరములో నుండినను నెహెమ్యా యెరూషలేమునందున్న వారిపై వ్యక్తిగతముగా శ్రద్ధ వహించెను. అతడు కాని, అతని తండ్రి, తల్లి యైనను అక్కడికి తిరిగి వెళ్లలేదు. కాబట్టి అక్కడ స్థితికి వారు బాధ్యులు కారు. అక్కడ నివసించు ప్రజలే పతనమైన గోడలను తిరిగి నిర్మించక, పట్టణమును పునర్నిర్మించక అప్పటి స్థితికి బాధ్యులైరి. వారి అపజయమును గూర్చి నెహెమ్యా బహుగా యేడ్చెను. వారి స్థితికి వారే కారణమై యుండినను వారిపై నెహెమ్యా వారి శ్రమలను తలంచుచు జాలిపడెను. వారి అవసరతలతో నెహెమ్యా కూడ గుర్తించబడినందున వారిని నిందించలేదు. వారిని విమర్శించలేదు. దేవుని కీర్తికి భంగము కలిగినందున నెహెమ్యా ఎంతో బాధపడెను.

నెహెమ్యా ప్రార్థనాపరుడు (1:4; 2:4; 2:9; 5:19; 6:9, 14; 13:14, 22, 29, 31). ఎల్లప్పుడును ప్రార్థించుచుండెను. నెహెమ్యా గ్రంథపు అంశమే ప్రార్థనయై యున్నది. జీవితములందు జరుగు ప్రతి ఘట్టమును గూర్చి ముందుగా నెహెమ్యా దేవుని యొద్దకే వెళ్లెడివాడు. దానియేలు కూడ అట్లే చేసెను. ఈ మొదటి ప్రార్థన యందు యెరూషలేము స్థితిని వినినందున దేవుని ప్రేమ కొరకు బ్రతిమిలాడెను. తన ప్రజలను కనికరించుమని ప్రార్థించెను. దానియేలు వలెనే తన ప్రజల పాపములను ఒప్పుకొనెను. మరియు దేవుడు నీతిమంతుడని ఒప్పుకొనెను. వారి

స్థితిని సరిచేయుమని దేవుని సహాయమును కోరెను. లేవీయకాండము 26 మరియు ద్వితీయోపదేశకాండములో నుండు దేవుని వాగ్దానములను నెహెమ్యా జ్ఞాపము చేసికొనెను. ఒక దినమున దేవుడు తన ప్రజలను వారి పట్టణమునకు తిరిగి చేర్చునని నమ్మెను.

నేడును నాయకులకు ప్రార్థన యను లక్షణము ప్రాముఖ్యమై యున్నది. అసలైన నాయకుడగు దేవుని వెంబడించక యితరులను నడిపించలేము. దేవునితో మాట్లాడుచు, దేవుని మాటలను వినుచు సమయమును గడిపినపుడు దేవుడు మనల నెక్కడికి నడిపించుచున్నాడో తెలియును. మనమును ఏ రీతిగా యితరులను నడిపించవలెనో యెరుగుదుము. అట్లు చేయని యెడల మనదారినే వెళ్లుచుందుము. అట్టిది నాశనమునకే నడుపును. ప్రార్థన లేనిదే ఏదియు ఫలభరితముగా చేయబడదు. దేవునిపై వేచియుండునట్లు ప్రార్థన చేయుచున్నది. స్వయిష్టప్రకారము పోకుండునట్లు ఆటంకపరచుచున్నది. దేవుని యేర్పాటును వెంబడించునట్లు దారిని తెరుచుచున్నది. మన విశ్వాసమును ప్రయోగించునట్లు చేయుచున్నది. కాబట్టి మన కర్తవ్యము నందు దేవుని నమ్మకొనుచుందుము. శ్రమలలోనున్న క్రైస్తవుడైన, సంఘమైన, దేవుని నమ్మకము నుండి వెనుకబడినపుడు నీవు వారిని నిందించక తీర్పు తీర్చగలవా? లేక వారి నిమిత్తము హృదయము పగులుచున్నదా? దేవుని హృదయమువలె దేవునికి లోబడనొల్లని ప్రజలంటే నీకు దయ ఉన్నదా? వారి మీద దేవుని దయ ఉండునట్లు ప్రార్థించవా? దేవుని ఘనత కొరకు వారి పట్ల శ్రద్ధ లేదా? వారి కోసము నీ ప్రజలను ఉపవాసములో నుంచి ప్రార్థించలేవా? నీవు ఆ రీతిగా ప్రార్థించు స్త్రీ లేక పురుషుడైన నాయకునిగా

యుండగలవా?

## 2. దైవభక్తిగల నాయకుడు ఓర్పు మరియు ప్రణాళిక గలవాడు

దాదాపుగా నాలుగు మనవులు నెహెమ్యా యెరుషలేము పట్టణ స్థితి కొరకు ఉపవాసముతో ప్రార్థించెను. ఆ సమయము నందు దేవుడు నెహెమ్యాకు ఒక తలంపును కలిగించెను. ఎవరైన ఒకరు యెరూషేలేమునకు వెళ్లి అక్కడి స్థితిని సరిచేయునని ప్రార్థించుచుండెను. ఒకవేళ ఆ ఒకరు అతడేనేమో! తదుపరి ఒకసారి రాజు నెహెమ్యాను అతనినేమి బాధపరచుచున్నదని అడిగెను. రాజు సమక్షము నందు ఎవరైనను సంతోషముగా నుండవలసినదను నియమము ఉండెను. అనగా దుఃఖపీడితులుండకూడదు. కాని నెహెమ్యా యథార్థపరుడైనందున స్వస్థలమైన యెరూషలేమును గూర్చి దుఃఖించుచున్నానని చెప్పెను. రాజు యొద్ద నెహెమ్యాకు మంచిపేరు ఉండెను. కాబట్టి ఎటువంటి సహాయమును కోరచున్నావని రాజు అడిగెను. దేవుడిచ్చిన యేర్పాటును గూర్చి రాజునకు తెలియజేయుటకు ధైర్యము తెచ్చుకొనెను. తానే వెళ్లి పతనమైన యెరూషలేము గోడలను తిరిగి నిర్మించగోరినట్లు తెలియజేసెను (నెహెమ్యా 2:1-5).

ఎంతో ఓర్పు కలిగి నాలుగు మాసములు ప్రార్థించి ఈ విషయములో దేవుని సమయము కొరకు వేచియుండెను. సమస్తము దేవునిపై ఆధారపడియున్నదని యెరిగి ప్రార్థించెను. తన కర్తవ్యమును యెరూషలేమునందు జరిగించుటకు అవసరమైన యేర్పాట్లను కూడ తలంచుకొనెను. తన కర్తవ్యమేమైయున్నదని రాజు అడుగుటతో వెంటనే

తెలియజేసెను (నెహెమ్యా 2:6-8). ప్రార్థించెను మరియు యేర్పాట్లను కూడ చేసికొనెను. మనమును దేవుడు మనకు ద్వారము తెరచునంత వరకు ఓర్పు కలిగి వేచియుండవలెను. తెరువబడుటతో ఏ మాత్రము ఆలస్యము చేయక ముందుకు సాగవలెను. కర్తవ్యమును చేయునట్లు ముందుగా ప్రణాళిక చేసికొనవలెను.

దైవభక్తిగల నాయకుడు ముందుగా యేర్పాటు చేసికొనును. నెహెమ్యా రాజు వేసిన ప్రశ్నకు సమాధానమును ముందుగా యేర్పరచుకొనెను. ఎన్ని దినములు తీసికొనును? ఎటువంటి సామగ్రి అవసరము? ఎందరు పనివారు కావలెను? అనుమతి పత్రములెన్ని కావలెను? ముందుగనే సమస్తము నేర్పరచుకొనెను. దైవభక్తిగల నాయకుడు ప్రార్థనను చేయుచు యేర్పాట్లను కూడ చేసికొనును. రెండింటిని ఒకేసారి చేయుచుండును. దేవుని సమయము కొరకే వేచియుండును. సమయము వచ్చుటతో వెంటనే ముందుకు సాగుచు కర్తవ్యమును ప్రారంభించును. కష్టము లెదుర్కొనునని ముందుగా యెరిగినవాడై వారిని జయించుటకు యేర్పాట్లు చేసికొనెను. ఉదాహరణముగా, యెరూషలేము తిరిగి నిర్మించబడకుండుటకు గల కారణములలో నొకటి పొరుగుదేశములు దానిని బలహీనముగా నుండవలెనని కోరియుండుటయే. యూదులు ఎదిరించువారని రాజునకు తెలిపియుండుటలో రాజు పట్టణమును, గోడలను తిరిగి నిర్మించకుండునట్లు ఆజ్ఞనిచ్చెను. నెహెమ్యా ఈ ఆజ్ఞను తొలగించువాడు తన రాజగు అర్తహషస్త అని యెరిగియుండినందున తన రాజునకే తెలియజేసి అనుమతి పత్రములను బొందెను. దైవభక్తిగల నాయకుడు ఓర్పుతో భవిష్యత్తు

కొరకు యేర్పాటు చేసికొనును.

నేడు కొందరు నాయకులు దేనినో ప్రారంభించుటకు ఆతురత కలిగి యుందురు. కాని దాని గూర్చి ప్రార్థించరు. కాని వెంటనే ప్రారంభించి దాని ముగించుటకు ప్రయాసపడుదురు. ఇతరులు ఓర్పు కలిగి ప్రార్థించి వేచి యుందురు. దైవభక్తిగల నాయకుడు ఓర్పుగలవాడు. మంచి యేర్పాటులను ముందే చేసికొనును.

దేనినైనను చేయుటకు ముందుగా ప్రార్థించక యేర్పాటు చేసికొనక యుందువా? లేక అందుబాటులోనున్న తరుణములను తొలగించుకొని క్రొత్తదానిని చేయునట్లు ప్రారంభించుదువా? ప్రార్థించి వేచి యుందువా లేక వనరులు లేనందున యేమియు చేయక యుందువా?

### 3. దైవభక్తిగల నాయకుడు జాగ్రత్త గలవాడు

నెహెమ్యా ప్రయాణము చేయుటకు కొన్ని మాసములు తీసికొనెను. మరియు ప్రయాణము చేయుటకు కొన్ని మాసములు గడిపెను. యెరూషలేమును గూర్చిన వార్తను విని అప్పటికే ఒక సంవత్సరమైనది. దానిని గూర్చిన పరిష్కారము చేయుటకు అక్కడికి చేరెను. కొందరైతే తొందరపడి వారి పనిని వెంటనే ప్రారంభించి యుందురు. కాని నెహెమ్యా అట్లు చేయలేదు. యెరూషలేము నందలి నాయకులను గూర్చి తెలుసుకొనుచు సమయమును తీసికొనెను (నెహెమ్యా 2:11-12).

అక్కడి పరిస్థితిని గూర్చి సమాచారమును సేకరించెను. తాను ఒంటరిగా వెళ్లి పట్టణమును పరిశోధించి దాని గోడలను తనిఖీ చేసెను (నెహెమ్యా 2:13-16). రాత్రులందే వీటి విషయమును చర్చించు

చుండెను, ఎందుకనగా యితరులు అతనిని గమనించకుందురు. వారి ప్రభావమును తొలగించుకొనెను. ఎటువంటి తీర్మానమును చేయకముందు సమాచారమును సేకరించుకొనెను. కొందరు తొందరపడుచు వారి తీర్మానములతో ప్రారంభించి యది సఫలము కాకుండుటతో వారి తీర్మానములు సరిగా లేకుండెనని గ్రహించుదురు. ఎవరో ఒకరి అభిప్రాయమును వెంబడించిన యెడల సరియగు తీర్మానమును చేయలేము. ఓపిక కలిగి సమాచారము నంతటిని సేకరించుకొనినపుడు పరిశుద్ధాత్ముడు నెమ్మదిగా మనతో మాట్లాడుచున్నాడు. తగిన రీతిగా నడిపించుచున్నాడు. ఆయన నడిపించు చుండగా ఆయననే వెంబడించ వలెను. దైవభక్తిగల నాయకుడు జాగ్రత్త వహించును. ఆయన పడిపోకముందే ఆయన చూచును.

ఎటువంటి సమాచారమును తెలియకయే పనిని ప్రారంభించిన సమయమును గూర్చి ఆలోచించుము. ఫలితము ఏమైనది? అట్లు తరచుగా చేయుచుందువా? తీర్మానము చేయక ముందు కర్తవ్యమును గూర్చి తెలిసికొనుటకు తగిన ఓర్పును కలిగియున్నావా? నీ తీర్మానములు చేయుటకు ముందుగా జాగ్రత్త కలిగి యుండుటకు ఏమి చేయుదువు?

### 4. దైవభక్తిగల నాయకుడు చర్యపూనుకొను సమయము నెరిగినవాడు

జాగ్రత్త గలిగి యుండుట ప్రాముఖ్యమే. కాని చర్యపూనుకొను సమయము ఉన్నది. సమాచారమును సేకరించుకొనిన పిదప ప్రార్థించుటతో నెహెమ్యా చర్యను ప్రారంభించెను. నాయకులకు సవాలులనిచ్చెను. పట్టణమును దాని గోడలను తిరిగి నిర్మించుటకు

కార్యము నారంభించెను (నెహెమ్యా 2:17-18).

ఎప్పుడు జాగ్రత్తగా నుండవలెనో తెలిసికొనుట ప్రాముఖ్యము. చర్యను ప్రారంభించు సమయమును కూడ తెలిసికొనవలెను. ప్రజలేరీతిగా పనిని ప్రారంభించవలెనో నెహెమ్యా నడిపించిన విధమును చూడవలెను. వారిని పనిని ప్రారంభించునట్లు పురికొల్పెను. ఒకరినైనను నిందించలేదు. విమర్శించలేదు. వారితో కలిసి ఐక్యముగా నుండెను. "మనకు యిక మీదట నింద రాకుండ యెరూషలేము యొక్క ప్రాకారమును మరల కట్టుదము రండి." (నెహెమ్యా 2:17-18). దైవభక్తిగల నాయకుడు ప్రజలతో గుర్తింపబడుచు వారిని చర్యపూనుకొనునట్లు పురికొల్పును. వారును వెంబడించుదురు. ఇది వరకు మనము చూచినదేమనగా ఒక మంచి నాయకుడు తన గమ్యము నెరిగినవాడనియు, దానినెట్లు చేరవలెనో దానిని కూడ ఎరిగిన వాడనియు మరియు అక్కడికి యితరులను ఏ రీతిగా తనతో తీసికొనివెళ్ళవలెనో కూడ ఎరిగినవాడనియు చూడగలిగితిమి. నెహెమ్యా అట్లు చేయగలిగెను. ఎందుకనగా అతడు వారితో ఐక్యత కలిగియుండెను. వారిపై అధికారియై యుండలేదు. ఆజ్ఞాపించలేదు. దేవుడు ప్రసాదించిన దూరదృష్టితోను, యేర్పాటుతోను పట్టణమును తిరిగి నిర్మించెను. అది ముగింపబడుకార్యమని వారికి నిరీక్షణనిచ్చెను. వారు సమ్మతించి అతని వెంబడించిరి.

జాగ్రత్త కలిగియుండుటకును, చర్యపూనుకొనుటకును, మధ్యగల సరితూగు స్థితిని కలిగియున్నావా? అట్లు నీవు చేయగలుగునట్లు ఎవరి సహాయమును దేవుడు కలుగజేసెను? నీవు సహాయము చేయు ప్రజలతో ఐక్యత యున్నదా? వారికి బోధించుచు వారిని నడిపించుచున్నావా?

భవిష్యత్తులోని నిరీక్షణను నీవు వారికి తెలియజేసినందులకు వారు వారి యిష్టప్రకారము వెంబడించుచున్నారా? లేక వారు తప్పు చేసినపుడు వారిని కోపగించి విమర్శించుచున్నావా? దేవుడు ఏ రీతిగా పురికొల్పుచున్నాడు?

## 5. దైవభక్తిగల నాయకుడు ఒకరికి అధికారము నిచ్చి పంపువాడు

చర్యపూనుకొను సమయము వచ్చుటతో దైవభక్తిగల నాయకుడు దానిని ప్రారంభించుటకు యేర్పాట్లను సిద్ధము చేసికొని యుండవలెను. ఈ యేర్పాట్ల యందు యితరులును పనిచేయునట్లు వారిని చేర్చవలెను. నడిపింపునీయవలెను. కార్యము ముగించబడునట్లు నాయకుడు తన సహకారమునిచ్చుచు యితరుల సహాయమును తీసికొనుచుండవలెను. ఇతరులకు అధికారము నిచ్చి కార్యమును ముగించవలెను. నెహెమ్యా 3:1-32 ప్రకారము వివిధరీతులుగా ప్రజల నుపయోగించి కార్యమును ముగించుటకు బాధ్యత నిచ్చెను. మంచి పని చేయునట్లు పురికొల్పబడినది.

మరియు నెహెమ్యా ప్రతి యొక్కడును పనిచేయునట్లు చూచెను. నాయకులైన వారు యితరులచే పనిని జరిపించిరి. అందరును చిన్నదైనను, పెద్దదైనను పనిచేసి ముగించిరి. నెహెమ్యా కూడ పనిచేసి మంచి మాదిరిని కనబరచెను. వారితో కలిసి పని చేసెను.

నెహెమ్యా ప్రార్థించుట మాత్రమే కాక దేవుని యందు గొప్ప విశ్వాసమును కలిగి యుండెను. దానితోపాటు ముందుగానే యేర్పాటు చేసి పనినంతటిని పర్యవేక్షణ చేసెను. దేవుని కార్యము బహుగొప్పది. మన పనికూడ ఆలాగుననే ఉండవలెను.

నీ పరిచర్యలో యితరులును నీవలె పనిచేయక పోయిన నీతో సహకరించు నట్లు వారికి కొంతపని అప్పగించుచున్నావా?

విశ్వాసమనునది సంస్థకు, ప్రతినిధికి బదులుకాదు. దేవుడు ప్రణాళిక గలవాడు. మన చుట్టు ప్రపంచమును చూచిన యెడల ఎంత మంచిగా అంతయు కలిసి పనిచేయుచున్నది. దేవుడు చేసిన ప్రతిదియు మంచిగా, ప్రణాళికతో సిద్ధపరచినదే.

నీవు చేయు పరిచర్యలో యితరుల కధికారము నిచ్చి పంపుచున్నావా? లేక సమస్తము సరిగా నుండునట్లు నీవే చేయుచున్నావా? నీ పరిచర్యలో యితరులును సహకరించునట్లు వారికి కొంతపని నప్పగించుచున్నావా? నీ నాయకత్వము సరిగా నున్నదని, క్రమముగా నున్నదని యితరులు చెప్పుకొనుచున్నారా? నీ సమయమును ముఖ్యమైనవి ముందుగా చేయునట్లు వాటిని కూర్చుకొనుచున్నావా? మంచిగా ఏర్పరచబడినదా? నీవు మంచిగా నిర్వహించని యెడల ముందు పనిని మరి ఎవరి నుండి మంచి సహాయము ఆశించగలవు?

## 6. దైవభక్తిగల నాయకుడు ప్రతికూలత నెదుర్కొనువాడు

నేను యువకుడనై యున్నపుడు నేను తలంచినదేమనగా, దేవుడు కోరిన దానినే నేను చేయుచున్నాను అనియు, అది దేవుని మార్గమే అనియు, దేవుడు దానిని దీవించుననియు, నేను చేయునదంతయు జయకరముగా నుండుననియు తలంచితిని. అదంతయు నిజముకాదని తదుపరి తెలిసికొంటిని. నీ జీవితమందు కూడ యిది నిజమని నీవు తలంచుకొందువుగదా. దేవుడు కోరిన రీతిగా దేవుని చిత్తమును

జరిగించినపుడు ప్రతికూలత నెదుర్కొందుము. ప్రపంచము, శరీరము మరియు సాతానుడు వారి అనుచరులు మనము చేయు పరిచర్యనంతటిని ఎదిరించెదరు.

నెహెమ్యా ఎంతగానో ఎదిరించబడెను. సమీపముగా బసచేయుచుండిన అరబ్బులు సన్బలటు అను నాయకుని అధికారములో యెరూషలేమును తిరిగి నిర్మించుటను బహుబలముగా వ్యతిరేకించెను. వారందరును యూదులపై అధికారము చూపుచు యెరూషలేము పట్టణ గోడల శిథిలమును బట్టి అవకాశము తీసికొని యుండిరి. వారు యూదులకు బీదతనము నిచ్చి వారు ధనికులైరి. గోడల నిర్మాణము ప్రారంభమగుటతో వారిని ఎగతాళి చేసిరి. వారిని చంపదలచిరి. వారి పనిని ఆపివేయదలచిరి (నెహెమ్యా 4:1–14). దైవభక్తిగల నాయకుడు వ్యతిరేకతను, విమర్శను పరిష్కరించునట్లు నేర్చుకొనవలెను. ఎందరో ఎగతాళి చేయుదురు మరియు భయపెట్టుదురు.

నెహెమ్యా అటువంటి స్థితిలో ఏమి చేసెను? భయమును తనను ఏలనీయ లేదు. దానికి బదులుగా అతడు ప్రార్థించెను. సమాధానము కొరకు రెండుసార్లు ప్రార్థించెను. భద్రతను, తెలివిని కోరెను (నెహెమ్యా 4:4,5,9). మనమును వ్యతిరేకతను ఎదుర్కొనినపుడు దానిని దేవుని యొద్దకు తీసికొని వెళ్లవలెను. అనగా ప్రార్థించవలెను. దేవుని ప్రోత్సాహమును, నడిపింపును వినుచుండవలెను. దానిని పాటించవలెను (యాకోబు 1:5). వాటిని దేవుడు తొలగించునని తలంచకూడదు. నెహెమ్యా విషయమునందు దేవుడు ఎదిరింపును ఆపి యుండలేదు లేక

తీసివేయలేదు. వాటిని కొనసాగునట్లే చేసెను. వాటిద్వారా ప్రజలు దేవునిపై తమ నమ్మిక నుంచుకొని ఆయన ప్రసాదించు భద్రతను, సరఫరాలను ఎక్కువగా నమ్మెదురు. అట్టిదానిని నేడును దేవుడు మనపట్ల చేయుచున్నాడు.

నెహెమ్యా ప్రార్థించెను. తమ్మును భద్రపరచుకొను జాగ్రత్తను కూడ తన ప్రజలకు నేర్పెను (నెహెమ్యా 4:9). వారు పనిచేయుటలో నిమగ్నులగునట్లు చేసెను. వారు పరికరములను కూడ తమతో నుంచుకొనునట్లు చేసెను (నెహెమ్యా 4:15-23). సమస్తమును దేవునిపై ఆధారపడియున్నదని నమ్మి ప్రార్థించవలెను. కర్తవ్యము మాత్రము మనపై ఆధారపడియున్నదని నమ్మి ప్రార్థించవలెను. నిన్ను నీవు భద్రపరచుకొనునట్లు జాగ్రత్త వహించుము. దేవుడు కోరిన దానినే చేయుచుండుము. భయమును ఏ మాత్రము నిన్ను ఏలనియ్యకుము. నిరుత్సాహపడకుము. ఎదిరింపు, వ్యతిరేకతలు వచ్చును. దైవభక్తిగల నాయకుడు వాటి కొరకు సిద్ధపడియుండి పనిలో కొనసాగును.

నీ పరిచర్యలో నీ వెదుర్కొను వ్యతిరేకతనెట్లు పరిష్కరించుకొందువు? దేవుడు వాటిని నీ కొరకు అట్టిది జరుగకుండునని మాన్పునని తలంచెదవా? నీ పరిచర్య మరియు జీవితము నందుండు ప్రతివిషయమును గూర్చి ప్రార్థించుటలో యథార్థముగా నున్నావా? ప్రతి విషయమును చక్కగా పరిష్కరించుకొనుచున్నావా?

## 7. దైవభక్తిగల నాయకుడు ధైర్యశాలియై ఉండును.

ప్రజలు గోడల నిర్మాణమునందు నిమగ్నులైయుండగాను మరియు

ఎవరైనను వచ్చి పైబడుదురేమోనని తలంచుచు తమ్మును భద్రపరచుకొనుచుండగాను, పైరు పంట విషయమును నిర్లక్ష్యపరచిరి. కోతకాలము వచ్చుటతో సరిపోవునంతటి ఆహారము లేకుండెను. ప్రజలు ఆహారకొరతవలన ఇబ్బంది పడిరి. ధనికులు బీదవారికి అప్పు యిచ్చిరి. ఆకలి బాధ వలన ప్రజలు అప్పు తీసికొనిరి. కొందరు తమ బిడ్డలను బానిసత్వమునకు అమ్మి యుండిరి. ఉపవాసముండకుండునట్లు చేసికొనిరి. ఈ స్థితిని చూచి నెహెమ్యా బహుగా బాధపడెను. ఇట్టి ప్రయోగమును నిలిపి వేయునట్లు దృఢపరచుకొని దాని సవరించెను (నెహెమ్యా 5:10–13).

ఆ విధముగా ధనికులు, శక్తిగలవారు బీదలను, బలహీనులను వారి స్వలాభము కొరకు ఆలాగే చేయుట మనము కూడ చూచుచున్నాము.

తమ్మును తాము భద్రపరచుకొనుటకు బలహీనత గలిగినవారికి సహాయ పడునట్లు దైవభక్తిగల నాయకుడు సిద్ధపడవలెను. యేసు అట్లే చేసెను. ఆయన మాదిరినే మనమును పాటించవలెను. ప్రస్తుత స్థితిని పరిష్కరించుటకు తెలివినిమ్మని ప్రార్థించవలెను. సలహాను కోరవలెను. దాని గూర్చి దీర్ఘముగా ఆలోచించుము. తదుపరి దేవుని సహాయముతో సమస్తమును సరిగా చేయునట్లు కర్తవ్యమును పూనుకొనుము.

నెహెమ్యా ధనికులను మరియు పేరుగాంచిన యూదులను కలిసి సంప్ర దించెను. అన్యాయముగా తీసికొనిన వాటిని యిచ్చివేయునట్లు ప్రోత్సహించెను. ఇట్లు చేయుట కష్టముగా నుండెను. ఎందుకనగా వీరు పట్టణమునే స్వాధీనము నందుంచుకొనినవారు. వారి సహాయము

నెహెమ్యాకు అవసరమై యుండెను. యెరూషలేమును అభివృద్ధి చేయవలెను గదా. ఒక మంచి నాయకుడైయుండుటకు ధైర్యము కావలెను. సరియైన దానిని చేయుట యనగా కష్టమైన దానిని చేయుటయే. ధనికులలోని పేరాశను ఎదిరించవలసినదే. అది బహుకష్టమే. శాంతముగా నుండుట కొరకు అనేక నాయకులు మౌనము దాల్చుటతో యది పాపముతో రాజీపడుటయే. దేవుడు ఏ మాత్రము మెచ్చుకొనడు. ఎంత కష్టమైనను, ఎంత ఖర్చుపెట్టినను సరియైనదానినే చేయవలెను. యేసు అట్లు చేయుమని ఆజ్ఞాపించెను (మత్తయి 25:34-46; యాకోబు 1:17).

నిస్సహాయస్థితిలో నున్నవారిని భద్రపరచునట్లు, వారిని భద్రపరచు వారిని గద్దించునట్లు ధైర్యమును కలిగియున్నావా? యేసు మాదిరిని పాటించునపుడు ఎదుర్కొను వాటి నేలాగు పరిష్కరింతువు? ధైర్యముగా నిలుచుండక రాజీపడిన సమయమును గూర్చి తలంచుము. ఎవరికి సహాయపడవలెనో వారినెరుగుదువా?

## 8. దైవభక్తిగల నాయకుడు యథార్థత మరియు వినయము కలిగి వుండును

ధనికులేమి చేయవలెనో దానిని చెప్పుట మాత్రమే కాక నెహెమ్యా వారు వెంబడించుటకు తగిన మాదిరిని యేర్పరచెను. ఇశ్రాయేలునకు గవర్నరుగా రాజుచే నియమించబడినందున జీవితమును బొందెను. తాను చేసిన పనికి మాత్రము జీతమును పుచ్చుకొనవలెను. ప్రతిదినము 200 మందిని పోషించెను (నెహెమ్యా 5:14-19). దైవభక్తిగల నాయకుడు

తన ఉద్యోగస్థితిని, ఆ భాగ్యమునే మాత్రము తనకొరకు ఉపయోగించుకొనడు. అతడు యథార్థపరుడు (1 తిమోతి 3:2). తాను ప్రజలకు సేవచేయువాడని గుర్తించుకొనును. అతడు దేవుని రాజ్యమును నిర్మించుచుండెను. తన స్వంతము కొరకు కాదు.

నెహెమ్యా తన తలంపును బట్టి, స్థితిని బట్టి అతిశయించి యుండవచ్చును. యెరూషలేము గోడలను తిరిగి నిర్మించుట సులభమగు కార్యము కాదు. ప్రతి యొక్కరు అతని గౌరవించిరి. అతడు తనను గూర్చి అందరిని మించినవాడని, తనలో ఎంతో ప్రత్యేకత ఉన్నదని తలంచి యుండవచ్చును. నేటి నాయకులును అట్టి శోధనలో పడుచున్నారు. మనమును మనలోని తలాంతులు, స్థితిని బట్టి అతిశయించగలము. అతిశయము అనునది సాతానుని బలమైన పరికరము. ముఖ్యముగా సంఘుకాపరులపై నుపయోగించెను (సామెతలు 16:18). అతి శయించుట నూతన నాయకులకును, ప్రారంభింకులకును అపాయకరము (1 తిమోతి 3:6). నిన్ను గూర్చి జాగ్రత్త వహించుము. ఎవరైనను తప్పించుకొనలేరు. దానిచేత శోధింపబడమని తలంచుకొనువారు జాగ్రత్త పడవలెను. అట్లు తలంచుటయే అతిశయించుటయై యున్నది.

నెహెమ్యా వినయమును ప్రదర్శించెను. యథార్థపరుడును, తెరవబడినవాడు యుండెను. ఈ రీతిగా ప్రభువునకు ఎన్నో రీతులుగా సేవ చేయవచ్చును. నెహెమ్యా మనకు చూపిన మాదిరి వినయము, యథార్థత కలిగిన వ్యక్తి ఇతరులకు సేవ చేయుటలో తాను చేసిన పనికి జీతము పుచ్చుకొనకుండా యథార్థముగా ఇతరులకు సేవ చేసి మాదిరిగా

ఉండును. నెహెమ్యా చాలా ధనవంతుడు. జీతము తీసికొనక తన కుటుంబమును తానే పోషించుకొనెను. మనలో చాలామంది ఆలాగున చేయలేరు. ప్రభువు కొరకు త్యాగము చేయుట యందు అనేక మార్గములున్నవి. నెహెమ్యా జీవితములోని విధేయత, యథార్థత, సేవ మనకు మాదిరియై యున్నది. ఒకవేళ దేవుడు నీ పనికి వెలకట్టినట్లైతే నీ యథార్థతకు, నిజాయితీకి ఎంత స్కోరు ఇవ్వగలడు? నీ యొక్క విధేయత ఏమిటి? నీ సేవ గురించి ఏమిటి? నీవు వాటిని మెరుగుపరచుట కొరకు ఏమైన చేయగలవా? సంఘకాపరి జీతమునకు యోగ్యుడు (1 తిమోతి 5:17,18).

**9. దైవభక్తిగల నాయకుడు తన యెడల దేవునికి గల ఉద్దేశ్యంపై దృష్టి నుంచుకొనువాడు**

నెహెమ్యా వ్యతిరేకతను మాత్రమే ఎదుర్కొని యుండలేదు. యూదుల నుండి మాత్రమేకాక సాధారణ ప్రజల నుండియు ఎదుర్కొనెను. దాని వలన గోడల నిర్మాణము ఆటంకపరచబడలేదు. పొరుగువారైన అన్యజనులు నెహెమ్యాను చంపదలచిరి (నెహెమ్యా 6:1-4). పన్నాగము పన్నిరి. ఎంతగానో భయపడెను. భయమును గూర్చి నాయకులు జాగ్రత్త వహించవలెను. తిమోతి భయపడి ఎఫెసు నుండి వెళ్లునట్లు తలంచెను. కాని పౌలు అక్కడే నిలిచియుండుమని చెప్పెను.

నెహెమ్యాను చంపదలచు యేర్పాటు విఫలమైనందున వారు నెహెమ్యాను నిందించుట ప్రారంభించిరి. అతడు స్వార్థపరుడనిరి (నెహెమ్యా 6:5-9). నెహెమ్యా దేవుని ప్రార్థించెను. వదంతులు

అపాయకరము. చిన్నవి పెద్దవగుచుండును. పలుకబడిన మాట త్రిప్పి చెప్పబడును. ప్రార్థనయే చేయవలసి యున్నది. సమస్తము దేవునికి అప్పజెప్పవలెను. అన్యులతో వియ్యమందిన యూదులును నెహెమ్యాను నిందించిరి, విమర్శించిరి.

మరొకరీతిగా నెహెమ్యాను తొలగించు ప్రయత్నము చేసిరి. దేవాలయము నందు యాజకులు మాత్రమే ప్రవేశించు భాగములో నుండునట్లు నెహెమ్యాను ఆకర్షించునట్లు ఒక యాజకునికి లంచమిచ్చిరి. అక్కడే భద్రత యున్నదని నెహెమ్యాకు చెప్పబడెను. (నెహెమ్యా 6:10–15). ఒకవేళ నెహెమ్యా అంగకరించి యుండిన యెడల దేవుడతనిని చంపియుండును (2 సమూయేలు 6:7). ప్రజలు కోరిన దదియే.

నెహెమ్యా తన దృష్టిని తన కర్తవ్యముపై మాత్రమే యుంచుకొనెను. దేని గూర్చియైనను భయపడలేదు. దేవుడిచ్చిన దానిపైనే శ్రద్ధవహించెను. ఇతరమైన దేదియు తనపై రాకుండ చూచుకొనెను.

నీవు సాతానుని పన్నాగమును గూర్చి యెరిగియున్నావా? వాటిని జయించుట కొరకు యేమి చేయవలెనో యెరిగియున్నావా? విమర్శ మరియు ఊసులాట ఎప్పుడు నిన్ను బాధపరచియున్నవి? అటువంటిని తప్పించుకొనుటకు నీవేమి చేయగలవు?

## 10. దైవభక్తిగల నాయకుడు బృందమును నడిపించువాడు

నెహెమ్యా మొదటిసారిగా యెరూషలేమునకు వెళ్లినపుడు అసలైన ఉద్దేశ్యము పట్టణ గోడల పునర్నిర్మాణముపై నుండెను. అది పూర్తియగుటతో ఆత్మీయ జీవిత పునర్నిర్మాణ ప్రారంభమవసరమైనది.

నెహెమ్యాతో ఎజ్రా మరియు యితరులు కలిసి యుండిరి. ప్రతిదానిని తానొక్కడే చేయదలచలేదు. నెహెమ్యా రాజకీయ నాయకుడు. ఎజ్రా ఆత్మీయ జీవిత నాయకుడు. ఎజ్రా ప్రజలకు బోధించగా గొప్ప ఉజ్జీవము కలిగెను. యూదుల మధ్య యిది బహుగా గుర్తింపబడెను (నెహెమ్యా 8:4–10:39).

నేడును కలిసి పనిచేయుట అత్యవసరము. ఎవరైనను ఒంటరిగా దేనిని చేయలేరు. ఇతరుల సహాయము అవసరము. వారి తలాంతులను వాడుకొనవలెను. మోషే కూడ సహాయకులను కోరియుండెను. పౌలునకును సహాయకులుండిరి. క్రొత్త నిబంధనలోని సంఘములు పెద్దలు ఒక బృందముగా నుండి అందరు భారమును కలిసిమోసిరి.

ఎజ్రా దేవుని వాక్యమును బోధించెను (నెహెమ్యా 8:5,6). దేవుడు అతని బోధనుపయోగించి ఉజ్జీవమును కలుగజేసెను. ఎజ్రా బోధించుచుండగా దినమంతయు ప్రజలు నిలువబడియుండిరి. అతడు ముగించుటతో ప్రజలు తమ గ్రహములకు వెళ్లకుండిరి. మరుసటిదిన బోధకొరకు వేచియుండిరి. దేవుడు వారిలో దేవుని వాక్యము కొరకు ఆకలిని కలుగజేసెను. ఏమి చేసినను వాక్యానుసారముగా చేయుట నేర్చుకొనవలెను. ప్రతి నాయకుని ఒకే బాధ్యత వాక్యమును బోధించుటయే (1 తిమోతి 3:2; 2 తిమోతి 2:24).

నీ పరిచర్య భారమును ఎవరితో పంచుకొనుచున్నావు? నీ పరిచర్యలో ఎవరి తలాంతుల నుపయోగించుచున్నావు? నీ స్వకీయ ఆత్మీయ యెదుగుదల నిమిత్తము దేవుని వాక్యమును నేర్చుకొనుటకు ఆకలి

ఉన్నదా? ఇతరులతో దానిని పంచుకొనగలవా? బైబిలును యెరుగుటకు ఎక్కువ ఆశను కలిగించుమని దేవుని ప్రార్థించుము.

## 11. దైవభక్తిగల నాయకుడు పాపములో నుండువారి యెడల పట్టుదల కలిగి యుండును

దురదృష్టవశాత్తుగా యూదుల వృత్తాంతము ఈ ఉజ్జీవముతో ముగించ బడలేదు. రాజునుండి నెహెమ్యా దూరముగా నుండిన సమయము బబులోనులో ముగించబడినపుడు బబులోను యందు తన బాధ్యతను నిర్వహించుటకు నెహెమ్యా తిరిగి వెళ్లిపోయెను. యెరూషలేములో గవర్నరుగా నుండునట్లు తన సహోదరుడు నియమించబడెను. ఉజ్జీవము కలిగిన కొంతకాలము వరకు అన్నియు చక్కగా జరిగెను. కాని క్రమేణముగా ప్రజలు దేవుని నుండి పాపము చేయుటకు మరలిపోయిరి. నెహెమ్యా దూరముగ నుండిన కాలము 11 సంవత్సములు. అన్నియు కడు హీనదశలో నుండెను. అన్యజనులు దేవాలయము లోనికి ప్రవేశించి సరుకులుండు గదులలోనికి వెళ్లి వ్యాపారము చేయునట్లు అనుమతిని బొందిరి. ప్రజలు దశమభాగమిచ్చుట ఆపివేసిరి. సబ్బాతును వెంబడించుట లేదు. వారి ఆరాధనను చెరువుకొనుచుండిరి (నెహెమ్యా 13:4-10). దేవుడు మలాకి అను ప్రవక్తను పంపెను. అతడు తన ప్రజలకు వాక్యమును బోధించెను. పాపమును గూర్చి బోధించినను వారు పశ్చాత్తాపపడలేదు. (మలాకి గ్రంథము చదువుము)

నెహెమ్యా బహుగా ప్రార్థించెను. చర్యను పూనుకొనెను. అన్నిటిని

సరి చేసికొని పాపము చేయుటను తొలగించెను (నెహెమ్యా 13:11-31). తన కష్టమంతయు వృథా ఆయెనని నిరుత్సాహపడియుండవచ్చును. మరల ప్రారంభించ వలెనని తలంచెను. అదే రీతిగా దేవుడు మనగూర్చియు తలంచుచున్నాడేమో!

దైవభక్తిగల నాయకుడు ఎన్నిసార్లు అవసరమైనను పట్టుదల గలిగి యుండ వలసినదే. ప్రజలు వారి పాపమునకు మరలివెళ్లినపుడు పట్టుదలతో వారిని తిరిగి దేవుని వైపు మరలించు ప్రయత్నములో నుండవలసినదే, ప్రేమించవలెను. ఓపిక కలిగియుండవలెను. కాని యిది ఒక దైవభక్తిగల నాయకునికి ఉండవలసిన లక్షణము.

నీవు యెంతో కష్టపడి బోధించి, శిక్షణ నిచ్చిన వ్యక్తి తిరిగి ప్రభువు నుండి వెళ్లిపోయిన యెడల నీ కర్తవ్యమేమై యుండును? నీ పరిచర్య యెన్నో సంవత్సరముల నుండి చేయుచున్నావు వృద్ధి కనబడక యున్నపుడు యధార్థతో కొనసాగుచుందువా? యేసు యేరీతిగా సహనము చూపెనో నీ విషయము నందే చూడుము. అదే మాదిరిని పాటించుచు యితరుల యెడల పట్టుదల కలిగి యుండుము.

నెహెమ్యా జీవితము నందు చూచిన రీతిగా నాయకునిగా నుండుటకు మనము :

1. ప్రార్థించవలెను.
2. ఓర్పు మరియు ప్రణాళిక కలిగియుండవలెను.
3. జాగ్రత్త వహించవలెను.

4. ఎప్పుడు చర్యను పూనుకొనవలెనో తెలిసికొనవలెను.

5. మరొకరికి అధికారము నిచ్చి పంపవలెను.

6. వ్యతిరేకత నెదుర్కొనవలెను.

7. ధైర్యము కలిగియుండవలెను.

8. యథార్థత మరియు వినయము కలిగియుండవలెను.

9. మనపట్ల దేవుని ఉద్దేశ్యమేమైయున్నదో దానిపైనే దృష్టినుంచుకొనవలెను.

10. బృందములో క్రీడాకారుని వలె వుండుము.

11. పాపము చేయువారి యెడల పట్టుదల కలిగి యుండ వలెను.

ఇవన్నియు నీలో నున్నవా? వీటిలో ఏవి నీలోనున్నవి? ఏవి కొరతగా నున్నవి? వృద్ధి చేసికొనుటకేమి చేయబోవుచున్నావు? వీటి విషయమై ప్రార్థించి ఆ లక్షణములు అన్నియు నీలో నుండునట్లు దేవుని ప్రార్థించుము.

# 7. యేసు జీవితము నుండి నాయకత్వ పాఠములు

## మార్కు సువార్త చదువుము



నీ సంఘకాపరిగా యేసు ఉండిన యెడల నీ సంఘస్థులకు ఏ రీతిగా పరిచర్య చేయును? నీవు చేయునట్లే పరిచర్య చేయునా? నీవు చేయునది చేయ కుండునా? ఈ మంచి ప్రశ్నలను గూర్చి ఆలోచించవలెను. వీటన్నిటిలో యేసే మనకు మంచి మాదిరియై యున్నాడు. ఆయనను పోలి యుండవలెను. నాయకత్వము యిందులో యిమిడి యున్నది. యేసును మించిన మాదిరి మరొకరు లేరు. మానవునిగా యేసును మన జీవితమునందు పాటించిన యెడల నాయకుడు యేసును పోలి యుందుము. యేసు జీవితమునుండి నాయకత్వ పాఠములెన్నో నేర్చుకొనగలము. వాటిలో కొన్నింటిని మార్కు సువార్త నుండి చూడగలము.

## 1. దైవభక్తిగల నాయకుడు దేవుని పిలుపు నంగీకరించును

బాప్తిస్మమిచ్చు యోహాను బోధించు స్థలమునకు యేసు వెళ్లి అతనిచే బాప్తిస్మము పొందెను. తన పరిచర్యను ప్రారంభించునట్లు దేవుడు యేసును

పిలిచెను. యేసు ఆ పిలుపు నంగీకరించెను. ఇష్టపూర్వకముగా యేసు ఆ పిలుపు నంగీకరించినందున దేవుడు సంతోషించెను (మార్కు 1:11). దేవుని కొరకు మనము చేయు సేవకూడ ఆయన పిలుపునకు లోబడుటతో ప్రారంభమగుచున్నది. ఆయన సేవను చేయునట్లు దేవుడు మన హృదయమునందు ఒక కోరిక పుట్టించును. ఇతరులును ఆ రీతిగా చేయునట్లు వారికి సహాయపడవలెను. నాయకులుగా నుండుట వలన మనమేమియు తీర్మానము చేయక దేవుడే మనలను నడిపించు రీతిలో ఆయన నడిపింపును వెంబడించవలెను. ఆయనను వెంబడించుటలో అదియే మన ఉద్దేశ్యము. కష్టముల నెదుర్కొనుచున్నను నమ్మకముగా నుండుటయే మన కర్తవ్యము. పరిచర్యచేయునట్లు మనలను పిలిచినందుననే మనము ఆయన పరిచర్యను చేయుచున్నాము. ఆయనకొరకే చేయుచున్నాము. మనకొరకు ఏ మాత్రము కానేరదు.

తన పరిచర్యలో పాల్గొనునట్లు దేవుడు నీలో కోరికను పుట్టించిన సమయము జ్ఞాపకమున్నదా? అది ఏ రీతిగా ఉన్నది? నిన్ను పిలిచినందుకు వందనములు చెప్పుము. యథార్థతను చూపుచున్నావా? సమర్పించుకొనియున్నావా? ఆ పిలుపును వెంబడించుటకు సహాయపడుమని దేవుని కోరుము. పిలుపు నందు కొనియు సేవచేయని వారి కొరకు ప్రార్థించుము.

## 2. దైవభక్తిగల నాయకుడు పరిచర్య చేయుటకు తన్నుతాను సిద్ధపరచుకొనును

యేసు వెంటనే తన్నుతాను సిద్ధపరచుకొనుట కొరకై దేవుని సేవ చేయుటకు ఉపవాసముతో ప్రార్థించుటకు 40 దినములు గడుపునట్లు అరణ్యమునకు వెళ్లెను (మార్కు 1:12-13). దేవుడు కోరిన రీతిగా

చేయునట్లు దేవుని మాటలను వినునట్లు వేచియుండెను. దేవుని సేవించుటకు ఆయనకు దేవుని శక్తి మరియు భద్రత ఎంతో అవసరమై యుండెను. తన గుర్తింపును ప్రక్కన బెట్టి దానిని వాడుకొనక తన దైవత్వము దాచుకొని మానవునిగానే సేవచేయుచుండెను (ఫిలిప్పి 2:5-7). అయినను ఆయన దేవుడే. కాని మానవుడెదుర్కొను వాటిని అనుభవించెను. ఆ రీతిగా నుండి పవిత్ర జీవితము జీవించగలమను సత్యమును చూపెను (1 పేతురు 2:22; 1 యోహాను 3:5). మనమనుభవించునదేమో ఆయన యెరిగియున్నాడు. ఎందుకనగా ఆయన కూడా అనుభవించెను (హెబ్రి 2:18; 9:35; 1 పేతురు 4:1-10).

ఆయన చేసిన దానిలో దేవుని సహాయము అవసరమై యుండెనను గ్రహింపు ఉన్నది. అందువలననే ఆయన రాత్రులందు మేల్కొని ప్రార్థించెను (లూకా 6:12). మనము చేయవలసిన రీతిగా పరిచర్య చేయుట కొరకు తన్ను తాను సిద్ధపరచుకొను అవసరత యుండెను. తన పరిచర్య ప్రారంభమునందు అట్లు చేసెను మరియు తదుపరి అనేకసార్లు అట్లే చేసెను మరి ముఖ్యముగా కష్టము నెదుర్కొనునపుడును అట్లు చేసెను. పండ్రెండు మందిని యేర్పరచుకొనక ముందు రాత్రి ప్రార్థనలో గడిపెను (లూక 6:12-13), మరియు బంధించబడకముందు మరియు సిలువ వేయబడక ముందు గెత్సెమనె తోటలోనికి వెళ్లి ప్రార్థించెను (మత్తయి 26:36-56). బాప్తిస్మ యోహాను మరణమును వినినపుడు ఒంటరి స్థలమునకు అతని గూర్చి దేవుడేమి తలంచెనో యోచించెను (మత్తయి 14:13).

మన పరిచర్య ప్రారంభించుట యందు మానసికముగాను, ఆత్మీయముగాను మనలను సిద్ధపరచుకొనుట అవసరము. అట్లు చేయుటలో కొనసాగుచుండవలెను. కొందరు నాయకులు ప్రార్థించకయే నేర్చుకొనకయే సేవను ప్రారంభించుటకు త్వరపడుచుందురు. ఈ రీతిగా సిద్ధపడుటలో నేను వ్రాసిన పుస్తకము ఈ పుస్తకముతో పాటు యితర పుస్తకములను కూడ చదువుచుండుట శ్రేష్ఠము. వయస్సుతో పనిలేకుండ సిద్ధపడుము. నేను 60 సంవత్సరముల వయస్సులో సెమినెరి విద్య గడించితిని. నీ వయస్సు ఏదైనను, నీవు సిద్ధపడుటలో నిమగ్నమై యుండవలెను. ఎక్కువగా చదువుకొని నేర్చుకొనుచు మిగిలిన సంవత్సరములందు శ్రేష్టముగా పరిచర్య చేయునట్లు సిద్ధపడితిని. ఇతరుల నుండియు, ఇతర పుస్తకముల నుండియు, లేక ఆన్‌లైన్ నుండియు నేర్చుకొనవచ్చును. మంచి వెబ్‌సైట్ మన దగ్గర నున్నది. పాస్టర్లకును, సంఘనాయకులకును బహుశ్రేష్ఠమగు పరికరములుగా యివి మనకు అందుబాటులో నున్నవి: (http://india.christiantrainingonline.org) నీకు అటువంటి అవకాశము లేనప్పటికిని హృదయమును సిద్ధరచుకొని ప్రార్థించి బైబిలును చదువుకొనుము.

దేవుడు నిన్ను మొదటిసారి పిలిచినపుడు సేవచేయునట్లు సిద్ధపడుటకు నీవేమి చేసితివి? సిద్ధపడిన తర్వాత నేర్చుకొనుటకును, యెదుగుట కొరకును అప్పటి నుండి నీవు చేసియున్నదేమి? ప్రార్థించి ప్రారంభించి యుంటివా? యేసు యొక్క పరిచర్యకాలము $3^1/_2$ సంవత్సరములైయుండినను ప్రార్థించుటకు 40 దినములు గడిపెను. కాబట్టి తప్పకుండ మనమెంత కాలము గడపవలెనో! క్రొత్తదిగాని,

కష్టమైనదికాని ఏదో నీవు ప్రారంభించినపుడు దానిని ప్రార్థించుటతో ప్రారంభించి సిద్ధపడుదువా మరియు దానిద్వారా సహాయము పొందునట్లు ఏమి నేర్చుకొనగలవు?

## 3. దైవభక్తిగల నాయకుడు బలమైన ఆత్మీయ జీవితమును కలిగియుండవలెను

మన పరిచర్యయందు ఎదుర్కొను ప్రత్యేకమగు సవాలుల కొరకు గల సిద్ధపాటు సమయముల అవసరములందు మనకు వ్యక్తిగతముగా ప్రార్థన మరియు వాక్యపఠన జీవితము అనుదినము అనుభవించుట బహుశ్రేష్ఠము. యేసు పెందలకడనే లేచి ప్రార్థించుటలో సమయము గడిపెను (మార్కు 1:35). అందరితో గడుపవలసిన సమయము ఉండినను యేసు తన తండ్రితో ముందుగా సమయము గడిపెను. ఎప్పుడో యొకసారికాక క్రమముగా గడిపెను (మత్తయి 13:1; 4:13,42; 15:29; మార్కు 1:35; 6:46, 9:2; లూకా 6:12; 9:10, 28: లూకా 4:42). దేవునితో నొంటరి సమయము గడుపుట యేసునకు అవసరమైయున్నపుడు మనకును అత్యవసరమే.

భక్తసింగ్‌గారి జీవితమునుండి నేర్చుకొనిన యొక పాఠము ప్రార్థన యొక్క ప్రాముఖ్యత. ఆయన ప్రార్థించుటలో కొన్ని గంటలు గడిపెను. కొన్నిసార్లు ప్రార్థనలో రాత్రులు గడిపెను. తను యేమి చేయవలెనో దేనిగూర్చి ప్రసంగించవలెనో దేవుని నుండి తెలిసికొన గోరెను. ప్రజలలో యిది సాధారణమగు లక్షణమై యున్నది. దేవుని చేత గొప్పగా వాడబడును.

దేవునితో గడిపిన సమయము దేవుడేమి చేయవలెనోయని అడుగుట

కానేకాదు. కాని ఆయన మాట్లాడుచుండగా వినుచుండుటయే. మౌనముగా నున్నపుడు ఆయన స్వరమును వినగలము. ఆయన వాక్యమును చదువునపుడును ధ్యానించునపుడును ఆయన స్వరమును వినగలము. అట్టిది ఎప్పుడైనను ఎక్కడైనను జరుగగలదు. కాని మనము మౌనముగా నుండి వినుచున్నపుడే ఆలకించగలము.

మన మాయనతో చెప్పున దానికంటెను, ఆయన మనకేమి చెప్పుచున్నాడో అదియే ప్రాముఖ్యము. మనమేమి చెప్పనై యున్నామో ఆయన యెరిగియున్నాడు. మనము మౌనముగా నున్నపుడును, పరిశుద్ధాత్ముడు మనతో మాట్లాడుచుండగా మృదుహృదయము గలిగినపుడు వినుచుందుము. దేవుని వాక్యమును వినుచు, ధ్యానించునపుడును ఆయనను వినగలము. అట్టిది ఎక్కడైనను, ఎప్పుడైనను జరుగగలదు. కాని మనము మౌనముగా నున్నపుడే ఆయనను వినగలము. మొబైలును ఆపివేయుము. దానిని నీయొద్ద నుంచుకొనకుము. టెలిఫోను సందేశము కన్నను దేవుడు చెప్పుదానిని వినుటయే బహుగా ప్రాముఖ్యము.

దేవుడు మాట్లాడుచుండగా వినుటలో ఎంత సమయమును గడుపుదువు? నీవు ప్రార్థించునపుడు వినుచుండుట కన్నను మాట్లాడుట ఎక్కువగా నున్నదా? నీ ప్రార్థనలో ఎక్కువగా ఆయన యేమి చేయవలెనో చెప్పుటలో గడుపుచున్నావా లేక ఆయన నుండి నీ కర్తవ్యమేమై యున్నదో చెప్పుచుండగా వినుచున్నావా? ప్రార్థించునపుడు ఆయన స్వరమును వినుచున్నావా? ఎటువంటి సమయము అంతరాయము లేకుండ ప్రార్థనలో గడుపగలవు?

## 4. దైవభక్తిగల నాయకుడు శిష్యులగునట్లు యితరులను ప్రేరేపించును

యేసు ప్రజలను రక్షణ కొరకు పిలిచెను. వారి పాపమును గూర్చి పశ్చాత్తాపము నొందునట్లు పిలిచెను. ఉచితముగా ఆయన యిచ్చు బహుమతిని పుచ్చుకొనునట్లు అంగీకరించునట్లు పిలిచెను. ఎవరైతే అంగీకరించి వెంబడించిరో వారిని శిష్యత్వములోనికి నడిపించెను (మార్కు 1:17; 2:14). తననే వారి జీవితములో ముందుగా పెట్టుకొనునట్లును, తనకొరకే జీవించునట్లును, వారి విషయమై మరచిపోవునట్లును వారిని కోరెను. కొందరు వారి ఉద్యోగములు చేయుచునే యుండిరి. మరికొందరు ఆయన సేవ ఎక్కువగా చేయునట్లు వారి ఉద్యోగములను విడిచిపెట్టిరి. వీరిలో కొందరిని ఎవరైతే ఎక్కువగా నేర్చుకొని ఆత్మీయముగా యెదుగవలెనని ఆశించిరో వారిని ఎన్నుకొని తన సన్నిహిత వలయము నందు చేర్చుకొనెను. వారే పండ్రెండు మంది శిష్యులు. వారు రక్షణ పొందుటలో ఊరకుండక విశ్వాసమునందు యెదుగుచుండునట్లు చేసికొని యేసుకొరకే జీవించునట్లు కోరెను (2 పేతురు 3:18).

యేసును వెంబడించుచు ఆయన కొరకే జీవించుమని నీవు ఎవరిని పిలుచుచున్నావు? రక్షణ కొరకు యేసు నొద్దకు ఎవరైనను వచ్చినపుడు వారికి సహాయపడుచు, వారితో కలిసియుండి యేసును గూర్చి ఎక్కువగా నేర్చుకొనునట్లు సహాయపడుదువా? వారిని ప్రోత్సహించుచు, వారితో ప్రార్థించుచు వారికి శిక్షణను ప్రార్థించుట యందును, బైబిలు పఠనయందును ప్రోత్సాహము యిచ్చుచున్నావా?

## 5. దైవభక్తిగల నాయకుడు యితరులకు శిక్షణ నిచ్చును

మొదటి $1^1/_2$ సంవత్సరము చేసిన పరిచర్యయందు యేసు ప్రజలకు తానెవరోయని, బయలుపరచి వారికి దేవుని రాజ్యము ననుగ్రహించెను. ఆయన దేవుని నుండి వచ్చినవాడని నిరూపించుటకు మహత్కార్యములను చేసెను. వాక్యము వ్యాపించియుండెను. ఆయన యెవరైయున్నారని అందరును తెలిసికొనిరి. కొందరు నమ్మి ఆయనను వెంబడించిరి. మరికొందరు ఎక్కువ మంది మతాసక్తిపరులైన నాయకులు ఆయనను నిరాకరించిరి. చివరి $1^1/_2$ సంవత్సరము నందు తన శిష్యులతో ఎక్కువ కాలము గడిపెను. జనసమూహముతో తక్కువ కాలము గడిపెను. బోధించుట, ఉపమానములు చెప్పుట, శిక్షణ నిచ్చుటలో గడిపి శిష్యత్వములో వారిని స్థిరపరచెను (మార్కు 3:14,15). వారి యితరులకు శిక్షణనిచ్చునట్లు ఆయన వారికి శిక్షణ నిచ్చెను (2 తిమోతి 2:2). తదుపరి యేసు పునరుత్థానుడగుటతో వారు ఆయన పరిచర్యను కొనసాగించిరి.

యేసు వారికి దేవుని వాక్యమును బోధించి వారి జీవితమునందు ఏలాగు పనిచేయుచున్నదో బోధించెను. వారి యిష్టమునుకాక దేవుని చిత్తమునే యెరిగి జరిగించునట్లు దాని ప్రాముఖ్యతను చూపెను. వాక్యము, తన మాదిరిని చూపి, వారే చేయగలిగి వారి అనుభవము ద్వారా నేర్చుకొనునట్లు వారిని పంపెను (మార్కు 6:7). సౌవార్తీకరణము ప్రాముఖ్యము దానితోపాటు యేసుకు క్రొత్తగా నమ్ముకొనిన వారికి శిక్షణ నిచ్చుట కూడ ప్రాముఖ్యము. అప్పుడే వారు ఆత్మీయజీవితము నందు యెదుగుదురు. యేసుకొరకు జీవించెదరు. ఆ రీతిగా ఎక్కువమందిని యేసునొద్దకు తీసికొని రాగలరు.

ఆయనకు సమీపముగా నుండునట్లు యెదుగుదల కోరువారికి యేసు ఎవరికైనను బోధించును. పురుషులు, స్త్రీలు, యువజనులు మరియు పిల్లలు. తానెవరిని ప్రేమించెనో వారిపై తన జీవితమును పోసెను. ప్రార్థించుట ఎట్లో నేర్పించెను. శోధన జయించుట నేర్పెను. ఒకరి యెడల శ్రద్ధ వహించుట నేర్పెను. ఆయనను నమ్ముకొనుట నేర్పెను. ఉపవాసము, హింస, విలువలు, యిహలోక విషయములపై చింతలేకుండుట అనువాటిని గూర్చి బోధించెను. ఆయన సందేశము నే రీతిగా వ్యాపింపజేయవలెనో నేర్పెను. వారును అట్లే చేయునట్లు వారిని పంపెను. ఆయన జీవితమంతయు ఆత్మలను సంపాదించుట మరియు శిష్యుల తర్ఫీతుపై గడిపెను.

నీ పరిచర్య కొనసాగునట్లు నీవు ఎవరిని తర్ఫీతు చేయుచున్నావు? పరిచర్య నిమిత్తము ఎవరిని సిద్ధపరచుచున్నావు? విశ్వాసములో యెదుగునట్లు నీవు సిద్ధపరచువారినేరీతిగా వ్యాపింపజేయవలెనో నేర్పెను. వారును అట్లు చేయునట్లు వారిని పంపెను. ఆయన జీవితము ఆత్మలను సంపాదించుట మరియు శిష్యుల తర్ఫీతుపై గడిపెను.

నీ పరిచర్య కొనసాగునట్లు నీవు ఎవరిని తర్ఫీతు చేయుచున్నావు? పరిచర్య నిమిత్తము ఎవరిని సిద్ధపరచుచున్నావు? విశ్వాసములో యెదుగునట్లు నీవు సిద్ధపరచువారి నే రీతిగా నడిపించుచున్నావు? నీ ప్రజలయెడల నీకు ఓర్పు మరియు ప్రేమ యున్నదా? అది నిజమని వారు గ్రహించగలరా? యేసువలెనే నీవు నాయకుడవై యుండుటకిది అవసరము.

## 6. దైవభక్తిగల నాయకుడు విశ్రమించుటకు సమయమును కేటాయించుకొనును

యేసు చేసినంత పనినెవరును చేయలేదు. తన సందేశమును వ్యాపింప జేయుటకు మూడు సంవత్సరములే యుండెను. అదే సమయమునందు యితరులకు శిక్షణనిచ్చెను. అయినను యేసు విశ్రమించుటకును తనవారి నుండి కొంత దూరముగా నుండునట్లు యేర్పాటు చేసికొనెను (మార్కు 6:31). పనిచేసినపుడు ఎంతో కష్టపడెను. కాని సమయమంతయు పనిచేయలేదు. విశ్రాంతి తీసికొనుట అవసరమని యెంచెను. అందుకొరకే దేవుడు వారమునందు చివరి దినమును విశ్రాంతి దినమని యేర్పరచెను (నిర్గమకాండము 20:8-11). 5000 మందికి ఆహారము పెట్టిన తర్వాత యేసువెళ్లి విశ్రాంతి తీసికొనెను (మత్తయి 14:23).

విశ్రాంతిని గూర్చి యేసు ప్రాముఖ్యమైనది తనను వెంబడించు వారికి బోధించెను. యేసు పరలోకమునకు తిరిగి వెళ్లుటతో అపొస్తలుడగు యోహాను ఎఫెసు పట్టణములో నివసించెను. అక్కడ నుండి బోధించుచు అనేక సంఘములను నడిపించెను. పిచ్చుకలను పెంచుచుండెను. చేయుటకెంతో పరిచర్యయుండగా పిచ్చుకల నెందుకు పెంచుచున్నావని అతని ప్రశ్నించిరి. ప్రశ్నించిన వాని విల్లును తీసుకొని దాని త్రాడు గట్టిగా లేకుండ వదులుగా ఎందుకు ఉన్నదని అడిగెను. అతని జవాబు – విల్లు వాడనపుడు వదులుగా యుండవలెను. అట్లు వదులుగా నుంచని యెడల దాని వాడునపుడు దాని శక్తి రాదు. యోహాను అందుకొరకే

తాను విశ్రాంతి తీసికొను చున్నానని చెప్పెను.

పనిచేయవలసి వచ్చినపుడు శక్తి ఎక్కువగా వచ్చునని చెప్పెను. దేవుడు మనలను సమయమంతయు పనిచేయుచుండవలెనని చెప్పలేదు. విశ్రాంతిని కూడ తీసికొనవలెనని చెప్పెను (ప్రసంగి 3:1-8). మనము మంచి గృహనిర్వాహకులమై యుండవలెను. మన శరీరములను, ఆరోగ్యమును భద్రపరచుకొనవలెను. అట్టిది విశ్రాంతి తీసికొనుట వలననే సాధ్యమగుచున్నది. దీనితోపాటు కుటుంబీకులతో కొంత సమయము హాయిగా గడుపవలెను. క్రైస్తవులమైన మనము అనేకసార్లు వినోదము, విశ్రాంతిల కొరకు సమయమును తీసికొనము. మన కుటుంబము కొరకు సమయము కేటాయించు కొనుటలో నేరస్థులముగా భావించుకొందుము. కాని అట్లు చేయవలసినదే. భవిష్యత్తులో హాయిని, సంతోషము ననుభవించుటకివి అవసరమై యున్నది. నేను ఎక్కువగా పరగెత్తుచుండు వాడను. ఎన్నో మైళ్లు పందెములో పాల్గొనినవాడను. చిన్న పందెములో బహు త్వరగా పరుగెత్తెడి వాడను. కాని దీర్ఘదూర పందెములో అట్లు పరుగెత్తిన యెడల దాని గమ్యము చేరలేను. నా శక్తి కొలది సరిచూచుకొని ముగింపు వరకు పరుగెత్తునట్లు చూచుకొని యుంటిని. నిదానము పాటించినపుడే నా సంపూర్ణ జీవితము వరకు నిలబడగలను. పరిచర్యయందును అంతే. వారములో ప్రతిదినము బహుగా కష్టపడి పనిచేసిన యెడల కొంతవరకు ఎంతో చేయగలము కాని అట్లు చేయుటలో కొనసాగలేము. ఆరోగ్యము మరియు సంబంధములు శ్రమపడును. శక్తిని పోగొట్టుకొందుము. పరుగెత్తు క్రీడాకారుడు ఎంత వేగముగా పరుగెత్తవలెనో గమ్యము చేరుట కొరకు ముందుగా శిక్షణ బొందియున్నాడు. ఒక మంచి

నాయకునికి కూడ యిది వర్తించు చున్నది.

కష్టపడి పనిచేయుచు విశ్రాంతిని కూడ తీసికొను వ్యక్తి నొకరిని నీ యొద్ద నుండి వారికి దృష్టాంతముగా చూపగలవా? వారములో ఒకదినము విశ్రాంతి తీసుకొనుచున్నావా? కుటుంబీకులతో ఆ దినము గడుపుచున్నవా? విశ్రాంతి సమయములో నీవు చేయునదేమి? యోహాను పావురములను పెంచుటలో ఒక దినము గడిపెను. ఒక దినము విశ్రాంతి తీసికొనుచు దేవుని ఆజ్ఞను పాటించుచున్నావా? ఆయనకు విధేయుడవై యున్నట్లు ఆయన యెడల నీవేమి చేయగలవు? సంఘకాపరులు ఆదివారము విశ్రాంతి తీసికొనలేరు. కాబట్టి వేరొక దినము నేర్పరచుకొనుచున్నావా? దినము ప్రాముఖ్యము కాదు. కాని వారానికి ఒక దినము విశ్రాంతి తీసుకొనుటలో నీ విధేయతయే ప్రాముఖ్యము.

## 7. దైవభక్తిగల నాయకుడు ఒక సేవకుడై యుండవలెను

ఈ భాగము చివరిదైయున్నను యేసు నుండి నేర్చుకొనవలసిన వాటిలో ప్రాముఖ్యమైనది. మనము సేవకులముగా నుండుట అత్యవసరము (మార్కు 9:35; 10:42-45; యోహాను 13:1-17; మత్తయి 20:25,26). క్రియను మించినదే సేవకుడై యుండుట! అది దీన హృదయముతో ప్రారంభమగుచున్నది. యేసు తన్ను తాను తగ్గించుకొని మానవుడాయెను. మరణించుచు మనకొరకు పరిచర్య చేసెను (ఫిలిప్పి 2:8).

యేసు వలెనుండుటలో విఫలమగుటకు గల గొప్ప కారణము మనలోని అతిశయము మరియు స్వార్థము. మన గురించియే మొదట

ఆలోచించుకొందుము. నాకేమి వచ్చును? దేనికి నేను అర్హుడను. శ్రేష్ఠమగు నాయకులు ముందుగా సేవకులై యున్నవారే. దేశపు సైన్యములో చేరువారు ముందుగా ఆజ్ఞలను పొందువారు. వారు అధికారులైన తర్వాతనే ఆజ్ఞల నిచ్చుచుందురు. (మత్తయి 16:24). "నేను" అనుదానికి బదులుగా "దేవుడు" అని చెప్పుకొనవలెను. సేవ చేయించుకొనకముందు సేవ చేయవలెను (మత్తయి 6:24; లూకా 16:13).

ఎవరినైనను తలాంతులు గలవాడని తలచి నాయకునిగా నియమించకూడదు. దానికి బదులుగా ఎవరు ముందుగా పరిచర్య చేయుట కిష్టపడుచున్నారో వారిని వెదకుము. వారే మంచినాయకులు కాగలరు. సంఘనాయకులు దేవుడేర్పరచిన యోగ్యతలు ఎక్కువగా పరిచర్యచేయుటయే. నడిపించుటకాదు (1 తిమోతి 3:1-7; తీతు 1:5-9; 1 పేతురు 5:1-4). "నాయకుడు" అను మాట బైబిలు నందు 6 సార్లు ఉన్నది. కాని "సేవకుడు" అను మాట 900 సార్లు ఉన్నది! తన శిష్యులకు యేసు నాయకత్వమును గూర్చి బోధించలేదు. వెంబడించుట ఎట్లో దాని గూర్చి బోధించెను. నాయకులుగా నుండునట్లు యేసు తన శిష్యులైన పేతురు, అంద్రెయ, యాకోబు మరియు యోహానులను పిలువలేదు. తనను వెంబడించువారై యుండునట్లే పిలిచెను. బైబిలులోని పేరు గాంచిన నాయకులు వెంబడించుట కిష్టము గలవారై సేవచేసినవారే: నెహెమ్యా, మోషే, పౌలు, దావీదు, ఎస్తేరు, పేతురు, గిద్యోను, యెషయా, యోసేపు మరియు యితరులు.

దైవభక్తి గల నాయకుడు స్వకీయ హక్కులను తొలగించుకొని యితరులను సేవించుటలో గొప్పతనమును కనుగొనవలెను. యేసు అట్లే

చేసెను. మనమందరమును సేవకులమై యుండవలెను. ఒక మాట! ఎవరైనను మనము సేవకులమని చిన్నచూపు చూచినయెడల యేమనుకొందుము? అహంకారము తెచ్చుకొందుమా? లేక వారికే పరిచర్య చేయుటకు యిష్టపడుదుమా?

యేసుకొరకు జీవించు నాయకులు ఇతరుల జీవితములను నిర్మించువారు. బహు తరచుగా యితరులు మన పరిచర్యను లేక సంఘమును నిర్మించునట్లు కోరుచుందుము. దానికి బదులుగా వీలగునంతవరకు మనమే వారికి సహాయము చేయుటకు అందుబాటులో నుండవలెను. ఒక క్రీడల బృందపు శిక్షణనిచ్చు వ్యక్తిగా మన పాత్రయున్నది. క్రీడాకారులు తమ శక్తి కొలది ఆటలో పాల్గొను రీతిగా శిక్షణ నీయవలెను. శిక్షణ నిచ్చువాని ఘనత కొరకువారు ఆటలో పాల్గొనరు. కుటుంబములలో నుండు పురుషులును అంతే. దేవుడు మనలను మన భార్యాబిడ్డలకు పరిచర్య చేయునట్లు నియమించి యున్నాడు. వారే మనకు పరిచర్య చేయువలనను భావము కాదు. యేసువలెనే యితరులను నడిపించవలెననగా మనము యేసును పోలియుండవలెను.

నీ కుటుంబము నిన్ను ఒక సేవకుడని చెప్పగలుగుటకు నిన్ను నీవు మరచి నీ కుటుంబ విషయమును ముందు చూడగలవా? లేక నీవే ప్రధానుడవనుచు వారే నీకు పరిచర్య చేయగోరుచుందువా? నీవు సేవచేయు నాయకుడవని దేవుడు నిన్ను గూర్చి చెప్పగలడా? ఇతరులకు పరిచర్య చేయుటలో నీవు పొందు కష్టమేమి? మెరుగైన సేవకునిగా నుండుట కొరకు నీవేమి చేయగలవు?

ఇదంతయు జరిగిన పిమ్మట యేసు పట్టణములోనికి ఒక గాడిదపై ఎక్కి ప్రయాణము చేసెను. తానే రాజునని, మెస్సయాయని ప్రకటించుకొనెను. అతడు నిరాకరించబడెను. సిలువ వేయబడెను. తదుపరి తిరిగి జీవములోనికి వచ్చి పరలోకమునకు ఆరోహణుడాయెను. ఆయన పరిచర్య మరియు శిక్షణ జరిగించబడెను. ఆయన పరిచర్యను కొనసాగించునట్లు ఆయనను వెంబడించు వారికి సమయము యిదియే. వారట్లు చేసి యుండిరి. ఇతరులకు శిక్షణ నిచ్చిరి. వారు మరొక తరమునకు శిక్షణ నిచ్చిరి. అక్కడ నుండి మన కొరకు వచ్చియున్నది. అట్లు చేయుటకు మన సమయమిదియే.

మనము యేసు జీవితము నుండి చూచిన దేమనగా మంచి నాయకుడై యుండుటకు మనము:

1. దేవుని పిలుపునకు జవాబివ్వవలెను.
2. పరిచర్య చేయునట్లు మనలను మనము సిద్ధపరచుకొనవలెను.
3. బలమైన ఆత్మీయ జీవితమును కలిగియుండవలెను.
4. ఇతరులును శిష్యులగునట్లు వారిని ప్రేరేపించవలెను.
5. ఇతరులకు శిక్షణ నీయవలెను.
6. విశ్రమించుటకు సమయమును కేటాయించుకొనవలెను.
7. సేవకునిగా నుండవలెను.

ఇవన్నియు నీలో నున్నవా? నీలో ఉన్నవేమేమి? ఏవి లేవు? అభివృద్ధి చెందునట్లు ఏమి చేయవలెను? వీటిని గూర్చి ప్రార్థించి సహాయము చేయుమని దేవుని ప్రార్థించుము.

# 8. పేతురు జీవితము నుండి నాయకత్వ పాఠములు



### మొదటి మరియు రెండవ పేతురు పత్రికలను చదువుము

సీమోను పేతురు శిష్యుల నాయకుడై యుండెను (మత్తయి 9:35-10:4; మార్కు 6:6-9; లూకా 9:1-2). అసలైన పేరు సీమోను. యేసు ఆ పేరును మార్చి పేతురు అని పిలిచెను. ఆ పేరునకు వివరణము అతని భౌతికశక్తి మరియు అతని స్థిరత్వములే (మత్తయి 16:18; మార్కు 3:16; లూకా 6:14; యోహాను 1:42). అన్ని విషయములందు మించి యున్నవాడు, స్నేహభావము గలవాడు, చమత్కారి. కాని అతనిలో స్వకీయమగు క్రమశిక్షణ లేకుండెను. అతడు యేసును తన సహోదరుడును, బాప్తిస్మయోహాను శిష్యుడైన ఆంద్రెయ ద్వారా కలిసికొనెను. యేసు పేతురును అతని చేపలు పట్టు వలలను వదలిపెట్టి పూర్తిగా తనను వెంబడించుమని ఆహ్వానించెను (మత్తయి 4:13-22; మార్కు 116-20; లూకా 4:31; 5:1-11). పేతురు సాధారణమగు నాయకుడు. దుడుకుతనము వలననే నాయకుడై యుండెను. దైవభక్తిగల నాయకునిగా

నుండుట నేర్చుకొనుటకు కొంతకాలము తీసికొనెను. అతని తప్పిదములను సవరించుచు యేసు అతనితో కలిసి పనిచేయుచు ఎంతో సహాయము చేసి ఆదిమ సంఘమునందలి గొప్ప నాయకులలో ఒకడై యుండునట్లు చేసెను. నేడు మనలను కూడ యేసు అట్లు చేయగలడు.

## 1. దైవభక్తిగల నాయకునికి దైవభక్తిగల భార్య అవసరము

పౌలు మరియు యేసు అను దైవభక్తి గల నాయకులకు భార్యలు లేకుండిరి. భార్యలుండుట శ్రేష్ఠము. పేతురు భార్య అతనితో ప్రయాణము చేసెను (1 కొరింథీ 9:5). అతనితోనే హతసాక్షి యాయెను. యేసు పరిచర్య చేయుచున్నపుడు ఆమె తల్లి అస్వస్థతలో నుండగా శ్రద్ధ వహించినది. యేసు యొక్క మహత్కార్యము లందు మొదటిది ఒక స్త్రీని స్వస్థపరచియుండుట (మత్తయి 8:14,15; మార్కు 1:29-31; లూకా 4:38-39). ఒక భర్త తన భార్యను గ్రహించుచు సహాయ పడుచుండవలెనని పేతురు వ్రాసెను (1 పేతురు 3:7). దైవభక్తిగల భార్యయుండుట దేవుని నుండి వచ్చిన దీవెనయే (సామెతలు 31). క్రీస్తు, సంఘమును ప్రేమించిన రీతిగా మనము మన భార్యలను ప్రేమించబద్ధులము (ఎఫెసి 5వ అధ్యాయము).

మన పరిచర్య మొదటిగా భార్యలకే. వారే మన ప్రథమ గొఱ్ఱెలు. వారి అవసరతలు తీర్చుట సంఘస్థుల అవసరతలను తీర్చుట కన్నను ప్రాముఖ్యము.

నీ భార్య నీ పరిచర్యకన్నను ఆమెయే ప్రాముఖ్యమని చెప్పుచున్నదా? నీవు ఆమె యెడల చూపు ప్రేమ మరియు త్యాగములను బట్టి యేసు

యొక్క ప్రేమ మరియు త్యాగము ఆమె యెడల ఉన్నదనియు చెప్పుచున్నదా? ఆమె కొరకు నీవు ప్రార్థించుచున్నావా? అది ప్రాముఖ్యమైనది.

**2. దైవభక్తిగల నాయకుడు తన విశ్వాసమును దేవుడు సాగదీయునట్లు చేయును.**

యేసు భూలోకములో నున్నంతవరకు పేతురు విశ్వాసమును పరీక్షించెను. దానికి గల కారణము విశ్వాసమును బలపరచుటకే. అతడు తనపై ఆధారపడునట్లు అతనిని గొప్ప స్థితియందుంచెను. చేపలు పట్టుటకొరకు రాత్రి గడిపియున్నను, ఫలితము దొరకనందున యేసు అతని మరల ప్రయత్నము చేయునట్లు చెప్పెను. విధేయుడైనందున వలన అధిక సంఖ్యలో చేపలు దొరికినవి (లూకా 5:4-7). పేతురు యొక్క యౌవన విశ్వాసమును బలపరచుటకే అట్లు చేసెను. పేతురు వృద్ధుడగుటతో అతడు మరి ఎక్కువగా పరీక్షింపబడెను. కాబట్టి పేతురు యేసును ఎక్కువగా నమ్ముటకు నేర్చుకొనుచు ఆయన వలలు ఖాళీగా వుండువరకు ఆయనకు విధేయుడాయెను.

ఒకసారి యేసు పేతురును ఒక చేపను పట్టుకొనుమని చెప్పెను. దాని నోటిలోనొక నాణ్యెము కనుగొని దానిని పన్ను కొరకు చెల్లించెను (మత్తయి 17:24-27; మార్కు 9:33). పేతురు యేసునకు ఎంతో విధేయుడాయెను. వారి స్నేహము ఎక్కువగుచుండగా యేసు పేతురును తనతో నీటిపై నడుచునట్లు పిలిచెను (మత్తయి 14:28,29; యోహాను 6:19-20). పేతురు విధేయుడాయెను. కాని అలలను చూచి భయపడుటతో మునుగుట ప్రారంభించెను. సహాయపడుమని యేసును

కోరగా ఆయన సహాయపడెను. మన విశ్వాసమును యేసు సాగదీయునపుడు మనకును అట్లే జరుగుచున్నది. యేసునుండి దృష్టి తొలగించుటతో మునిగిపోవు చున్నాము. తిరిగి యేసుపై దృష్టిని మళ్ళించుకొనుటతో సమస్తము చక్కబడుచున్నవి.

యేసుతో నుండినపుడు పేతురు విశ్వాసము యెరుగుచుండెను. అతని పాపపు టొప్పుకోలు నందు యేసు యొక్క దైవత్వమును నొక్కి చెప్పి యున్నాడు (మత్తయి 16:16; యోహాను 6:68,69). అతని మొదటి పత్రికయందు, మొదటి పేతురు, అతడు విశ్వాసము యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పెను. దేవుని యెడల సమర్పణను గూర్చి చెప్పెను. అయినను యేసు నెరుగనని చెప్పెను. తదుపరి పశ్చాత్తాపపడగా తిరిగి చేర్చుకొనబడెను.

నీ వెనుకటి జీవితమును జ్ఞాపకము చేసికొనుటతో దేవుడు నీ విశ్వాసమును సాగదీయుటకు కొన్నిటిని చేసెనని చూచితివా? ఆయనను నమ్ముకొనుటలో ఎటువంటి కష్టములనుభవించితివి? వాటి నుండి ఏమి నేర్చుకొంటివి. ఇప్పుడు దేవుడు నీ విశ్వాసమును సాగదీయుచున్నాడా? గతములో నీవు నేర్చుకొనిన దానిపై ఆధారపడుచు ఏ రీతిగా విశ్వాసమునందు కొనసాగగలవు?

### 3. దైవభక్తిగల నాయకుడు దేవుడు ప్రత్యేకమగు రీతులలో పనిచేయునని చూచును

మనద్వారా పనిచేయునపుడు మనము యితరులను నడిపించవలెననియే ఆయన తలంపు. దేవుని సేవించుట గొప్ప భాగ్యము

మరియు ఆయన మనలను వాడుకొనునట్లు మనమంగీకరించుటయు భాగ్యమే. పేతురు జీవితములో ఇది నిజమైనది. ఒక బాలికను మరణము నుండి బ్రతికించిన మహత్కార్యమును పేతురు చూచు భాగ్యమును పొందెను (మత్తయి 9:23-26; మార్కు 5:37-43; లూకా 8:51-55). యేసు ఐదువేల మందికి ఆహారము పెట్టుచుండగా పేతురు ఆయన ప్రక్కనే నిలిచియుండెను (పురుషులు మాత్రమే 5000! మత్తయి 14:13-22; మార్కు 6:30-46; లూకా 9:10-17; యోహాను 6:1-15 ప్రకారము మొత్తం 20,000 మంది!). పేతురు యేసు చేసిన యితర మహత్కార్యములను కూడ చూచెను. స్వస్థత, దురాత్మలను వెళ్లగొట్టుట మొదలగునవి కూడ చూచెను. యేసు ఆరోహణుడగుటచూచిన ముగ్గురిలో పేతురు ఒకడు (మత్తయి 17:1-3, మార్కు 9:2-3, లూకా 9:29-32). దానిని మించినదే పేతురు ఖాళీ సమాధిని చూచిన వారిలో ప్రథముడై యుండుట (లూకా 24:12 యోహాను 20:3). పునరుత్థానుడైన యేసు అదే దినమున మొదట పేతురుకే కనబడెను (లూకా 24:34; 1 కొరింథీ 15:5).

యేసు ఆరోహణుడైన పిదప పేతురు ఆదిమ సంఘపు నాయకులలో ఒకడై యున్నందున యేసుతో నుండినవాడై ఊచ చేయ్యగలవాడు దేవాలయము నొద్ద నున్న వానిని స్వస్థపరచినపుడు చూచెను (అపొస్తలుల కార్యములు 3 అధ్యాయము) మరియు అననీయ సప్పీరా దంపతులు పాపము చేసినపుడు వారిని శిక్షించినపుడును పేతురు చూచెను (అపొస్తలుల కార్యములు 5 అధ్యాయము). రెండుసార్లు చెరసాల నుండి తానే ఆశ్చర్యమగు రీతిగా విడిపించబడుట (అపొస్తలుల కార్యములు 5,12

అధ్యాయములు), ఐనా యనువాని పక్షవాతరోగము నుండి స్వస్థపరచుట (అపొస్తలుల కార్యములు 9), డోర్కా అను బాలికను మరణము నుండి బ్రతికించబడుట (అపొస్తలుల కార్యములు 9). మొదటి అన్యజనులైన కొర్నేలి కుటుంబీకులు యేసును నమ్మినపుడును పేతురు సాక్షిగా నుండెను (అపొస్తలుల కార్యములు 10 అధ్యాయము).

యేసు యితరుల జీవితములందేరీతిగా పనిచేయుచున్నాడో చూచుట మనకు ప్రత్యేక భాగ్యముగా నున్నదని నేను ఎన్నోసార్లు నా పరిచర్యలో చూచి దేవునికి వందనములు చెల్లించితిని. నా ద్వారా ఆయన పనిచేయుచున్నందున ఆయన చేయు మార్పులను చూడగలగుచున్నాను. ఆయన చేయునది ఏమిటో చూచు చున్నాను. నన్నును వాడుకొనుచున్నాడు. అందరి సేవకులకును యిదే భాగ్యము దొరకుచున్నది. ఎక్కువ మంది సేవకులై యుండునట్లు ఆయన కోరుచున్నాడు. అనేకరీతులుగా దీవించుచున్నాడు.

ప్రార్ధనకు జవాబు యిచ్చుటకును, ఒక జీవితమును మార్చుటకును దేవుడు చేయు పనిని చూచునపుడు నీ పరిచర్య విషయము నాలోచించు కొనుము. నీవు ఆయన పరిచర్య చేయుచుండగా యిదివరకు పొందిన దీవెనలేమై యున్నవి? ఆయన చేసిన మహత్కార్యము లేవైయున్నవి? ఈ గొప్ప భాగ్యము కొరకు వందనములు చెప్పుము. ఆయన ఆశ్చర్యకరమగు ప్రేమగల దేవుడని ప్రకటించుము.

## 4. దైవభక్తిగల నాయకుడు వినయము గలవాడు

వినయము అను శీలము లేకుండ ఎవరైనను దైవభక్తిగల నాయకుడై యుండలేడు. అతిశయము అనునది స్వార్థము. కాని దైవభక్తిగల

నాయకునికి దేవుడే హృదయకేంద్రమై యున్నాడు. వినయము మరియు అతిశయము రెండును ఒకేసారి ఉండలేవు. వినయముగానైనను, అతిశయముతోను ఉండవలసినదే. పేతురునకు గల సమస్య అతిశయము. ఎప్పటి వరకు? దేవుడతనికి వినయముగా నుండవలెనని నేర్పించునంతవరకు! అప్పటి వరకు పేతురు దేవునిచే వాడబడ కుండెను. మనము అపజయమును పొందునట్లు చేసి వినయమును నేర్పుచున్నాడు. పేతురునకు అదియే జరిగినది. పేతురు యేసును తన పాదములను కడుగనీయ లేదు (యోహాను 13:1-20). కొన్నిసార్లు వినయముగా నుండుట కష్టతరముగా నున్నందున దేవుడు మనకు పరిచర్య చేయకుండునట్లు చేసికొందుము. మన పాఠములకు ఆయన క్షమాపణను లేకుండ చేసికొందుము. నిరుత్సాహములో నున్నపుడు ఆయన ప్రోత్సాహము లేకుండ చేసికొందుము. ఆయన సహాయు లేకుండ చేసికొందుము. అతని పాదములు కడిగిన పిదప యేసు పేతురుతో "నన్ను యెరుగనని" చెప్పెదవు అని తెలియజేసెను (మత్తయి 26:34; మార్కు 14:30; లూకా 22:34; యోహాను 13:38). పేతురు అటువంటి వాడనుకానని చెప్పుచు అట్టిది యేమాత్రము జరుగదని ఒట్టుపెట్టుకొనెను (మత్తయి 26:35; మార్కు 14:31).

తననే నమ్ముకొని యున్నందున పేతురు యేసు హెచ్చరికను అంగీకరించ లేదు. కాని పేతురు యేసును ఎరుగనే ఎరుగనని మూడుసార్లు చెప్పెను (మత్తయి 26:69-75; మార్కు 14:66-72; లూకా 22:55-60; యోహాను 18:16-27). పేతురులోని అతిశయమే మరియు తన్నుతాను నమ్ముకొనియున్నందుననే యేసును తన పాదములను

కడుగనీయలేదు. మరియు యేసునెరుగనని చెప్పనే చెప్పననెను. సాతానుడు గోధుమలను జల్లించినట్లు చేయునని యేసు పేతురునకు చెప్పెను. కాని పేతురు నమ్మలేదు (లూకా 22:31-38). తదుపరి గెత్సెమెనె తోటలో యేసు శిష్యులను ప్రార్థించుమని చెప్పినపుడు పేతురు నిద్రించెను. యేసు బంధించబడినపుడు పేతురు మల్కు అనువాని కొట్టగా యేసు పేతురును గద్దించెను. పేతురు తాను తలంచిన దానినే చేయుచుండెను. యేసు కోరినదానిని చేయలేదు. యేసు బంధించబడినపుడు యితర శిష్యులు పారిపోయిరి. కాని పేతురు యేసునే వెంబడించెను. కాని యేసు నెరుగని వానివలెనే నటించెను. పేతురు వినయము లేకుండినందున మరియు యేసు చెప్పిన దానిని నమ్మనందున యేసు నెరుగనని చెప్పెను. అతని అతిశయము నందు యేసును యెరుగనని చెప్పెనని యెంచెను. కాని యెరుగననియే చెప్పెను. మూడుసార్లు!

కోడి కూయుటతో పేతురు యేసు హెచ్చరించిన మాటలను జ్ఞాపకము చేసికొనెను. అదే సమయములో మొత్తబడిన యేసును చూచుచు, యేసు పేతురు తన్ను తాను శపించుకొనుట, యేసు నెరుగనని చెప్పియుండుట జ్ఞాపకము చేసికొనెను. ఘోరమైన అవమానము ననుభవించెను. యేసు యెడల ఆ రీతిగా ప్రవర్తించునని తలంచలేదు. కాని అదియే జరిగెను. యేసు యెడల నమ్మకస్థుడై యుండుటలో విఫలుడాయెను.

పేతురు యిక ఎన్నడైనను మరువలేని పాఠమును ఆ రాత్రి నేర్చుకొనెను. యేసు లేకుండ విజయము పొందుటకు బలహీనుడాయెను. ఇక అతనిలోని అతిశయమును వదలుకొనెను. యేసు యెడల

వినయమును చూపెను. అపొస్తలుల కార్యముల గ్రంథములో ఈ పేతురునే వేరొకరీతిగా చూడగలము. యేసుపై దృఢమగు నమ్మిక నుంచుకొనెను. కాబట్టి పేతురును అనేకమగు యితర రీతులలో వాడుకొనెను. పేతురు వ్రాసినదేమనగా సాతానుని శోధనల విషయమై జాగ్రత్త వహించవలెనని యితరులను హెచ్చరించెను (1 పేతురు 5:8,9) మరియు వినయముగా నుండవలెను (1 పేతురు 3:8; 5:5-7). వినయమును నేర్చుకొనుట యనునది బహు కష్టతరమగు పాఠముగా నుండెను. కాని దేవునిచే వాడబడుట కొరకు దాని నేర్చుకొనవలసి వచ్చెను.

నేడు సేవకులముగా నుండు మనకును యిది వర్తించుచున్నది (కీర్తనలు 51:17). పౌలు కూడ అతిశయము అను లక్షణముతో సమస్య నెదుర్కొనెను. దేవుడతనికి శరీరములో ముల్లు పెట్టెను. దానికి గల కారణము అతనికి వినయమును నేర్పించుటయే (2 కొరింథి 12:1-10). మనలోని అతిశయము నణచి వేయుటకు దేవుడు ప్రేమతోనే మొత్తు అవసరమును వాడును. నలుగగొట్టుటకేది అవసరమో దానిని వాడును.

నీ భార్య నీలో అతిశయము ఉన్నదని చెప్పుచున్నదా? ఇతరులలో నుండు అహంకారము సులభముగా గుర్తించగలము కాని మనలో నుండు అతిశయము మనకు కనబడదు. ఒకరు ఎవరైనను మన తప్పు చూపుచు సరిచేయుచుండగా వినుచుందుమా? నీవు ఒకరిని బాధపెట్టినపుడు వారిని క్షమించుమని కోరెదవా? తప్పు చేసినందున దానిని ఒప్పుకొందువా? ఓటమి జరుగుటతో యితరులపై నింద మోపుదువా? ఇతరులను చిన్నచూపు చూచెదవా? దేవుని నుండి నీవు ప్రత్యేకతను కోరుదువా?

నాయకుడవై యున్నందున నీవు యితరుల నుండి ఘనతను కోరుదువా?

## 5. దైవభక్తిగల నాయకుడు పరిశుద్ధాత్మతో నింపబడినవాడు

పేతురు తనను వినయమనస్కునిగా చేసికొనినందున తనకు చెందిన ప్రతి విషయమునందు దేవుని సహాయపు అవసరతను చూడగలిగెను. పరిశుద్ధాత్ముని పరిచర్య తనతో నుండునట్లు అనుమతించెను. అతని ద్వారా పరిశుద్ధాత్ముడు పనిచేయునట్లు చూచుకొనెను. అపొస్తలుల కార్యములు 2వ అధ్యాయము నందు పరిశుద్ధాత్ముడు విశ్వాసులందరిపై దిగివచ్చెను. అది మొదటిసారి మరియు అది ఒకేసారి! మరల అట్టిది జరుగలేదు. యేసు జన్మము వలెనే. యేసు మనలోకములో ప్రవేశించియుండుట ఒకేసారి జరిగెను. విశ్వాసులందరు పరిశుద్ధాత్మతో నింపబడిరి. అట్టిది యిప్పుడును యేసును నమ్ముకొను క్షణమున ప్రతి యొక్కరికి జరుగుచున్నది (1 కొరింథి 12:13; ఎఫెసి 1:13,14). పరిశుద్ధాత్మునిచే నింపబడునట్లు మనము ఆజ్ఞాపించబడియున్నాము (ఎఫెసి 5:18). దాని భావము మన జీవితము నందు పాపమునే మాత్రము ప్రవేశింపనీయకూడదు (ఎఫెసి 4:30), లేక అవిధేయతను కూడ ప్రవేశింపనీయకూడదు (1 థెస్స 5:19).

పరిశుద్ధాత్ముడు మనకు జ్ఞానమును, ధైర్యము నిచ్చుచున్నాడు. ఇది దేవునికి పరిచర్య చేయుట కొరకే. తనను వినయమనస్కునిగా చేసికొనకముందు, పరిశుద్ధాత్ముడు తనలో తన ద్వారా పనిచేయునట్లు అనుమతించకముందు పేతురు ఒక పనికత్తెయైన బాలికను చూచి భయమును తెచ్చుకొనెను. తదుపరి వేలాది మందికి వాక్యపరిచర్య

చేయుటకు ధైర్యము తెచ్చుకొనెను (అపొస్తలుల కార్యములు 2:14-36).

పరిశుద్ధాత్ముడు నీలో జీవించుచున్నాడనియు, నీ ద్వారా పనిచేయు చున్నాడనియు నీవెట్లు యెరిగియున్నావు? దేవుని సహాయము లేకుండ నీవు చేయునట్లు దేవుడు నీకొరకేమి చేయుచున్నాడు? నీలో ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము సాక్షాత్తుగా నున్నవా? (గలతీ 5:22). దేవుని ఆత్మ నీ జీవితమును స్వాధీనములో నుంచుకొనినట్లు గల ఋజువు యిదియే. నీలో పేరాశ, కోపము, అసూయ, యితరుల సహవాసము లేకుండుట, అతిశయము లేక యితరమగు పాపము ఏదైన ఉన్నాదా? (గలతీ 5:19-21). ఇవి శరీర స్వాధీనములో నున్నట్లు చూపును. వాటిని ఒప్పుకొనుము. నిన్ను పరిశుద్ధాత్మతో నింపుమని దేవుని కోరుము.

## 6. దైవభక్తిగల నాయకుడు అవసరము ఉన్నచోట పరిచర్య చేయును

యేసు మరలి పరలోకమునకు వెళ్లినపుడు శిష్యులకు పేతురు నాయకుడై యుండవలసివచ్చెను. అవసరతను బట్టి అతడంగీకరించెను. యూదా ఇస్కరియోతు నకు బదులుగా మరొకరిని ఎంపిక చేయుమని చెప్పెను (అపొస్తలుల కార్యములు 1:16-26). పెంతెకోస్తు దినమందు ప్రసంగించెను (అపొస్తలుల కార్యములు 2 అధ్యాయము). అతని ద్వారా దేవుడు కుంటివాని స్వస్థపరచునట్లు చేసెను (అపొస్తలుల కార్యములు 3). బహు ధైర్యముతో మహాసభను ఎదిరించెను (అపొస్తలుల కార్యములు 4). అననీయ, సప్పీరా దంపతుల వేషధారణను పరిష్కరించెను

(అపొస్తులుల కార్యములు 5). విశ్వాసులలోని పాపమును ధిక్కరించుట బహు కష్టము. కాని పేతురువలెనే అట్లు చేయవలసి యున్నది. ఎందుకనగా సంఘము పవిత్రముగా నుండవలెను.

పేతురున కవసరమైనవన్నియు అతని కందించబడెను. సమరయ ప్రాంతము వరకు ప్రయాణము చేసెను. ప్రసంగించెను. మాంత్రికుడైన సీమోనుతో వ్యవహరించెను (అపొస్తులుల కార్యములు 8). యెరూషలేము సభకు నాయకుడై యుండెను. ఆ సభ అన్యులు క్రైస్తవులగుటకు ముందు యూదులుగా మారనవసరము లేదని తీర్మానించు సభయై యున్నది (అపొస్తులుల కార్యములు 15). ఏ స్థలము నందైతే తన అవసరము, ప్రోత్సాహము ఉండెనో అక్కడికి ప్రయాణము చేసి వెళ్లెను. లుద్ధ అను స్థలమునకు వెళ్లెను (అపొస్తులుల కార్యములు 9:32), ఐనియా అనువాని స్వస్థపరచి, డోర్కా అను స్త్రీ మరణించగా బ్రదికించునట్లు దేవుని కోరెను (అపొస్తులుల కార్యములు 9:40).

కొర్నేలు అను ఒక అన్యుని యొద్దకు సువార్తను తీసికొని వెళ్లుటకు యిష్టము చూపెను. యూదుడై యున్నందున అట్లు అన్యుని యొద్దకు వెళ్లుట నిషేధింప బడినను అతడు వెళ్లెను (అపొస్తులుల కార్యములు 10). దేవుడు చెప్పు స్థలమునకు ఎప్పుడైనను వెళ్లుటకు మనము సిద్ధపడి యుండవలెను. ఏమి చేయుమని చెప్పినను దానిని చేయవలసినదే. కోర్నేలిని గూర్చి పేతురు తలంచిన రీతిగా దీనస్థితిలో నున్న వారి యొద్దకు యేసు వెళ్లుమని చెప్పుటతో వెళ్లవలసినదే. దేవుని ప్రేమను పొందుటకు ధనికులు, బీదలు లేరు. ఇతరులు మనలను మన క్రింది వారికే సేవ చేస్తున్నారని అనకుండునట్లు దేవుడు మనలను నడిపించిన, ఆయన కిష్టమైన

స్థలములకు వెళ్ళి సువార్త చెప్పవలెను.

పేతురు మార్కు అను యువకుని అతనితో తీసికొని వెళ్లెను. పేతురు యొక్క ఉద్దేశ్యము అతనికి శిక్షణ నీయవలెననియే. మార్కు తన సువార్తను వ్రాసెను. పేతురు యేసుతో గడిపిన సమయము నాధారము చేసికొని దాని లిఖించెను. మార్కు సువార్తను చదువునపుడు నీవు చదువునది పేతురు మాటలే. నీ పరిచర్య యందు ఒకరిని తీసికొని వెళ్లినపుడు అతనికి శిక్షణ నిచ్చుచున్నావు. నాయకుడై యుండుటలోని ముఖ్యమగు భాగము యితర నాయకుటకు శిక్షణనిచ్చుట!

పేతురు వివిధ రీతులుగా ఎన్నో స్థలములందు పరిచర్య చేసెను. ఏది అవసరమై యున్నదో దానినే చేసెను. దేవుడు తనను ఎక్కడికి పంపెనో అక్కడికి వెళ్లెను. తన యిష్టము నేమాత్రము దేవునికి తెలియపరచలేదు. దేవుని తీర్మానమునే అంగీకరించెను. దేవుని నడిపింపును వెంబడించెను. ఒక మంచి నాయకుడు మొదట యథార్థముగా వెంబడించువాడై యుండవలెను.

తాను పంపదలచిన చోటికి నిన్ను పంపగలడను నమ్మిక నీకున్నదా? ఎక్కడైనను పరిచర్య చేయుటకు సిద్ధముగా నున్నవా? చేయనిది, వెళ్లనిది ఏదైనా ఉన్నదా? ఇది వరకు దేవుడు నిన్ను వాడుకొనిన స్థలములను జ్ఞాపకము చేసికొనుము. వాటిని గూర్చి దేవునికి వందనములు చెప్పుము. ఏ వ్యక్తికైన, సంఘానికైన నీవు సేవ చేయలేదా? నీ ద్వారా దేవుడు కష్టమైన స్థలములకు వెళ్ళాలని ఆశిస్తున్నాడా? దేవునికి అసాధ్యమైనదేదైన వున్నదని, నిన్ను చేయమని చెపుతున్నాడా?

## 7. దైవభక్తిగల నాయకుడు దేవుని వాక్యమును బోధించును

పేతురు జీవితములోని పాఠములను నేర్చుకొనునపుడు అసలైన కేంద్రమును గుర్తించుకొనవలెను. అది దేవుడు ప్రసాదించినదే. పెంతెకోస్తు నందు అతడు యిచ్చిన మొదటి సందేశము (అపొస్తలుల కార్యములు 2:14–36), పేతురు పాత నిబంధనను ఎన్నోసార్లు వల్లించెను. దేవుని వాక్యపు అధికారమును అతడు అతని సందేశపు ఆధారముగా చేసికొనెను. యేసును గూర్చి ప్రకటించుటలో బైబిలు వాక్య భాగముల నెన్నో వాడుకొనెను. అతని పరిచర్య యంతటిలో దానినే పాటించి యుండెను.

లేఖనముల ఉత్తేజమును గూర్చి పేతురు లిఖించెను (2 పేతురు 1:20,21), ఆత్మీయ యెదుగుదల యందు దేవుని వాక్యపు ప్రాముఖ్యతను (1 పేతురు 2:2) మరియు ఏ రీతిగా లేఖనములు రక్షణను తెచ్చుచున్నదో (1 పేతురు 1:23) అతడు లిఖించెను. దేవుని వాక్యమును త్రిప్పి చెప్పు వారిని హెచ్చరించెను (2 పేతురు 2:1–22). మన కర్తవ్యమును దేవుని వాక్యాధారముగా చేసికొనవలెను. ఇతరులకు బోధించవలెను. వాక్యమును బాగుగా యెరిగి యుండవలెను, నేర్చుకొనవలెను. కుటుంబీకులకును, సంఘస్థులకును బోధించుట ప్రథమముగా నుంచుకొనవలెను. దేవుని వాక్యమును నాయకులు భద్రపరచుచు దాని నందించవలెను.

నీ వాక్యపరిచర్య వాక్యానుసారముగా నున్నదా? సంఘస్థులు వాక్యములో యెదుగునట్లు వారిలో ప్రార్థన ఉన్నదా? బెదరించు వారినెదిరించుటకు వారిలో తగినంత విశ్వాసము ఉన్నదా? అప్పటి కన్నను ప్రస్తుతము నీలో వాక్యము యెదిగి యున్నదా? భవిష్యత్తులో

ప్రకటించునట్లు క్రమముగా వాక్యపఠనము చేయు చున్నావా? నీ హృదయము, సమయము మరియు పరిచర్యలందు దేవుని వాక్యము ఉన్నతస్థాయి నందు కొనియున్నదా?

## 8. దైవభక్తిగల నాయకుడు తృణీకారము మరియు హింసల నెదుర్కొనును

పేతురు యథార్థపరుడును, ఫలవంతమగు సేవకునిగా దేవుని యెదుటను, ఆయన సంఘము యెదుటను ప్రవర్తించెను. ఆదిమ సంఘము నందు ముఖ్య నాయకులలో నొకడైయుండెను. దేవుడతని దీవించెను. అయినను అతనికి జీవితము సులభముగా లేకుండెను. ప్రారంభము నుండి యేసు తన శిష్యులను వారు తోడేళ్ల ముందు గొఱ్ఱెల వలె ఉందురని చెప్పెను. మోసగించబడుదురనియు, కొట్టబడుదు రనియు, బంధుమిత్రులే అట్లు చేయుదురనియు చెప్పెను (మత్తయి 10:5-11:1; మార్కు 6:10-13; లూకా 9:3-6). యేసు పొందిన శ్రమలను చూచినవాడై పేతురు తన జీవితము నందు దేవుని చిత్తమునకు విధేయుడై దేవుని సేవించుటలో చెల్లించవలసిన ఖర్చు ఉన్నదని పేతురు నేర్చుకొనెను.

పేతురు యొక్క మొదటి ప్రసంగము జయకరమై యుండెను. కాని యది హింసను కలిగించెను. రెండుసార్లు మత నాయకులతని బంధించిరి. బెదిరించ బడెను. కొట్టబడెను. యేసును గూర్చి యిక చెప్పకూడదని చెప్పబడెను (అపొస్తలుల కార్యములు 4:18). కాని పేతురు దేవుని వాక్యమును ప్రకటించుటలో కొనసాగెను (1 పేతురు 3:15). యాకోబు అతని మిత్రుడు, తోటి జాలరి. శిష్యత్రయమను వలయములో నొకడు హేరోదుచే చంపబడెను (అపొస్తలుల కార్యములు 12:1-2). పేతురును

కూడ చంపదలచెను (అపొస్తలుల కార్యములు 12:3). కాని దేవుడు దూతను పంపి పేతురును చెరసాల నుండి విడిపించెను. పేతురు శ్రమల ననుభవించవాడై యున్నందున దాని గూర్చి వ్రాయగలిగెను (1 పేతురు 3:13,14; 4:12-19).

తనను సరిగా చూడని వారియెడల పేతురు క్షమించుగుణమును కలిగి యుండవలెనని నేర్చుకొనెను (మత్తయి 18:15-35). యేసు అతనికి చెప్పిన దేమనగా ఒక దినములోనే అవసరమును బట్టి అనేకసార్లు క్షమించవలెనని నేర్పెను. అతని జీవితములో పేతురు దీనిని ప్రయోగించవలసి వచ్చెను. క్షమించుగుణము లేని నాయకుడు నాయకత్వమునకు యోగ్యుడు కానేరడు.

ఇతరుల నుండి నీవనుభవించిన ఎదిరింపులను గూర్చి యోచించుము. ఏ రీతిగా జవాబు చెప్పితివి? అవిశ్వాసుల వ్యతిరేకత ఎట్లుండెను? వ్యవహరించి యుంటివా? తృణీకారము మరియు విమర్శలకు భయపడుదువా? నిన్ను బాధపరచిన వారి నెవరినైనను క్షమించక యున్నావా? వాటిని గూర్చి యిప్పుడే ప్రార్థించి క్షమించునట్లు సహాయపడుమని దేవుని కోరుము.

## 9. దైవభక్తిగల నాయకుడు తన పాపము నుండి పాఠము నేర్చుకొనును

పేతురు యేసునకు యథార్థతతో పరిచర్య చేసెను. అయినను పవిత్రుడై యుండలేదు. ఒకసారి పౌలు అతని వేషధారణను గద్దించవలసి వచ్చెను (గలతీ 2:11). తదుపరి పేతురు ఆ రీతిగా ఉన్నట్లు ఎక్కడను వ్రాయబడలేదు. తన పాపము నుండి పాఠము నేర్చుకొని మరల పాపము

చేయకుండెను. యేసును మరల యెరుగనని చెప్పలేదు. పరిశుద్ధమగు జీవితమును గూర్చి యెరిగినవాడై దానిని వ్రాసెను (1 పేతురు 1:14; 2 పేతురు 2:1).

యేసు చేసిన సహాయముతో ఎటువంటి పాపములను జయించి యున్నావు? ఎటువంటి పాపముల నెదుర్కొనుచున్నావు? వాటిని జయించుట కవసరమైనవి ఏవి? క్షమాపణను కోరని పాత పాపము లేవైన యున్నవా? యేసునకు చెప్పుము.

## 10. దైవభక్తిగల నాయకుడు మరణమందును యథార్థత చూపును

దేవునికి యథార్థమగు పరిచర్య చేయుట ద్వారా పేతురు తన జీవితమును గడిపెను. మరణించునపుడును యథార్థముగా నుండెను. తన భార్య మరణించు చుండగా పేతురు "ప్రభువును జ్ఞాపకము చేసికొనుము. ప్రభువును జ్ఞాపకము చేసికొనుము" అని చెప్పుచుండెను. ఆమె మరణించిన పిదప పేతురు కూడ సిలువ వేయబడెను. తలక్రిందులుగా సిలువ వేయబడునట్లు కోరెను. ఎందుకనగా నేరుగా ప్రభువు వలె సిలువవేయబడుటకు అర్హత లేదని చెప్పెను. అతని గమ్యము నెరిగినవాడై యేసుతో నిత్యజీవములో నుండునని యెరిగెను (1 పేతురు 1:3,4).

మరణమనగా నీకు భయమున్నదా? విశ్వాసమును విడిచిపెట్టుటకు బదులుగా మరణించుటకు సిద్ధపడియున్నావా? యేసు కొరకు యథార్థముగా జీవించుచున్నావా?

పేతురు జీవితము నందు దైవభక్తిగల నాయకునిగా నుండుటక మనము:

1. దేవుని పిలుపు నందుకొనవలెను.

2. పరిచర్య చేయుటకు సిద్ధపడవలెను.

3. లోతగు ఆత్మీయజీవితము కలిగియుండవలెను.

4. ఇతరులు శిష్యులగునట్లు ఆకర్షించవలెను.

5. ఇతరులకు శిక్షణ నీయవలెను.

6. పాపము నుండియే నేర్చుకొనవలెను.

7. సేవకుడై యుండవలెను.

ఇవన్నియు నీలో ఉన్నవా? ఏవి ఉన్నవి? ఏవి లేవు? సరిదిద్దుటకేమి చేయుదువు? వీటిని గూర్చి ప్రార్థించుచు అన్నిటిని పొందునట్లు దేవుని కోరుము.

# 9. పౌలు జీవితము నుండి నాయకత్వ పాఠములు

**అపొస్తలుల కార్యములు 27:1-28:10 చదువుము**



సంఘచరిత్రయందు గల గొప్ప నాయకులలో పౌలు ఒకడు. దేవుడు పౌలును మహత్తరమగు రీతిగా వాడుకొని సంఘములను స్థాపించు నట్లు చేసెను. మరియు ఇతరులను మించి గ్రంథములను బైబిలు నందు వ్రాయునట్లు చేసెను. అతని నుండి అద్భుతమగు నాయకత్వ పాఠములను నేర్చుకొనుటకు ఉన్నవి. కాని అపొస్తలుల కార్యముల గ్రంథపు చివరి అధ్యాయముల నుండి కొన్నింటిని చూచుదము. ఓడ బద్ధలగునప్పటి అనుభవము ముఖ్యమైనది. శోధనలు మరియు కష్టములు నాయకులలో శ్రేష్ఠమగు అనుభవమును తెచ్చునని చెప్పబడిన రీతిగా యది పౌలు జీవితము నందు సార్థకమైనది.

దమస్కు మార్గము నందు పౌలు మారుమనస్సు పొందెను (అపొస్తలుల కార్యములు 9). తదుపరి అరేబియా దేశమునకు వెళ్లెను. అక్కడ ఆత్మీయముగా నుండుట నేర్చుకొనుచు తన జీవితములో యెదుగును

తెచ్చుకొనెను. తన పరిచర్య నెక్కువగా మూడు ప్రేషిత ప్రయాణములందు గడిపియుండెను. సంఘములను ప్రారంభించెను. సంఘములకు ఉత్తరములు వ్రాసెను (అపొస్తలుల కార్యములు 13-20). పరిచర్య చేయుచు 30 సంవత్సరములైన పిమ్మట యెరూషలేము నందు బంధించబడెను. తప్పిదమేమియు చేయలేదు. పరీక్షింపబడుటకు రోమా పట్టణమునకు బదిలీ చేయబడెను (అపొస్తలుల కార్యములు 21-26). సంకెళ్లతో ఖైదీగా ప్రయాణము చేయుచు పౌలు తన నాయకత్వపు తలాంతులను కనబరచెను. అతని జీవితము నుండి నేర్చుకొనవలసిన పాఠములున్నవి.

## 1. దైవభక్తిగల నాయకుడు నమ్మదగినవాడు

యూలి అను పేరుగల శతాధిపతి యొక్క అధికారములో పౌలు బంధితునిగా యున్నపుడు (అపొస్తలుల కార్యములు 27:1) పౌలు సంకెళ్లతో బంధించబడినవాడై ఓడకు కట్టబడెను. పౌలు యొక్క మిత్రుడు లూకా అతనితో ప్రయాణము చేసెను. అట్లు పౌలుతో వెళ్లుట కొరకు లూకా కొన్ని పత్రములపై అతడు పౌలుయొక్క బానిస యని సంతకము చేసెను. లూకా పౌలున కెంతో సహాయపడెను. వైద్యపరిచర్య కూడ చేసెను.

మొదటి రేవునందు ఓడ ఆగెను. యూలి పౌలును దరికి వెళ్లి మందులు కొనుగోలుచేయునట్లు అనుమతి నిచ్చి పంపెను (అపొస్తలుల కార్యములు 27:2-3). అక్కడ పౌలునకు మిత్రులుండిరి. వారు పౌలునకు అవసరమైన వాటి నందించిరి.

అసాధారణమైన విషయమేమనగా రోమా సైనికుడు యూలి పౌలు దారికి వెళ్లునట్లు సమ్మతించుట. అనగా అతడు పౌలును నమ్మెను. యూలి అధికారములో నుండు ఎవరైనను తప్పించుకొనిపోయిన యెడల శతాధిపతికి మరణమే శిక్ష. అయినను యూలి పౌలును నమ్మి పంపించెను. అంతటి నమ్మకత్వమును పొందునట్లు పౌలు ఏమి చేసెను? ఇటీవలెనే అతనిని కలిసికొనెను గదా!

పౌలు నెరిగినవారు నమ్మినదేమనగా పౌలు వారి విషయమై యెంతో శ్రద్ధ వహించెను. మరియు వారి మేలు నిమిత్తము ఎంతో సహాయము చేసెను (మత్తయి 20:23-28). తన మాటను నిలబెట్టుకొనునంతటి నమ్మకస్థుడే పౌలు. ప్రజలను తన లాభము కొరకు వాడుకొనువాడు కాదు. వారందరిని – స్వతంత్రులని, బానిసలని, పెద్దవారని, పిల్లలని, పురుషులని, స్త్రీలని, ఉన్నతస్థాయి గలవారని, దీనస్థితిలో నున్నవారని వ్యవహరించెను. యేసు కూడ అట్లే చేసెను. పౌలు యితరులకు సహాయము చేసి, వారును తనకు సహాయము చేయునని యేమాత్రము కోరలేదు. నమ్మకత్వము అనునది యథార్థత మరియు శీలము వలననే వచ్చును (1 తిమోతి 3:2,7).

ప్రజలు నిన్ను నమ్ముదురా? వారి మధ్య నీకు మంచి పేరు ఉన్నదా? యథార్థత యున్నదా? మాట తప్పనివాడై యున్నవా? నీతో కలిసి పనిచేయు వారి అవసరతలను నీ వ్యక్తిగత అవసరతలకు ముందు పెట్టుచున్నావా? అందరిని ఒకేరీతిగా చూచుచున్నావా?

## 2. దైవభక్తిగల నాయకుడు నడిపించుట ప్రారంభించును

ఆ రేవు నుండి కొన్ని దినములు ప్రయాణము చేసి వేరొక రేవు చేరిరి (అపొస్తలుల కార్యములు 27:4,5). అక్కడ ఒక పెద్ద ఓడకు

మార్చుకొనిరి. ఐగుప్తు నుండి రోమా పట్టణమునకు ధాన్యమును తీసికొని వెళ్లిరి (అపొస్తలుల కార్యములు 27:6). ఓడలో నున్నవారి సంఖ్య 276 మంది. క్రొత్త ఓడలో ప్రయాణము చేయుటలో వారు గాలికి ఎదురుగా ప్రయాణము చేసిరి. బహు కష్టపడిరి. మరల వారు క్రేతు అను ద్వీపమును చేరిరి (అపొస్తలుల కార్యములు 27:7-9). అప్పటికి అక్టోబరు మాసము వచ్చెను. రోమా పట్టణమునకు గల దీర్ఘప్రయాణమునకు ఎంతో ఆలస్యమాయెను. శక్తివంతమగు గాలులు, దుమారములు ప్రారంభమగుచుండెను. ఓడ ప్రయాణము ఆపదకరమగుచుండెను. పౌలు ఖైదీగా నుండియు నాయకులను హెచ్చరించెను. ఓడ ప్రయాణము కొనసాగించుట ఆపదకరమని చెప్పెను (అపొస్తలుల కార్యములు 27:9).

పౌలు మాట్లాడుటకది స్థలము కాకుండెను. ఓడ నావికుడు మరియు ఓడ యొక్క స్వంతవాడు చెప్పునదే చివరిమాట. అయినను పౌలు మాట్లాడెను. అట్లు మాట్లాడుటకు ఎంతో ధైర్యము కావలసి యుండెను. చేయవలసిన దానిని పౌలు తెలియజేసెను. బహు నిదానముగా మృదువుగా చెప్పెను. కాని ఒక నాయకుని వలెనే బయలుపరచెను. ఎవరిని కూడ విమర్శించక, ఎవరిని చిన్నచూపు చూడలేదు. తాను చెప్పునదానినే చేయుమని కోరలేదు. తన యిష్టమును చేయునట్లు ఒత్తిడి చేయలేదు. కాని తాను తలంచినదానిని చెప్పగలిగెను.

సంఘకాపరులు నాయకులై యుండునట్లు దేవుడు కోరెను (1 పేతురు 3ః1-4). కొందరికది సులభము. మరికొందరికి కష్టము. పేతురునకైతే ప్రజలందరు తన చుట్టు ఉండుట యిష్టపడువాడు. కాబట్టి స్వాభావికముగా

సేవకుడాయెను. అయినను తన జీవితములో యేసును అతని జీవితములో ప్రథమముగా పెట్టుకొనునంతవరకు అట్లు జరుగదు. తదుపరియే అతడు దైవభక్తి గల నాయకుడాయెను. పదిమంది ముందు నిలబడుటకు సిగ్గుపడువారికి అది కష్టమే. నేను అట్లే యుంటిని. కాని దేవుడు నాకు నాయకత్వము నిచ్చుటకు సంఘకాపరి పనియిచ్చెను. ఎన్నో బాధ్యతలుండెను. దేవుడే నడిపించను. కాని ఒకరు నన్ను విమర్శించినపుడు లేక నా నాయకత్వము నెదిరించినపుడు ఎంతో కష్టమైనది. నాయకుడై యుండుట యనగా ప్రసిద్ధి గాంచి యుండుట కాదు. మనుష్యులను మెప్పించుట కాదు కాని దేవుని మెప్పించుటయే. అట్టి దానినే పౌలు చేసెను. దానినే నేడు మనమును చేయవలెను.

ఇతరులను నడిపించుట నీకు కష్టముగా నున్నదా లేక సులభముగా నున్నదా? సులభమైన యెడల దేవుడు కోరిన రీతిగా చేయుచున్నావా లేక నీ యిష్టప్రకారము చేయుచున్నావా? కష్టమైన యెడల నీ భయమును తొలగించుట కేమి చేయు చున్నావు? దేవుని కోరిక ప్రకారము ఎట్లు నిలబడగలవు? దేవుని కోరిక ప్రకారము నీవే ప్రారంభించి నడిపించిన సమయము ఉన్నదా? నడిపించుటలో భయపడిన సమయమును జ్ఞాపకము చేసికొనుము. దేవుని మార్గమును తప్పి నీ మార్గమున వెళ్లితివా?

### 3. దైవభక్తిగల నాయకుడు కష్టసమయములందు బలము గలిగియుండును

అది సరియైనదని పౌలు తలంచక పోయినను ఓడ నాయకుడు మరియు ఓడ స్వంతవాడు యిరువురును ప్రయాణము కొనసాగవలెనని

తలంచిరి. శీతాకాలము గడుపుట కొరకు తగిన స్థలము చేరవలెనని తలంచిరి. తదుపరి రోమా పట్టణము చేరగలుగుదురు. వారు చేయవలసిన ప్రయాణము యిక 40 మైళ్లు మాత్రమే. (అపొస్తలుల కార్యము 27:11-13). వారి ప్రయాణము ప్రారంభించుటతో వాతావరణము మారిపోయెను. వారిపై తుఫాను చెలరేగినది (అపొస్తలుల కార్యములు 27:14,15). ఓడను స్వాధీనము చేసికొనలేకపోయిరి. అది మునిగిపోకుండునట్లు ఎంతో ప్రయత్నించిరి. సామగ్రి నంతటిని పారవేసి ఓడను తేలికచేసుకొనిరి (అపొస్తలుల కార్యములు 27:16-19).

గాలివాన కొనసాగెను. కొన్ని దినములు గడిచినది. ఓడను తేలునట్లు చేయుటకు అందరును మేల్కొనియుండిరి. భుజించుట, నిద్రించుట అసాధ్యమైనది. ఏ సమయములోనో ఓడ బ్రద్ధలగునట్లుండెను. వారందరు మునిగిపోవలసినదే. వారి భావోద్రేకములు చెప్పలేని స్థితిలో నుండెను. కొన్ని దినములైన తదుపరి వారు ఎంతో అలసట జెందిరి. ఇక బ్రదుకలేమని యెంచుకొనిరి (అపొస్తలుల కార్యములు 27:20,21).

ఈ సమయమందు పౌలు యొక్క సహజజ్ఞానము తన నాయకత్వములో కనబడెను. అతని మాటలు అప్పుడే వినియుండిన యెడల యింతట ఘోర పరిస్థితి జరిగియుండెడిది కాదని చెప్పెను (అపొస్తలుల కార్యములు 27:21). అతడే సరిగా నున్నాడని వారందరు తప్పులోనున్నారని చెప్పుట కాదు. వారు తనను గ్రహించవలెనని కోరియుండెను. పౌలు అందరికి మరణించుటకు భయపడ కూడదని చెప్పెను. ఎందుకనగా దేవుడు అతనికి అందరును క్షేమముగా నుందురు

(అపొస్తలుల కార్యములు 27:22-24). తనకు దేవుడేమి చెప్పెనో పౌలు నమ్మి యుండెను. నమ్మిన దానిని వారందరికి తెలియజేసెను. వారందరు తనను వెంబడించవలెనని కోరలేదు. కాని వారందరు దేవుని నమ్ముకొని ఆయనను వెంబడించవలెననియే. దేవుడు చెప్పినదంతయు నెరవేరును.

దేవుడు సత్యమును ప్రకటించుచున్నావా? దేవుని వెంబడించుచు ఆయన వాక్యమును ఆయన వాగ్దానములను వెంబడింతుమని చెప్పగలవా? నీ యెడల దేవునికిగల నడిపింపును గ్రహించగలిగితివా? నీ పరిచర్యలో దానిని యితరులకు చెప్పగలవా? ఎట్టి పరిస్థితిలోనైనను దానిపై నిలబడగలవా? అధికారపూర్వకముగా నీవు నడిపించగలవా? (మత్తయి 7:28,29).

## 4. దైవభక్తిగల నాయకుడు యితురులను ప్రోత్సహించును

తాను ఎవరిని నడిపించుచున్నాడో ఆ వ్యక్తిని ఎల్లప్పుడు ప్రోత్సహించును. ఏ మాత్రము విమర్శించక, తిట్టక, లేక కోపపడక యుండును. విమర్శింపబడు చుండుట కన్నను ప్రోత్సహింపబడు చుండుటనే ఆశింతుము. అదే రీతిగా దేవుడు మనతో వ్యవహరించును. అదే రీతిగానే పౌలు ఓడలో నున్నవారితో వ్యవహరించెను. దేవుని యెడల నుండు విశ్వాసమును స్థిరపరచుచు ప్రోత్సహించెను (అపొస్తలుల కార్యములు 27:25,26). ఒక మాదిరిని చూపెను: ఏ మాత్రము భయపడక యున్నాడని తెలియజేసెను. కాని దేవుని విశ్వసించి ఆయననే నమ్ముకొనెను.

తోటి ప్రయాణికులు మరణమును తప్పించుకొందురని వారికి నిరీక్షణ

నిచ్చెను. ప్రస్థుత స్థితిని మించి దృష్టి యుంచుకొని దేవుని వాగ్దానములపై ఆధారపడెను. ప్రజలతో యథార్థతతో మెలగెను. వారతని నమ్మి గౌరవించిరి.

అయినన పౌలు వారిని సరిజేసెను (గలతీ 2:11-14). దానిని సత్యమును ప్రేమతో మాట్లాడుచు అట్లు చేసెను (ఎఫెసి 4:15). ఒక వ్యక్తిని వ్యక్తిగతముగా కలిసికొని తదుపరియే బహిరంగముగా సరిచేయవలెనని యేసు చెప్పెను. అదియు అతడు పశ్చాత్తాపపడనపుడే (మత్తయి 18:15-18). అప్పటికిని అతనిని సరిచేయుట కొరకే, ఖండించుట కొరకు కాదు. మన యెడల దేవుడు అట్లే చేయుచున్నాడు (రోమా 8:1).

వారి కష్టసమయములందు ప్రజలు ప్రోత్సహించబడునట్లు నీ యొద్దకు వచ్చు చున్నారా? ప్రజలను ప్రోత్సహించుటలో నీకు తలాంతు ఉన్నదా? నీ హెచ్చరిక పొందకనే కష్టము ననుభవించిన వారికి సహాయపడుచున్నావా? ఒకరిని సరిదిద్దునపుడు ప్రేమ నుపయోగించుచున్నావా? కోపమును స్వాధీనపరచుకొని కనికరము, సానుభూతిని ప్రదర్శించుచున్నావా? దేవుడు నీతో వ్యవహరించుచున్న రీతిగా నీవు యితరులనట్లే చేయుచున్నావా?

## 5. దైవభక్తిగల నాయకుడు పాపమునకు విరోధముగా నుండును

తుఫానుచే భయంకరముగా కొట్టుకొనుచు 2వారములు గడుపుచుండగా ఓడ చివరికి తీరము చేరగలిగినది (అపొస్తలుల కార్యములు 27:27-28). దాని భావము నీటిమట్టము తక్కువైనది. ఓడ చేరుచుండగా

రాళ్లు తగులుట. ఓడ బ్రద్దలగుట ఎక్కువైనది (అపొస్తలుల కార్యములు 27:29). ప్రయాణీకులు అట్టి స్థితిలో తీరము వరకు ఈదలేకపోయిరి.

ఉదయకాంతి కొరకు వేచియున్నపుడు ప్రయాణీకులలో కొందరు చిన్న పడవలలో తీరము చేరుటకు ప్రయత్నించిరి. వీరు లేని కొరత మరుసటి దినమున ఓడలో వీరి సహాయమును లేకుండ చేసెను. పౌలు వారిని గమనించి యూలికి చెప్పి వారిని పోకుండ చేసి, మునిగి పోకుండనట్లు చేసెను.

ఈ సమయము నందు పౌలు వ్యక్తిత్వము గౌరవించబడెను. మరియు నమ్మబడెను. యూలి పౌలు చెప్పిన మాటలకు విధేయుడాయెను (అపొస్తలుల కార్యములు 27:32). అందరును పౌలును వెంబడించిరి. బిరుదును పొందుటతో ఒకరు నాయకుడని గుర్తింబడడు. రోమాలో ఘోరమగు భయంకరమగు మరణము పొందనైయున్న ఖైదీయైన పౌలు తప్పించుకొనునట్లు ప్రయత్నించి యుండవచ్చును. దానికి బదులుగా యెవరైనను తప్పించుకొనకుండ చేసి తన గుంపు యొక్క మంచితనము కొరకే చేసెను. గమనించవలసిన విషయము ఉన్నది. తోటి ప్రయాణీకులతో పౌలు తానే వ్యవహరించలేదు. అధికారియైన యూలితోనే సంప్రదించెను. ఆజ్ఞానుసారముగానే చేసెను. అధికారి ద్వారానే సమస్తము చేయవలెను. కుటుంబములో తండ్రి, ప్రభుత్వములో అధికారి వ్యాపారములో అధికారి. అదే విధముగా ఇతరుల సంఘములోగాని, పరిచర్యలోగాని పాలుపంపులు పొందుట సత్యమై యున్నది.

పాపమునకు విరోధముగా ధైర్యముతో నిలబడగలవా? పాపము

చేసిన వ్యక్తిని ముందుగా వ్యక్తిగతముగా హెచ్చరించి ప్రేమతోనే అతడు సరిచేయబడునట్లు సహాయము చేసెదవా? ఒకరిని సవరించుటకు అధికారి ద్వారా సరిచేయగలవా? పాపమును చూపునపుడు యితరులు విమర్శించుచున్నను అట్లు చూపగలవా?

## 6. దైవభక్తిగల నాయకుడు మంచిమాదిరిని చూపును

మరుసటి దినమున ఎక్కువ బాధపడుదురని తలంచి పౌలు అందరిని భుజించుమని ప్రోత్సహించి బలము పొందుడని చెప్పెను (అపొస్తలుల కార్యములు 27:33,34). తానే ముందు భుజించుచు ప్రారంభించగా అందరును భుజించిరి (అపొస్తలుల కార్యములు 27:35,36).

మన పరిచర్యలో నాయకులముగాను, కుటుంబములో పెద్దగా నున్నందున మనము మంచి మాదిరియై యుండవలెను. మనము ప్రారంభించకనే వారిని దేనిని చేయుమని చెప్పకూడదు. ఎందరో మనలను గమనించుచున్నారు. అవిశ్వాసుల యెడల మాదిరియై యుండవలెను. విశ్వాసుల యెడల ఒక స్థాయిగా నుండవలెను. మాదిరియై యుండుట వలన యేసుకొరకు ఎట్లు జీవించవలెనో నేర్పుదుము. మనము చేయని దానిని యితరులు చేయునట్లు చెప్పకూడదు.

ఎటువంటి మాదిరిని నీ పిల్లలకు చూపుచున్నావు? ఇతరుల యెడల ఎట్టి మాదిరిని చూపుచున్నావు? ఎవరి మాదిరిని నీవు పాటించుచున్నావు? ఎందుకు?

## 7. దైవభక్తిగల నాయకుడు పరిచర్య చేయునట్లు ఎటువంటి తరుణమునైనను వాడును.

మరుసటి దినము పౌలు చెప్పిన రీతిగా రానే వచ్చినది. ఓడ

తీరమునకు దగ్గరగా వచ్చుచుండెను. బ్రద్దలగుచుండెను మరియు మునిగిపోవు చుండెను. కాని అందరును చెక్కపలకలపై ఓడ నుండి వెళ్లి తీరము చేరిరి (అపొస్తలుల కార్యములు 27:37-41). ఓడను విడిచి వెళ్లుటకు ముందు ఖైదీలను చంపునట్లు సైనికులు ప్రయత్నించిరి. ఎందుకనగా ఎవరైనను తప్పించుకొనిన యెడల సైనికులే మరణ శిక్షణ ననుభవించెదరు. కాని పౌలు యెడల గౌరవము చూపుచున్నందున మరియు యూలి యేర్పాటును నిలిపి వేయునట్లు పౌలు చేసి యున్నందున (అపొస్తలుల కార్యములు 27:37-40) అట్లు చేయలేదు. అందరును తప్పించు కొనిరి (అపొస్తలుల కార్యములు 27:41). ఇంకను కథ పూర్తి కాలేదు.

తీరము చేరుటలో నిప్పు రాజబెట్టి చలి కాచుకొనుచుండిరి. ఒక విషముతో కూడిన పాము చెక్కలందుండి వచ్చి పౌలును కరచెను. పౌలుపై తీర్పుపడినదని కొందరు తలంచిరి. ఎందుకనగా సముద్రములో అతడు మునిగిపోలేదు. అయినను పాము కాటువలన ఎటువంటి నష్టము కలుగలేదు (అపొస్తలుల కార్యములు 28:1-6) మరియు ప్రజలు ఎంతో మెచ్చుకొనిరి.

ఆ ద్వీపపు నాయకుడు అతని గృహమునకు వారి నాహ్వానించెను. అతని తండ్రి రోగియై యుండెను. పౌలు ప్రార్థించగా అతడు స్వస్థత బొందెను. ఆ ద్వీపవాసులు రోగము గల వారందరును వచ్చిరి. అందరి కొరకు పౌలు ప్రార్థించెను. అందరును స్వస్థత బొందిరి. ప్రతి యొక్కరి కొరకు పౌలు పరిచర్య చేసెను. సువార్తను ప్రకటించెను. అతిథులందరిని

ద్వీపనివాసులు పోషించిరి. వారు తిరిగి వెళ్లువరకు ఆతిథ్యము నిచ్చిరి (అపొస్తలుల కార్యములు 28:6:7-10).

తడిసియుండి, అలసట జెంది, ఆకలిగొని, పాముకాటు పడియుండినను పౌలు అవసరతలోనున్న యొకరికి ప్రార్థించుటకు తరుణము పొందెను. దాని ఫలితముగా దేవుడు ద్వీపవాసులకు వాక్యపరిచర్య చేయగలిగెను. పౌలు జీవితములో యిటువంటి తరుణములుండినట్లు యెరిగియున్నాము. తరుణము కొరకు ఎదురు చూచుచు పరిచర్య చేయుచుండెను. మనమును క్రియద్వారా మాటద్వారా అట్లు చేయునట్లు దేవుడు కోరుచున్నాడు (1 పేతురు 3:15).

నీవు ఎల్లప్పుడు యితరులకు పరిచర్య చేయుటకు సిద్ధపడి యిష్టముతో చేయుచున్నావా? నీకు సమయము లేదనుకొనుచు నిర్లక్షత చూపుచున్నావా? నీవు కొందరి కొరకు ప్రార్థించుచున్నావని చెప్పి నిజముగా ప్రార్థించుచున్నావా? దేవుని కొరకు పరిచర్య చేయు తరుణముల కొరకు దేవుని ప్రార్థించుచున్నావా? వాటి కొరకు కనిపెట్టుకొనుచున్నావా? లేక నీ యేర్పాటు ప్రకారము పనిచేసికొనుచు యితరుల మరియు పొరుగువారి అక్కరలను గమనించక యున్నావా?

పౌలు జీవితమునందు యిది ఒక ఘట్టమే. అతని జీవితములోను పరిచర్య లోను అదనముగా యింకను ఎన్నియో ఉన్నవి. నాయకత్వమును గూర్చి యిది మంచి మాదిరిగా యున్నది. క్లిష్టపరిస్థితులుండినవి. అవి మనము వెంబడించుటకు మాదిరి గలవి.

పౌలు జీవితములో చూచినదేమనగా దైవభక్తిగల నాయకుడై

యుండుటకు మనము :

1. నమ్మకత్వము కలిగి యుండవలెను.

2. నడిపించుట ప్రారంభించవలెను.

3. కష్ట సమయములందు ధైర్యము కలిగియుండవలెను.

4. ఇతరులను ప్రోత్సహించవలెను.

5. పాపము నెదిరించవలెను, వ్యతిరేకించవలెను.

6. మంచి మాదిరిని చూపవలెను.

7. పరిచర్యచేయుటకు ఎటువంటి తరుణమునైనను వాడుకొనవలెను.

ఇవన్నియు నీలోనున్నవా? ఏవేవి ఉన్నవి? ఏవి లేవు? వాటిని పొందుట కేమి చేయుదువు? వీటి విషయమై ప్రార్థించుచు సహాయము చేయుమని దేవుని అడుగుము.

# 10. మహిళల జీవితముల నుండి నాయకత్వ పాఠములు



నాయకులై యుండిన పురుషుల జీవితముల నుండి బైబిలు నుండి ప్రాముఖ్యమైన పాఠములను నేర్చు కొంటిమి. అయినను పురుషులు మాత్రమే నాయకులై యుండలేదు. మహిళలు కూడా నాయకులై యుండిరి. సంఘకాపరులుగా మహిళలు ఉండ కూడదు (1 తిమోతి 2:9-15; 3:2-5), కాని పరిచర్యలో వారు నాయకు రాండ్రుగా నుండుటకెన్నో అవకాశము లున్నవి: ఇతర మహిళలను, చిన్న బిడ్డలను నడిపించుట, భర్త పరిచర్యలో, సంఘకాపరి పరిచర్యలో సహాయము చేయగలరు. సంఘములోని మహిళలకు వారి అవసరత యందు సహాయపడుట, వారి మధ్య సువార్త సేవను, వారిని శిష్యురాండ్రుగా చేయుట యందు సహాయపడుచుండవలెను. మహిళల విషయమును మహిళలనే అడిగి తెలిసికొనవలెను. దైవభక్తి యందు యెదిగిన మహిళల నుండి పురుషులు సలహా లందుకొనవచ్చును. పురుషులు చేయగల ఆత్మీయ కార్యములను

మహిళలు కూడ చేయగలరు. కాని వారు పురుషులపై అధికారమును కోరకూడదు (1 తిమోతి 2:9-15).

పురుషుల జీవితముల నుండి యిప్పటి వరకు నేర్చుకొనిన పాఠములు మహిళల నుండి నేర్చుకొనగలము. బైబిలులోని మహిళల నాయకత్వమును పురుషులు కూడ పాటించవచ్చును. కాబట్టి పురుషులు ఈ అధ్యాయమును మహిళలకు సంబంధించి యున్నదని తలంచి దాటిపోకూడదు.

బైబిలులోని కొందరు మహిళలు ప్రాముఖ్యమగు పాత్ర వహించినవారు తమ జీవితము లందు చేసిన పరిచర్యను చూడగలము.

## 1. దైవభక్తిగల నాయకురాలు సాతానునిచే మోసగింపబడగలదు

హవ్వ సృజింపబడుటతోనే ఏదేను తోటలో సాతానుడు ఆమెను శోధించెను. ఆమె ఏ రీతిగా నాయకురాలిగా పిలువబడుచున్నదోయను ప్రశ్న రాక తప్పదు. సాక్షాత్తు ఆమె ఆదాముపై తన ప్రభావమును చూపెను. అందువలననే సాతానుడు మొదటిగా ఆమెనే శోధించెను. కాబట్టి హవ్వ ఆదామును మార్చివేసి ఆయనపై దొరతనము చేసినది (ఆదికాండము 3). ఆదాము ఒక నాయకునిగా నుండవలసిన భర్తగా లేకుండెను. అతడు ఆమెతో నుండియు ఆమె సాతాను శోధనలో పడిపోకుండ చేయలేదు (ఆదికాండము 3:6). ఇరువురిలో ఎవరికి ఎక్కువ ప్రభావము ఉన్నదో సాతానుడు ఎరిగియున్నందున ఆ వ్యక్తినే శోధించెను. హవ్వ మంచిది చేయుచున్నానని తలంచునట్లు మోసగించబడెను (1 తిమోతి 2:14). ఆదామునకే బాగుగా తెలియును. సాతానుడు ఒకేసారి యిరువురుని మోసగించెను.

మనము జాగ్రత్త గలిగి యుండవలెను. సాతానుడు మనలను కూడ శోధించును. కొన్నిసార్లు ఒక సింహము వలె వచ్చి పైన పడును (1 పేతురు 5:8). కాని సాధారణముగా వాడు అబద్ధములను, మోసములను వాడుచుండును (యోహాను 8:44). ఆదాముతో చేసిన రీతిగా మన స్వంతవారితోనే వాని పని ప్రారంభించును. నాయకులు జాగ్రత్త గలిగి యుండవలెను. వారి స్వంత వారి ద్వారా సాతానుని ప్రభావము వలన మోసగించబడుదురు.

నీవు సాతానునిచే మోసగించబడలేవనియు, స్వంతవారి ద్వారా కూడా అట్లు జరుగకుండ చూచుకొనగలవని తలంచుకొనుచున్నావా? అట్లు తలంచిన యెడల గొప్ప ఆపదలోనే పడుచున్నావు. నీ మిత్రులెవరైనను సులభముగా నిన్ను మోసగించెదరా? ఎప్పుడు మోసగించబడితివి? ఒక అబద్ధమును విని దానినెప్పుడైన ప్రయోగించితివా? సాతానుని మోసములనుండి నిన్ను నీవు భద్రపరచుకొనుటకు నీవేవి చేయగలవు?

## 2. దైవభక్తిగల నాయకురాలు యితరులకు ధారాళత చూపును.

ఆదికాండము 24వ అధ్యాయమునందు అబ్రహాము యొక్క దాసుడు ఒక వధువును ఇస్సాకునకు వెదకుటకు వెళ్లెను. రిబ్కా అతని దాహమునకు నీరు, ఒంటెలకు కూడ యిచ్చినందున ఆమె ఎంపిక చేయబడెను. అడుగుటతో నాయకులు యిచ్చుచుందురు. ఇతరుల కిచ్చుటయందు మనము నిజముగా యేసునకే యిచ్చుచున్నాము. వారికేమి చేయుదుమో యది ఆయనకే చేయుచున్నాము (మత్తయి 25:34-40). దైవభక్తిగల

నాయకులు వారి అవసరతలకు ముందుగా యితరుల అవసరతలను పెట్టుదురు. ఒంటెలకు బావిలోని నీటిని చేది వాటికి పెట్టుట బహు కష్టమైన పని. అయినను రిబ్కా తన యిష్టముతో అట్లు చేసెను. అబ్రహాము దాసుడెవరో కూడా తెలియదు. రిబ్కా వలెనే యొక భక్తి గల నాయకుడు యితరులకు యిష్టముతో సహాయము చేయును.

ఇతరులకు సహాయము చేయుటలో నీవు త్వరపడుచున్నావా? నీకు తెలియని వ్యక్తికి త్యాగపూరితముగా కష్టముగా నున్నదానిని చేసి సహాయపడుచున్నావా? నీవు చేయు దానినెవరు చూడకపోయినను మంచి కార్యమును చేయుదువా? ఇట్టిది నీ కుటుంబములో ప్రారంభమగుచున్నది. ఇష్టపూర్వకముగా యితరులకు సహాయము చేయుదువా?

### 3. దైవభక్తిగల నాయకురాలు వేషధారణను ఎదిరించును.

తామారు అను ఒక స్త్రీ యెడల తన కుటుంబము తప్పు చేసెను. తన మామ ఆమె విషయము నేమాత్రము పట్టించుకొనలేదు. తన కుమారుని మరణానంతరము అతడు ఆమెను గూర్చిన శ్రద్ధ వహించి యుండవలెను (ఆదికాండము 38). తనకు చెందవలసిన భాగమును పొందుటకు తీర్మానించు కొనెను. ఆమె చేసిన కార్యమును బట్టి ఆమె బహుగా నిందించబడెను. అప్పుడు అసలు పాపము చేసిన వ్యక్తిని సూచించెను – ఆమె మామయే. ఆయన పేరు యూదా. అతడును యథార్థపరుడైనందున తన తప్పిదము నొప్పుకొనెను. వేషధారణను చూపు ధైర్యమును తామారు పొంది యుండెను. నాయకులుగా నుండు మనము వేషధారణ నెదిరించవలసినదే. అట్లు చేయుటకు ధైర్యము కావలెను.

ప్రజలు యూదా ఒప్పుకొనిన రీతిగా ఒప్పుకొనరు. అయినను దాని నిర్లక్ష్యపరచిన యెడల వేషధారులు వారి వేషధారణ జీవితములో కొనసాగునట్లు చేయుదుము. వారి పాపము కప్పిపెట్టబడుచున్నది. దాని విషయములో అందరును నేరస్థులై యుందురు.

ఒక వేషధారికి తన విషయము చెప్పు ధైర్యము నీకు ఉన్నదా? ఏమి జరిగెను? అట్లు హెచ్చరించుటకు భయము కలిగి యుండినదా? ఒకరికి చెప్పునట్లు వేషధారణలో నుండు వ్యక్తికి చెప్పగలవా? దానిని చేయుటలో ఎప్పుడు ఎలాగున చేయాలో తీర్పు తీర్చునట్లు కాక ప్రేమతో సంప్రదించవలెను (ఎఫెసి 4:15).

## 4. దైవభక్తిగల నాయకురాలు నిస్సహాయతను భద్రపరుచును.

మిర్యాము ఇశ్రాయేలీయుల మహిళల యొక్క గొప్ప నాయకురాలిగా పేరు గాంచినది (నిర్గమకాండము 15:20-21). అప్పటికి ఆమె యొక బాలికయే. ఐగుప్తు దేశములోని మగపిల్లలు చంపబడబోవుచుండగా, ఆమె తన తమ్ముడు మోషేను భద్రపరచుట కొరకు తానే ఆపద నెదుర్కొనెను (నిర్గమకాండము 2 అధ్యాయము). ఆమెను బట్టి, మోషే తప్పించబడి మరణించలేదు. అతడు గొప్ప నాయకుడై ఐగుప్తీయుల బంధకము నుండి యూదులను విడిపించెను. ఇదంతయును మిర్యాము యొక్క సహాయము వలననే జరిగియుండెను. నాయకులు నిస్సహాయకులను భద్రపరచువారు. అన్నివేళల యది సులభము కానేరదు. అట్లు చేయునపుడు వ్యతిరేకత కలుగుచున్నది. యేసు నిస్సహాయకుల నెందరినో భద్రపరచి యున్నాడు (యోహాను 8:1-11). మనమును అట్లు చేసిన యెడల ఆయన వలె

నుందుము. అట్లు చేయుటతో ఒక మాదిరిని చూపుదుము. ఇతరుల యెడల జాలి మరియు కనికరము చూపుటయు ప్రారంభమగుచున్నవి.

ఒకరి బాధయందు భద్రపరచుటకు యిష్టపడుదువా? ఒకరిని భద్రపరచి నందులకు విమర్శించబడినపుడు అంగీకరించుదువా? జగడమాడు వారి యెడల భయము ఉన్నదా?

**5. దైవభక్తిగల నాయకురాలు తనను వెంబడించు వారిని ప్రోత్సహించును.**

దెబోరా మహిళలలో నుండి న్యాయాధిపతులలో ఒకరు. పేరుగాంచిన న్యాయాధిపతి. పురుషులలో పరిచర్య చేయువారు లేకుండిరి. కాబట్టి దేవుడు ఆమెను వాడుకొనెను. యుద్ధములో పోరాడలేదు కాని ఆమె పోరాడు సైనికులను ప్రోత్సహించినది. జయము వారిదేనని నమ్మిక నిచ్చినది (న్యాయాధిపతులు 4వ అధ్యాయము). దైవభక్తి గల నాయకులు సంతోషభరితులు. వారు ప్రోత్సహించుదురు. పురికొల్పుదురు. వెంబడించువారిని ఉత్తేజపరుచుదురు.

ఇతరులను ప్రోత్సహించుటకు నీవు కష్టపడగలవా? వారెదుర్కొను వాటిని గూర్చి వారికి చెప్పగలవా? భారముతో బాధపడువారిని విమర్శించక వారికి సహాయము చేయుదువా?

**6. దైవభక్తిగల నాయకురాలు ధైర్యము గలది.**

ఎస్తేరు గ్రంథములోని ఎస్తేరు ఇశ్రాయేలు వంశస్థురాలు. రాజునకు ఒక భార్యయైనది. హామాను అనువాడు యూదులను వ్యతిరేకించువాడు. వారిని చంపదలచెను. వాని తలంపు కొనసాగియుండవచ్చును కాని ఎస్తేరు

యొక్క ధైర్యము వలన వాని తలంపు రాజునకు తెలియపరచబడెను. రాజు ఆహ్వానము లేకుండ ఆయన భవనములో ప్రవేశము నిషేధింపబడెను. అట్లు చేసిన వారికి మరణశిక్షయే. అయినను ధైర్యముతో మరణము నెదుర్కొనినను సరే యనుకొని వెళ్లెను. దేవుడు ఆమెతో నుండెను. తన ప్రజలకు మంచికార్యము చేయుట కిష్టపడెను. ఎస్తేరు యూదురాలు అని ఎవరికిని తెలియదు. కాని భయపడలేదు. నాయకులు ఎటువంటి పరిస్థితినైనను ఎదుర్కొనుటకు ధైర్యము కలిగియుండవలెను. సరియైన దానిని చేయకుండునట్లు భయము ఆటంకపరచకూడదు. ధైర్యము కలిగి యుండవలెను.

ఇతరుల కొరకు సరియైన దాని చేయుటకు ధైర్యము ఉన్నదా? ఇతరులు ఏమి అనుకొందురో అను భయము ఉన్నదా? భయము నెట్లు జయించగలవు?

## 7. దైవభక్తిగల నాయకురాలు మిత్రుల యెడల రాజభక్తి గలిగి యుండును.

క్రైస్తవులకు రాజభక్తి గలిగియుండుట ప్రాముఖ్యము. మిత్రులు బాధపడు చుండగా వారిని ఓదార్చ వలెను. మన విషయములో యేసు అట్లే చేసెను. రాజభక్తి కలిగి యుండవలెను. ఖర్చు ఉన్నది. త్యాగము కూడ చేయవలెను. ఏది ఏమైనను రాజభక్తి కలిగియుండవలెను. తన స్వదేశములోని కుటుంబమును, కాబోవు వివాహమును వదలుకొని అత్త విషయమైన శ్రద్ధ తీసికొనునట్లు విదేశమునకు వెళ్లెను (రూతు 1 అధ్యాయము). రూతు చెప్పిన దేమనగా “నీవు వెళ్లు స్థలమునకు నేను

వెళ్లెదను. నీవు ఎక్కడ ఉందువో అక్కడనే నేనుందును. నీ ప్రజలే నా ప్రజలు, నీ దేవుడే నా దేవుడు" (రూతు 16-18). దైవభక్తిగల నాయకురాలు వారి మిత్రుల యెడల రాజభక్తి గలిగి యుండవలెను. ఎందరో మిత్రులు సహాయపడి యుందురు. నీకు రాజభక్తియున్నదని నీ మిత్రులు చెప్పగలరా? ఇది వరకు నీకు సహాయము చేసిన వారికి నీ విప్పుడు సహాయము చేయగలవా? నీ మిత్రుల కొరకు త్యాగము చేయగలవా? వారు నీకు సహాయము చేయలేనపుడు కూడా చేయగలవా?

## 8. దైవభక్తిగల నాయకురాలు ప్రాముఖ్యమైనదానిని చేయలేనంతటి సమయము లేనిదై యుండదు.

యేసు యొక్క మిత్రులు మరియ మరియు మార్త (లూకా 10). వారి గృహమును యేసు దర్శించుచుండెను. ఒకసారి మార్త భోజనము సిద్ధపరచు పనిలో నుండగా మరియ యేసునొద్ద కూర్చుండి యేసుతో సంభాషించు చుండెను. మార్త యేసుకొరకు భోజనము సిద్ధపరచుచుండెను. కాని యేసునొద్ద లేకుండెను. ఈ కథ నుండి నేర్చుకొనునదేమనగా మన సమయము నేర్పరచుకొనుట యందు ప్రధానమైనవాటిని ముందు పెట్టుకొనవలెను. మంచివాటిని చేయుచు శ్రేష్ఠమైన వాటిని విడిచిపెట్టుదుము. యేసుతో సమయము గడుపక, యితరులకు సహాయపడుట యందు మార్తవలెనే యుందుము. దైవభక్తిగల నాయకులు ఏది ప్రాముఖ్యమైనదో వారు గ్రహించగలరు.

నీ వ్యక్తిగత జీవితము నందు ప్రార్థించుట, వాక్యము పఠించుటయను విలువైన సమయమును గడుపుటకు వీలు లేనంతటి రీతిగాయున్నావా?

సంఘ పరిచర్యను బట్టి కుటుంబమునకు సమయము నీయలేకయున్నావా? అనుకోని పరిస్థితులలో నీ ప్రణాళిక మార్చుకొనగలవా?

## 9. దైవభక్తిగల నాయకురాలు ప్రేమతో తప్పిదమును సరిదిద్దును.

ఈ అధ్యాయము నందు చివరి మహిళ ప్రిస్కిల్ల. ఈమె ఆదిమ సంఘము నందు తలాంతుగల ఉపాధ్యాయురాలు మరియు రచయిత్రి. ఆమె తన భర్తయైన అకుల అధికారము నందు పరిచర్య చేసినది. వారి సంఘమునందు పేరుగాంచిన ప్రసంగీకుడు. అపొల్లొ మాట్లాడినపుడు అతడు ఏదోయొక ప్రాముఖ్య విషయమును మరచిపోయినట్లు గ్రహించెను. ఆమె తన భర్త సమక్షము నందు అపొల్లోను ఒక ప్రక్కకు పిలిచి, దేవుని మార్గమును బహువిశదముగా వివరించెను (అపొస్తలుల కార్యములు 18). బహిరంగముగా ఆమె చెప్పకుండెను. ఎంతో జాగ్రత్తతో అంశమును దాని సత్యమును అతనికి తెలియజేసెను. ఆయన నేమియు బాధపరచలేదు. అతనికి సహాయపడినది. సత్యమును ప్రేమతో, మృదువుగా చెప్పెను (ఎఫెసి 4:15). నీవిట్లు చేయవలెననగా అసలైన సూచనను జ్ఞాపకము చేసికొని జాగ్రత్తగా బాధపరచక చెప్పవలెను (మత్తయి 7:12).

మృదువుగా నీవు ఒక తప్పిదమును సరిచేయుటకు ప్రయత్నించగలవా? ఆ రీతిగా సరిదిద్దుటకు ఎవరైనను ఉన్నారా? అసలైన సూచనను జ్ఞాపకము చేసికొని ఏ రీతిగా చేయగలవు? మరొకరు నిన్ను ఈ రీతిగా సవరించునపుడు నీ జవాబు ఎట్లుండును? వినయముతో వినుచు నేర్చుకొందువా లేక కోపము తెచ్చుకొందువా?

బైబిలు నందు మరింకను ఎందరో గొప్ప మహిళలున్నారు. వారి

నుండియు ఎంతో నేర్చుకొనవచ్చును. వారిని గూర్చి నీవే చదువుకొని వారి జీవితముల నుండియు పాఠములు నేర్చుకొనుము. ఈ మహిళల జీవితముల నుండి దైవభక్తి గల నాయకురాలగుటకు మనము :

1. సాతానునిచే మోసగించబడుదుమనియు (హవ్వ)

2. ఇతరుల యెడల ధారాళముగా నుండవలెననియు (రిబ్కా)

3. వేషధారణ నెదుర్కొనవలెననియు (తామారు)

4. సహాయము కావలసినవారికి సహాయపడవలెననియు (మిర్యాము)

5. వెంబడించువారిని ప్రోత్సహించవలెననియు (దెబోరా)

6. ధైర్యమును కలిగియుండవలెననియు (ఎస్తేరు)

7. మిత్రుల యెడల రాజభక్తి కలిగియుండవలెననియు (రూతు)

8. ముందు చేయవలసిన వాటిని ముందుగానే చేయవలెననియు (మార్త) నేర్చుకొంటిమి. ఇవన్నియు నీలో నున్నవా? ఏవి ఉన్నవి? ఏవి లేవు? లేని వాటిని పొందుటకేమి చేయుదువు? వీటిని గూర్చి ప్రార్థించుచు వీటిని పొందుటకు దేవుని సహాయము కోరుము.

9. ప్రేమతో తప్పిదమును సరిదిద్దును (ప్రిస్కిల్ల).

# 11. రచయిత జీవితము నుండి నాయకత్వ పాఠములు

నా జీవితములో నేర్చు కొనిన పాఠముల తాత్పర్యమును ఒక అధ్యాయముగా కలుపునట్లు నిర్ణయించితిని. నా పరిచర్య దాదాపుగా 50 సంవత్సరములు. వాటిలో 40 సంవత్సరములు సంఘకాపరిగా నుంటిని. ఈ పరిచర్యలో ఉత్తీర్ణుడనైతినని చెప్పుటలేదు కాని దేవుడు నాతో బహు ఓపికతో పనిచేయు చున్నట్లు ఎరిగితిని. దాని గూర్చి సాక్ష్యమిచ్చుచున్నాను. నీ జీవితమందును అదేరీతిగా దేవుడు చేయగలడు.

**1. దైవభక్తిగల నాయకుడు అతడు దేవుని కవసరము లేదనియు, దేవుడే అతని కవసరమని తెలిసికొనియున్నాడు.**

మొదటిగా మీతో పంచుకొనవలసిన విషయమేదనగా నేను దేవునికి అవసరము లేకుంటిననియే. కాని నాకే దేవుడు అత్యవసరము. ఈ సత్యములోని లోతైన అర్థమును గ్రహించుటకు చాల సమయము తీసికొనుచున్నది.

నేను పరిచర్యను ప్రారంభించినపుడు దేవుని కొరకు నా వరములు, తలాంతలు ఎంతో గంభీరముగా వాడుకొనగలనని తలంచుకొంటిని. సాధించవలసినవి ఎన్నో ఉన్నవని తెలిసికొంటిని. "దేవుని నుండి గొప్ప విషయముల కొరకు కనిపెట్టు కొనుచుంటిని. దేవుని కొరకు గొప్ప కార్యములు చేయునట్లు" తలంచితిని. ఈ కోరికలను నెరవేర్చుకొనుటకు

దేవుని సహాయమెంతో అవసరమని యెరిగితిని. వాటిని నెరవేర్చుట యందు దేవుని సహాయము ఉండదని ఏ మాత్రము సందేహించ లేదు. పెద్దవాడగుచుండగా నేనేమియు అనుగ్రహించలేనని స్పష్టముగా చూడగలిగితిని. అది ఒక బృందముతో కలిసి పనిచేయుట. అది కేవలము దేవుని కృపాకనికరములే. ఒక్కొక్కసారి అన్నింటిని నిజముగా యిది నా గురించి కాదు. ఇదంతయు దేవుని గూర్చియే. నిదానముగాను, ఖచ్చితముగాను, ఆత్మీయముగా యెదుగుచున్నపుడు దేవుడు గొప్పవాడుగాను, మరియింకను గొప్పవాడుగా నుండుట కనుగొంటిని. నేను చిన్నవానిగాను, మరి యింకను చిన్నవానిగా మారిపోవుట గమనించితిని. అది తప్పుడు తలంపు కాదు. పరిచర్యలో ఎక్కువైన వాటిని చేయుటకొరకు పరుగెత్తుచుండగా, దేవుడు గుణము నందు ఆసక్తి గలిగియున్నాడు. నిరుత్సాహపడుచుండగా దేవుడు ఏదో నాలో చేయుచు ప్రోత్సాహము నిచ్చుచు కొనసాగింపజేయుచున్నాడు.

దేవుని దేవునిగా యెంచుటతో నిజమగు శాంతి దొరుకుచున్నది. మరియు దేవునికి నేను అనవసరమని గ్రహించుటతోను, ఆయన రాజ్యమును భూలోకము నందు జరిగించుచుండగా నేను అనవసరమనియు, దేవుడు లేకుండ నేనేమియు చేయలేనని గ్రహించుటలో నేను అనవసరమని తెలిసికొంటిని. అప్పటి నుండియే దేవుడేమి చేయుచున్నాడో అని ఆలకించుట ప్రారంభించితిని. ఆయన నుండి మనవులను కోరుట తగ్గించితిని. నేనేమి చేయవలెనని ఆయన కోరుచున్నాడో యని దేవుని అడుగుట ప్రారంభించితిని. నా తలంపులను, యేర్పాటులను ప్రక్కన పెట్టితిని. దేవుడు నన్ను వాడుకొనుచు ఎందరి

జీవితములోనే తాకుటకును, నేను తలంచని విధములుగా చేసెనని కనుగొంటిని. నా కర్తవ్యము నా ప్రజలకు సేవ చేయుటయే. నేను దేవుని చిత్తములో నుండగలిగిన యెడల శాంతిని అనుభవించ గలనని నేర్చుకొంటిని. నా పరిచర్యలోని ఫలితమును దేవుడే తెచ్చుచున్నాడు. విజయమును దేవుడు సంఖ్యతో (ప్రజలు, ధనము, సంపదలు మొదలగునవి) లెక్కించుకొనడు. కాని యథార్థతనే చూచుచున్నాడు. అందునుబట్టి దేవుడు కోరిన దానినే చేయునట్లు ఎక్కువ సమయమును గడుపుచున్నాను (గలతీ 2:20; రోమా 12:1-2).

తన కృపను, సహాయమును నీ జీవితములో ఇయ్యకుండిన యెడల అది ఎట్లుండును? నీ స్వంతంగా దేవుని కొరకేమి చేయగలవు? నీవే సమస్తము చేయుటకు ఎన్నిసార్లు ప్రయత్నము చేసితివి? ప్రతి వాటికి దేవుడే కారణమని దేవునికే ఘనత నిచ్చుట నీ జీవితము నందు సాధారణమైనదా?

## 2. దైవభక్తిగల నాయకుడు ఎంతగా యెదుగుచున్నను, మరి యింకను యెదుగుచుండవలెనని తెలిసికొనుచున్నాడు.

సంవత్సరముల నుండి ఆత్మీయముగా యెదుగుచుండుట వలన దేవుని గుర్తింపును గ్రహించి ఆ జ్ఞానము నందు యెదిగియున్నాను. క్రీస్తును పోలియుండుట అను గురికి దగ్గరగా యుండుటకు బదులుగా నేను దూరముగానే యున్నానని గ్రహించితిని. క్రీస్తు యొక్క పవిత్రతను చేరలేని భాగములు నా జీవితములో నున్నట్లు తెలిసికొంటిని. బలహీనతలోని ఒక భాగమును జయించుటతో యింకను ఐదు భాగములున్నట్లు నేను

కనుగొంటిని. ఎంతగా యెదుగుచున్నను యింకను యెదుగుచుండుట అవసరమని తెలిసికొంటిని. గొప్ప దేవుడు నా హృదయముగా నున్నాడు. దేవునికిని నాకును మధ్య గల దూరము తగ్గిపోవుచున్నది. దేవుడు నా మనస్సు నాక్రమించినట్లున్నది.

అపొస్తలుడు పౌలు కూడ యిట్టి అనుభవమును పొందినట్లు చదువుట నాకు ప్రోత్సాహకరమైనది. అతని ప్రారంభ పరిచర్య యందు అతడు అపొస్తలులందరిలో తక్కువ వాడని చెప్పెను. తదుపరి విశ్వాసులందరిలోనూ తక్కువవాడని చెప్పెను. చివరిగా ప్రజలందరిలో తక్కువ వానిగా యెంచుకొనెను.

ఇట్టిది జరుగుట ఖాయము. ఎంత ఎక్కువగా యెదుగుచున్నను యింకను యెదుగుచుండవలెనని యెరుగుదుము.

నా జీవితపు మిగిలిన సంవత్సరములు కొరకు కనిపెట్టుకొనియున్నాను. నాలో దేవుడు తన పనిని కొనసాగించునని తెలిసికొని యున్నాను. వెనుక జీవితమును పరీక్షించుకొనగా దేవుడు నాలో ఏ భాగము నందు మార్పును తెచ్చి యుండెనో తెలిసికొంటిని. అదేరీతిగా దేవుడు నాలో పనిచేయునని తలంచు చున్నాను. దేవుడు శిల్పి, నేను శిల్పము. అనవసరమైన వాటిని తీసివేసి మెరుగుపరచును. సుత్తె మరియు ఉలి తీసికొని సరిచేయును. నీ జీవిత మందును దేవుడు అట్లు చేయుచున్నాడని చూచుచున్నావా? దాని గూర్చి యోచించుము. దేవుని కార్యమును చూడగలవు. దేవుడు శిల్పకారులలో అగ్రగణ్యుడు. తన కుమారుని రూపమును నీలో తెచ్చుటకు ప్రయత్నించుచున్నాడు. కొన్నిసార్లు

ఆయన చేయు పని మనకు కష్టమని కనబడును. కాని అది ముగించబడుటతో దాని విలువ కనబడుచున్నది (ఫిలిప్పి 1:6; రోమా 7:14-19).

గత సంవత్సరము నందు ఎక్కువగా ఏ రీతిగా ఆత్మీయతలో యెదిగి యున్నావు? ఎట్లు? ప్రస్తుతము దేవుడు నీలో ఏ రీతిగా పనిచేయుచున్నాడు? ఎట్లు యెదుగునట్లు చేయుచున్నాడు?

**3. దైవభక్తిగల నాయకుడు దేవుడే తన మొదటిగురియని ఆయనతో సన్నిహితముగా నుండును**

సన్నిహితముగా నుండుట సాధారణముగా వచ్చునది కాదు. నా పని వెనుకనే యది దాగుకొని యుండును. నేను ఎల్లప్పుడు దేవుని లోతుగా యెరుగవలెనని కోరువాడను. ఆయనకు సంబంధించియే యుండునట్లు కోరుచుంటిని. నా పరిచర్య ప్రారంభము నందే అట్లు తలంచియుంటిని. ఫిలిప్పి 3:7-14 వాక్య భాగములోని "యెరుగుట" నా హృదయములో నాటుకొనెను. ఆయనను గూర్చి యెరుగుట కాక ఆయననే యెరుగుట! నా వెనుకటి జీవితమును పరీక్షించుకొను నపుడు దానినే దేవుడు నిదానముగా, ఖచ్చితముగా తెచ్చుచున్నట్లు గ్రహించితిని. సన్నిహిత స్థితిని నా భార్యబిడ్డల నుండి చూడగలిగితిని. అది సమయమును తీసికొనునది. దేవునితో నుండవలసిన సమయము కూడ అంతే.

"దేవునితో నుండవలసిన సన్నిహిత సంబంధపు గొప్ప శత్రువు దేవుని సేవయే" యని డాల్లస్ విల్లార్డ్‌గారు చెప్పిరి. సేవలో పూర్తిగా నిమగ్నులై యుండుట! దేవునికి సంబంధించియుండుట వేరు, మరియు దేవుని

సేవ చేయుట వేరు.

దేవునితో నుండవలసిన సన్నిహిత సంబంధమునకు బదులుగా నుండునది మరియేదియు లేదు. ప్రార్థించునపుడు, ఆరాధించునపుడు గడుపు సమయము నందే దేవుని ఆత్మ నాకు పరిచర్య చేయుచున్నది. ఆ సమయము తీపిగా నుండు సహవాసమే.

దేవునితో నేను గడిపిన సమయము నా ఉద్యోగమునకు సంబంధించి యుండదు. అది ఆయనతో నుండు సంబంధమునే చూపుచున్నది. నాకు కావలసిన దేవుని అవసరత, ఆయన యెడల నా ప్రేమ, ఆయన యెడల నా ఆరాధన అనునవి. అట్టిది వివాహములో నున్న రీతియే. ఒకరితోనొకరు సంభాషించుకొనుట వలననే సంబంధము ఎక్కువగును. హృదయపూర్వకముగా మాట్లాడుట, ప్రేమతో పంచుకొనుట, మెచ్చుకొనుట అనునవి. సన్నిహిత సంబంధమునకు సూత్రము లేదు. ఎక్కువగా ప్రేమచూపుటయే కోరబడెను. ప్రేమించనిదే అది జరుగదు. సమయమును తీసికొనును. వినయము కావలసినదే. దానికెంతో విలువ గలదు. అది పరలోకమే! భూలోకముపై నుండు పరలోకపు రుచి! తప్పక మనము పరలోకములో దేవుని సేవించెదము. కాని యది ఆయనతో నుండు సన్నిహిత సంబంధమును షరత్తుగా కోరుచున్నది. అదియే ఆధారముగా నున్నది. (ఫిలిప్పి 3:10 ద్వితీయోపదేశకాండము 6:4,5).

ఒకటి నుండి పది వరకు లెక్కపెట్టినపుడు నీ భార్య/భర్తతో సన్నిహిత సంబంధము ఏ సంఖ్యలో నున్నది? 1-10 వరకు లెక్కపెట్టినపుడు దేవునితో నుండు సన్నిహిత సంబంధములో ఎక్కడ ఉన్నావు? నిజముగా

దేవునితో నుండు సన్నిహిత సంబంధమును ఆటంకపరచునదేమి? నీ మార్గములో అడ్డుబండలేవి? వాటిని గూర్చిన నీ చర్య ఏమి?

**4. దైవభక్తిగల నాయకుడు మన విలువను తలాంతులను వాడుట ద్వారా నిర్ణయించలేమని యెరిగియున్నాడు.**

మరొక ప్రాముఖ్యమగు సత్యమును నేర్చుకొంటిని. నా విలువను లేక యెదుగును దేవుడు ప్రసాదించిన తలాంతులను వాడుకొనుచు నిర్ణయించుకొనలేను. దేవుడు నాకిచ్చిన తలాంతు బోధించుట మరియు వాక్యపరిచర్య చేయుట మరియు హితోపదేశము చేయుట. ఇవి ఆత్మీయ వరములు. నాలుగు దశాబ్దములుగా వాటిని వాడుకొనుచు వీటిలో అభివృద్ధి జెందియున్నానని గ్రహించితిని. ఇప్పుడు పరిచర్యలో నేను బహుశ్రేష్ఠుడనని నా భార్య చెప్పుచున్నది. ఈ తలాంతులను నేను వేలాది గంటలందు సానబెట్టుకొని యుంటిని. ఎంతగా యెదిగి యుంటినో వెనుకకు చూచి నేను గ్రహించగలిగితిని.

నేను దేవునికి వందనములు చెప్పుచున్నాను. వీటినన్నిటిని దేవుడే ఆయన కృప మరియు ఆత్మ ద్వారా ఫలింపజేసి యున్నాడు. వీటిని నేనే నా శక్తివలన చేసితినని భ్రమపడలేదు. దేవుని కృప మరియు సహాయము లేకుండిన యెడల ఈ తలాంతులన్ని యెట్లుండి యుండునో! నాకు నేనే స్వశక్తినుపయోగించి యుండిన యెడల నిజమైన అపజయము కలిగి యుండును. వీటిని బట్టి దేవునికే ఘనత!

ఆ సత్యమును గ్రహించుట అతి ప్రాముఖ్యము. అట్లు గ్రహించకుండిన యెడల నేనే సామర్థ్యము గలవాడనని తలంచుకొని

యుందును. నా వ్యక్తిత్వము వేరు. మరియు దేవుని నుండి నేను పొందిన తలాంతులను వాడుకొని చేసినది వేరు. నేనేమి ఫలితముగా తెచ్చుచున్నానో దాని బట్టి నిర్వహించబడకున్నాను. కాని నా ఆంతర్యములో నేనెవరినై యున్నానో అది ముఖ్యము. నా పరిచర్య విధులను నిర్వహించురీతి వేరుగా నున్నది.

దేవుడు నన్ను చూచునపుడు నా వాక్యపరిచర్యను లేక హితోపదేశమును గూర్చి మెచ్చుకొనడు. నా హృదయమునే పరీక్షించును. నా అసలైన వ్యక్తిత్వమునే చూచును. యూదా ఇస్కరియోతు పరిచర్యలో శక్తిమంతుడే. అందును బట్టి డబ్బు సంచి అతనికి యివ్వబడెను. ఒకరు తనను అప్పగించుదురని యేసు చెప్పునంతవరకు ఎవరును యూదాను సందేహించలేదు. తలాంతులు గలవాడే. కాని ఏమైనది?

ఇతరులను మెప్పించుటకు నా తలాంతులను దేవుడిచ్చినందున వాడుట లేదు. దేవుడు నాకేమి యిచ్చెనో, నా ద్వారా దేవుడు ఏమి చేయుచున్నాడో వాటి యందు ఆనందించుచున్నాను. కాని వాటిని బట్టి నేను ఘనతను కోరుట లేదు. దేవుడిచ్చిన తలాంతులతో నీవు సమస్తమును జయకరముగా చేయుటవలన అది బహుగా గొప్ప విషయమే! కాని నీకే ఘనతయని తలంచవద్దు. నీ విలువను, ఆత్మీయ యెదుగుదలను వాటిపై నిర్ణయించుకొనవద్దు. దేవుని కృప ద్వారానే చేయగలిగితివి (1 కొరింథి 15:10; రోమా 15:17).

నీ ఆత్మీయ తలాంతులను జయకరముగా వాడుట యందు యెంతగా కష్టపడుచున్నావు? వాటి విషయమై అతిశయించునట్లు

శోధింపబడుచున్నవా? నీ జీవితము నుండి దేవుడు తన కృపను, శక్తిని తీసివేసికొనిన యెడల ఎట్లుండును? నీ ఆత్మీయ యెదుగుదలను ఎట్లు కొలుచుకొందువు? దేవుడు ఏ రీతిగా కొలుచుచున్నాడు?

**5. దైవభక్తిగల నాయకుడు వినయము అను శీలము సాధారణముగా వచ్చునది కాదని గ్రహించియున్నాడు.**

నా పరిచర్య జీవితము నందు నేర్చుకొనిన పాఠములను తలంచుకొను నపుడు అహంకారము అను శీలముతో నుండిన పోరాటమును గూర్చి చెప్పుచున్నాను. అహంకారము బహుగా అపాయకరమైనది. నాలోని అహంకారమును గుర్తించ లేకుంటిని. ఇతరులలో నుండు అహంకారమును బహు సులభముగా కనిపెట్టుచుంటిని. కాని నాలోని అహంకారమును చూడలేనంతటి గ్రుడ్డితనమును కలిగియుంటిని.

నేను చేయుగలిగినదంతయు నా అహంకారమును చూపించుమనియు, దానిని నా నుండి తీసివేయుమనియు దేవుని అడుగుటయే. అహంకారియై యుండుట నా కిష్టము లేదు. దాని నుండి నన్ను భద్రపరచుమని దేవుని ప్రతి దినము కోరుచున్నాను. అహంకారము ఎంతో నాశనము తెచ్చుచున్నది. అది మనలో ప్రవేశించుటకు వేగిరపడుచున్నది.

నేను గ్రహించకముందే నా భార్య నాలోని అహంకారమును చూపియున్నది. ఎల్లప్పుడును సరిగానుండుటకొరకు, విమర్శను ఎదిరించుట కొరకు, ఇతరులను విమర్శించునపుడు, యితర పరిచర్యల

యెడల నున్న నా వైఖరిని, గుర్తించిన నా భార్య నా కంటెను ముందుగా చూచియున్నది. నేను ఒప్పుకొంటిని. తప్పిదమును చేసినపుడు దాని ఒప్పుకొనవలసినదే. ఇదంతయు అహంకారము తెచ్చు ముప్పు.

ప్రతి పాపమునకు మూలము అహంకారము. స్వార్థము అనునది దేవుడే కేంద్రముగా నున్న జీవితమునకు వ్యతిరేకముగా నున్నది. అది మన శరీరములో నుండు పెద్ద భాగము. ఈ శరీరమునందు మనము నివసించునంతవరకు దానితో వ్యవహరించవలసి యున్నది. దేవుని ఓర్పునకును, ఆయన మన యెడల చూపు కనికరము కొరకును వందనములు చెప్పవలెను (సామెతలు 11:1; 16:8; దానియేలు 4:37).

అహంకారముతో నీకు గల సమస్య ఏమిటి? దాని గూర్చి నీ చర్య ఏమి? విమర్శించ బడినపుడు నీ జవాబు ఏమి? ఇతరులు సవాలు చేసినపుడు ఎట్లుందువు? నీలో అహంకారము ఉన్నదని ఒకరిని చెప్పనిమ్ము. నీలో అహంకారము చేసిన వాటి జాబితా వ్రాయుము. దాని గూర్చి ప్రతి దినము ప్రార్థించుము.

### 6. దైవభక్తిగల నాయకుడు తన భార్య ముత్యములకన్నను విలువైనదని యెరిగియున్నాడు

దేవుడు నాకు శ్రేష్ఠమగు భార్యనిచ్చి యున్నాడు. ఆమె లేకుండిన యెడల నేటి స్థితిలో నుండి యుండను. వివాహము జరిగినప్పటి నుండి ఎన్ని సంవత్సరము లైనదో ఆమె యొక్క మంచితనము అంతగా ఎక్కువగుచున్నది. అంతటి ప్రత్యేకమగు బహుమతి కొరకు మరెక్కువగా వందనములు చెల్లించుచున్నాను. నా జీవితములో ఆమె చూపు చున్న

యథార్థత పరిచర్యలో చూపు సహకారమును విలువ కట్టలేనిది. ఆమె చేయు లోతైన ప్రార్థన దేవుని రాజ్యము కొరకు ఎంతో సాధించుచున్నది. నాకు ఆమె ప్రార్థన - సహకారియై యున్నది.

ఆమె ద్వారా నా కొరకు దేవుని షరతు లేని ప్రేమ ఉన్నదని నేర్చుకొంటిని. కొన్నిసార్లు భార్యా పిల్లలు లేకుండిన యెడల దేవుని సేవలో ఎంతో సాధించెదమని తలంచుదుము. మన సమయము నెంతో వాడుకొందురు. సంఖ్యలో ఎక్కువగా చేయగలమని తలంచగలము. కాని చేయునది ఎక్కువ కాలము నిలిచియుండదు. విలువలో అది తక్కువగా యున్నను అది నిలిచి యుండును.

ముందుగా ఆమె కోరినవాటినిచ్చుట నేర్చుకొనుటలో నా పరిచర్యలో ఎటువంటి ఆటంకము ఉండదు. యెదుగుదల ఎంతో రాగలదు. వివాహమందును, పరిచర్య యందును యిట్టిది యెంతో అవసరము.

వృద్ధుడగుచుండగా నా జీవితమందును, పరిచర్యయందును కొనసాగు చున్నాను. ఒక మంచి భార్య ముత్యము కన్నను విలువైనదని గ్రహించితిని. అదే రీతిగా దీనిని చదువు భార్యలకును తమ భర్తలు అదేరీతిగా యున్నారు (సామెతలు 31:10-12, 30, 31; 1 పేతురు 3:7).

ఎంతవరకు నీ భార్యకు విలువ నిచ్చుచున్నావు? వారి అవసరతలను చూచి విచారపడుదువా? ఆమె కోరికలను నెరవేర్చుటకు ఎంతటి త్యాగము చేయు చున్నావు? మరియింకను ఎక్కువగా ఏమి చేయుచున్నావు? భార్యా బిడ్డలు విలువ గలవారని వారికి ఎప్పుడు చెప్పియున్నావు? నేడే చెప్పుము.

## 7. దైవభక్తిగల నాయకుడు తన ప్రథమ పరిచర్య అతని కుటుంబమని జ్ఞాపక ముంచుకొనును.

నా జీవితమును వెనుకకు చూచినపుడు నేను చూడగలిగిన దానిని నాకంటె చిన్నవయస్సు గలవారు అట్టి దృశ్యమును చూడలేరు. నా పిల్లలు యెదిగినవారు, వివాహమైనది. వారికి వారే జీవించుచున్నారు. వారి జీవితములపై నా ప్రభావము అధికముగా నున్నది. నా పరిచర్య ప్రారంభము నందు నా ప్రథమ సంఘము నా కుటుంబమే అని నన్ను ఒప్పింపజేసినందుకు దేవునికి వందనములు చెల్లించు చున్నాను.

భూలోకము నందు యేసు ఉన్నపుడు ఆయనకు ప్రప్రథమమైనది తన కుటుంబమైన "శిష్యులు". జనసమూహము కాదు. కార్యక్రమములు కావు. లేక యేర్పరచుకొనిన కర్తవ్యము కాదు. కుటుంబీకులను వారి అవసరతలను ప్రథమముగా పెట్టుకొనెను. ఎక్కువగా జనసమూహము నుండి వచ్చి తన శిష్యులతో నుండెను. ఆయన చేసిన రీతిగా నేడు మనమును చేయవలసి యున్నది. నీ బిడ్డల యందే నిన్ను నీవు నిరూపించుకొనగలవు. నిన్ను నీవు వారిలో ఉత్పత్తి చేసికొనుచున్నావు. వారి జీవితములందు నీ ప్రభావము ఉంటున్నది. కాని అసలైన ప్రశ్న ఏమిటనగా అది ఎటువంటి ప్రభావము? పిల్లలు మృదువైన మట్టివంటి వారు. నీవు కోరిన రీతిగా వారిని మలచుచున్నావు. వారితో గడుపుటకు నీకు సమయము లేకుండిన యెడల వారికి ప్రాముఖ్యమిచ్చుటలేదని అర్థము. నీవే వారిని రూపించుచున్నావు.

సంఘకాపరుల పిల్లలు జగడము మరియు అవిధేయతలను

ప్రదర్శించు చుండుట అవమానకరము. ఇది ఎవరి తప్పు? దేవుడే చెప్పుచున్నాడు. మనము మన కుటుంబములను చక్కగా జరిపించుకొనలేని యెడల, ఆయన సంఘమును సరియైన రీతిలో నడిపించుకొనలేము. సంఘముకన్నను నీ బిడ్డలకు నీవు ఎక్కువగా అవసరము. మన పరిచర్య, మన జయము యితరుల యెడల ముఖ్యమని తలంచుకొనిన యెడల అసలు ప్రాముఖ్యమైన దాని వదలి పెట్టుచున్నాము. దేవుని కొరకు వారిని క్రమశిక్షణలో పెట్టుట కొరకే పిల్లలను మనకు అనుగ్రహించి యున్నాడు. ప్రాముఖ్యమైనది మరియొకటి లేదు! ఇతర విషయముల కొరకు మన పిల్లలను నిర్లక్ష్యపరచవలెనని ఆయన ఎప్పుడైనను నడిపించడు. దేవునికి పిల్లలు బహుగా ప్రశస్థము. అందుకే ఆయన వారిని మనకు అప్పజెప్పి యున్నాడు.

నా పిల్లలు పెద్దవారై వెళ్లిపోయియున్నారు. వారు దేవుని సేవించుచు ఆయననే వెంబడించుట చూచుచు బహుగా ఆనందించుచున్నాను. "నా పిల్లలు సత్యమును అనుసరించి నడుచుకొనుచున్నారని వినుట కంటె నాకు ఎక్కువ సంతోషము లేదు." (3 యోహాను 4).

ప్రతి యొక్కరును దేవుని యెదుట యథార్థత కలిగి ఆయనను హృదయ పూర్వకముగా సేవించునట్లు తీర్మానించుకొనిరి. దాని విషయమై నేను ఎంతో సంతోషించుచున్నాను. అందును బట్టి ఘనత నాకు కాదు. దేవునికే! నేను చేసినది ఒకటే. వారిని ప్రేమించి వారికి దేవుని గూర్చి బోధించితిని. నాకింత పరిచర్య ఉండినను పిల్లలే నా ప్రాధాన్యతయై యుండెను. దేవుని సేవ కొరకే వారిని పెంచితిని (1 తిమోతి 3:4,5; సామెతలు 22:6).

నీ కుటుంబము నీకు మొదటి ప్రాధాన్యతయని చెప్పగలవని నాకు తెలియును. దానినెట్లు నిరూపించగలవు? నీ పరిచర్యకు ముందుగా నీ పిల్లలకే ప్రాధాన్యత నిచ్చితినని ఎటువంటి ఋజువు చూపగలవు? నీవు వారికే అన్నిటికన్నను ముందుగా ప్రాధాన్యత యిచ్చుచున్నావని చెప్పగలరా?

## 8. దైవభక్తిగల నాయకుడు బైబిలు ప్రతిసంవత్సరము మెరుగుగా నున్నదని గ్రహించును.

కళాశాల మరియు వేదాంత కళాశాల యందు బైబిలు నెంతో ప్రేమించితిని. అది సజీవమైనది, ఉత్తేజము నిచ్చు దేవుని వాక్యము అని గ్రహించితిని. కళాశాలలను విడిచిపెట్టుటతో బైబిలు యెడల గొప్ప గౌరవమును తెచ్చుకొంటిని. నా వ్యవహారమునకు బైబిలు గొప్ప పరికరమైనది. నాతో పాటు బైబిలు జ్ఞానము మరియు దానిని వాడుకొను తలాంతు కూడ యెదిగియున్నది. ఒక క్రైస్తవునిగా నా వెనుక జీవితమును పరీక్షించుకొనినపుడు బైబిలు యెడల నా ప్రేమ ఎక్కువైనది! దానినెందుకు ప్రేమించుచున్నాననగా అది దేవుని బయలుపరచుచున్నది. ఆయనను గూర్చి ఎక్కువగా తెలిసికొనుచున్నపుడు నా ప్రేమ ఎక్కువగుచున్నది.

నా పరిచర్యలోని ఒక పరికరముగా మాత్రమే ఉండక బైబిలు నాకును దేవునికిని జీవనాడియై యున్నది. జీవితములోని లంగరు మరియు బండగా నున్నది. ఇష్టపడి మెచ్చుకొనుట మాత్రమ కాదు. బైబిలు యొక్క అవసరత నాలో ఎంతో యున్నది. బైబిలులోని సత్యముల నెంతగా గ్రహించుచున్నానో, దాని లోతును చూచుచున్నాను. ఈ జీవితమునందు దాని పరిమాణమును గ్రహించలేదు. అది నాకు ఎంతో ప్రశస్థమైనది,

ప్రత్యేకమైనది. దేవుని వాక్యమునకే అధికారము ఉన్నదని నా పరిచర్య ద్వారా అనుభవించిన ఆత్మీయ పోరాటములో కనుగొనియున్నాను. సాతానుడు, వాని అనుచరులును దేవుని వాక్యమునకు లోబడవలెను. దేవుని వాక్యమును నమ్మి దాని వల్లించినపుడు దానిలోని అసలైన శక్తిని చూడగలము. ఆ రీతిగానే యేసు అరణ్యములో శోధింపబడినపుడు ఆ శోధనలను జయించెను. అది ఆత్మయొక్క ఖడ్గము. అది మనము పోరాడు ఆయుధము.

జీవితము కొనసాగుచున్నపుడు బైబిలు మరి ఎక్కువ ఆశ్చర్యమును కలిగించు చున్నది. ఎంత ఎక్కువగా నేర్చుకొనుచున్నను అది కొద్దిపాటిదని గ్రహించు చున్నాను. ఒక బాలుడు దాని గ్రహించగలడు. ఒక విద్యావేత్త దానినెంతగా చదివినను ఒక భాగమును మాత్రమే తన జీవితములో ముగించగలడు. పూర్తిగా ముగించలేడు. బైబిలు మన మనస్సు, భావోద్రేకము, మరియు ఆత్మలతో ఒకేసారి మాట్లాడుచున్నది.

వయస్సు ఎక్కువగుచుండగా జీవితకాలము తగ్గిపోవుచున్నది. బహు కష్టముతో దేవుని వాగ్దానములను హత్తుకొనుచున్నాను. ప్రస్తుత జీవితము కొరకు మాత్రమే కాక రాబోవు జీవితము కొరకు కూడా యవి వర్తించును. త్వరత్వరగా బైబిలును చదువక, నిదానముగా చదువుకొనుచు, ధ్యానించుచు, దాని ద్వారా దేవుడు నాతో మాట్లాడునట్లు ఆయన మాటలు వినునట్లు చేసికొనుచున్నాను (2 తిమోతి 3:16 కీర్తనలు 119:9,11; హెబ్రి 4:12).

బైబిలు కొరకు నీకు గల ప్రేమలో ఎక్కడ ఉన్నావు! నీ పరిచర్యలో అది యొక పరికరము మాత్రమేనా లేక దేవుని సజీవ వాక్యముగా నున్నదా?

దేవుని వాక్యమును ధ్యానపూర్వకముగా చదువుటలో ప్రతి దినము ఎంత సమయము గడుపుచున్నావు? నీకెంతో నచ్చిన బైబిలు వాక్యభాగము కాని వాగ్దానము కాని ఏది? ఎందుకు?

## 9. దైవభక్తిగల నాయకుడు సాతానుని ఉనికికంటెను దేవుడు గొప్పవాడని తెలిసికొనినవాడు

ఏబది సంవత్సరములకు ముందు సంఘకాపరిగా నుండుట ప్రారంభించి నపుడు ఆత్మీయ పోరాటమునందు నాకు పరిచర్య ఉండునని ఏ మాత్రము తలంచలేదు. ఆత్మీయ పోరాటమనగానేమో గడచిన 24 సంవత్సరముల క్రిందటి వరకు తెలియకుండెను. కొందరు క్రైస్తవులు వారి పాపముతో పోరాడుచుండుట యెరిగియుంటిని. కాని వారింతగా పోరాడినను దాని గెలువలేకపోయిరని తెలిసికొంటిని. హితోపదేశమెంతగా చేసినను సహాయపడలేదు. వారికన్నను మరెక్కువ శక్తియేదో వారిని స్వాధీనపరచుకొనినట్లుండెను. నా కుమారులలో ఒకడు ఆ రీతిగా దాని ప్రభావములో చిక్కుకొనియుండెను. దేవుడు తన కనికరము నందు కొందరి భక్తులను పంపి ఆత్మయపోరాటమనగానేమో బోధించియున్నాడు.

"సాతాను తంత్రములను మనము ఎరుగనివారము కాము" (2 కొరింథి 2:5-11). కాని నాకేమియు తెలియకుండెను. అప్పటినుండి ఆత్మీయపోరాటము యొక్క హితోపదేశము ఎవరికి అవసరమైయున్నదో వారికి పరిచర్య చేయుచున్నాను. నేను ఎన్నో పుస్తకములను చదివితిని. ఎంతోమందితో సంభాషించితిని. సాతానుడు మరియు వాని అనుచరులు ఎవరిని బెదిరించుచున్నారో వారికి సహాయపడుటకు నేర్చుకొనుటలో

దేవుడు నాకు బోధించుచున్నాడు. ఇట్టిది నాలో దేవునియందు దిట్టమగు విశ్వాసమును తెచ్చినది. సిలువ యొక్క శక్తిని ఎక్కువగా గ్రహించగలిగితిని. "తుదకు ప్రభువు యొక్క మహాశక్తిని బట్టి ఆయన యందు బలవంతులై యుండుడి" (ఎఫెసి 6:10-12).

నీకు విరోధముగా శత్రువు యొక్క పన్నాగము నెంతవరకు ఎరిగియున్నావు? నీ కుటుంబమును, నీ పరిచర్యను కూడ శత్రువు ఎదిరించుచున్నాడు. నిన్ను నిరుత్సాహపరచి ఓడించుటకు శత్రువు సాతానుడు ఎటువంటి పరికరములను, విషయములను వాడును? వానిని జయించుటకు నీవేమి చేయుదువు?

ఇవన్నియును నా జీవితమునందు దేవుడు నాకు బోధించిన పాఠములలో కొన్నింటిని చూపితిని. నీకును దేవుడు బోధించుచున్నవాటి జాబితాను వ్రాసి యుంచుకొనుము. దేవుడు నీ జీవితములో చేయుచున్నవాటిని జ్ఞాపకము చేయును. నాకు పంపగలిగితే నేనును చదువగలను. వాటిని నాకు పంపండి jerry@schmayer.net

నేను నేర్చుకొనిన వాటిని నీతో పంచుకొంటిని:

1. నేను దేవుని కవసరములేదు. దేవుడే నాకు అవసరము.
2. ఎంతగా యెదుగుచున్నానో అంతగా దూరమగుచున్నాను.
3. దేవునితో నుంచుకొను సన్నిహితసంబంధమే నా ప్రథమమగు గురి.
4. మన తలాంతుల నుపయోగించి మన విలువను లెక్కించుకొనలేము.
5. వినయము అను గుణము సాధారణముగా రాదు.

6. ముత్యములకన్నను మించినదే భార్య.

7. నా కుటుంబమే నా ప్రథమ పరిచర్య.

8. బైబిలు ప్రతి సంవత్సరము మెరుగుపడుచున్నది.

9. సాతాను నిజమైయున్నాడు కాని దేవుడు గొప్పవాడైయున్నాడు.

ఇవి నీలో ఉన్నవా? ఏవి ఉన్నవి? ఏవి లేవు? అభివృద్ధి నొందుటకు నీకేమి కావలెను? వీటిని గురించి ప్రార్థించి వీటిని పొందునట్లు దేవుని అడుగుము.

# 12. 1 తిమోతి 3 మరియు తీతు 1 నుండి నాయకత్వ పాఠములు

**1 తిమోతి 3:1-7 మరియు తీతు 1:5-9 చదువుము.**



నాయకత్వమును గూర్చి తలంచుకొనునపుడు ఒక వ్యక్తి యేమి చేయుచున్నాడో అని తలంచుదుము. నాయకునిగా తన పాత్రను నిర్వహించు రీతిని తలంచుదుము. అయినను వెలుపలి చర్యలు నీ ఆంతర్యశీలముపై ఆధారపడియున్నది. నీ వ్యక్తిత్వము లేక తెలివితేటలు కావు. యేమైయున్నామో దానిపై నాయకత్వముపై ఆధారపడి యున్నది. మనము చేయు క్రియపై ఆధారపడలేదు. దైవిక నాయకులను గూర్చి పౌలు యోగ్యతలను చూపు జాబితాను 1 తిమోతి 3:1-7 మరియు తీతు 1:5-9 వాక్యభాగములందు చూపియున్నాడు. ఆంతర్యములోని యథార్థత మరియు దానియందలి యెదుగుదల ప్రతి యొక్కరును కలిగి యుండవలసియున్నది. ఆ జాబితాలోని వాటిని కొన్నింటిని ఎన్నుకొని వాడుకొనుట కాదు. అవి రెండును కలిసి ఒక వ్యక్తిని సూచించుచున్నది. ఆ వ్యక్తియే ఒక మంచి నాయకుడు. ఆ జాబితాలోని వాటిని నెరవేర్చిన

ఒకే వ్యక్తి యేసు ఒక్కడే. కాబట్టి ఈ జాబితాలోని వాటిని ప్రయోగించి యెంత యెదుగుదుమో అంత యెక్కువగా యేసులో యెదుగుదుము. నాయకత్వములోని ఈ లక్షణములను చూడగలము.

## 1. దైవభక్తిగల నాయకుడు దైవభక్తిగల నాయకుడై యుండవలెను

ఒకరు దైవభక్తిగల నాయకుడై యుండునట్లు కోరుటయే మొదటిది. అతడు తన హృదయమును దానిపై పెట్టవలెను. మరియు దాని కోరవలెను (1 తిమోతి 3:1). దేవుడే ఆ కోరికను హృదయములో పెట్టవలెను. దేవుడే పెట్టిన కోరికకు తగిన రీతిగా జవాబునిచ్చి అనుసరించవలెను. ఎట్లు? హృదయపూర్వకముగా వెంబడించుచు పరిచర్య చేయుచుండవలెను. ఈ ప్రాథమిక సత్యములు లేకుండ ఎవరైనను దైవభక్తిగల నాయకుడై యుండలేడు. ఎవరు కాలేరు.

నీవు దేవుని పరిచర్య చేయునట్లు ఆ కోరికను దేవుడు నీ హృదయములో ఎప్పుడు పెట్టెను? ఆయన సేవ చేయునట్లు నీవు మనస్సు మార్చుకొంటివా? ఆయన సేవచేయునట్లు నీ సమర్పణను దృఢపరచుకొనుము. ఒకవేళ ఆయన పిలుపును సందేహించిన యెడల, ఆ కోరిక దేవుని నుండి వచ్చిన యెడల నీవు స్వలాభము నిమిత్తము చేయకూడదు.

## 2. దైవభక్తిగల నాయకుడు దైవికమగు ఆంతర్యగుణములు గలవాడు

దేవునిచే పిలువబడినవారికిని మరియు పిలుపు నందుకొని సేవ చేయగోరు వారికి పౌలు 25 గుణములు కలిగిన నాయకుని వివరించెను. వీటిని పొందుటకు జీవితకాలమంతయు తీసికొనును. మరియు యేసు

తప్ప మరెవరైనను వీటిని పొందలేకుండిరి. అది యొక పద్ధతిగా ప్రారంభించబడి జీవితాంతము వరకు కొనసాగించబడునది.

మొదటి ఆంతర్యగుణము **సరితూగునట్లు చేయువాడు** (1 తిమోతి 3:2). ఎటువంటి స్థితియందును తన్నుతాను అణచుకొనుచు, యితరులచే మోసగించబడక, స్థిరముగా నిలబడగలిగినవాడై, ఒత్తిడిచే కదలించబడని నాయకుడు!

**బుద్ధిజ్ఞానము గలవాడు** (1 తిమోతి 3:2). మంచి తీర్మానములు చేయువాడు. అనగా అనుభవపూర్వకముగా సమస్యలను పరిష్కరించును. కఠినమగు తీర్మానములను చేయునపుడు మంచి తీర్మానములను చేయును.

తీతు 1:8 నమ్మదగిన బోధను గట్టిగా చేపట్టుకొనువాడై యుండవలెను. అనగా **శిక్షణ పొంది యుండవలెను.** శక్తిని స్వాధీనములో నుంచుకొనవలెను. భోజనము మరియు నిద్ర లేక వేరొకదానిలో ఎక్కువగా నిమగ్నుడై యుండని దైవభక్తిగల నాయకుడు “వద్దు” అని ఎప్పుడు చెప్పవలెనో యెరిగియున్నవాడు (సామెతలు 25:28). శోధనకు కాని, ధనమును ఎక్కువగా వ్యయపరచుట అనువాటికి లొంగని వాడు. కోపము, గర్వము, పేరాశ లేక సోమరితనములను తనను స్వాధీనము చేసికొననీయడు.

ఒకటి నుండి పది వరకు గల సంఖ్యలందు ఆశానిగ్రహ విషయము నందు ఏ సంఖ్యలోనున్నావు? నీకు చెందినవారు లేక సన్నిహిత మిత్రులు నీవెక్కడ యున్నావని చెప్పగలరు? ఇతరులు సలహా కొరకు నీయొద్దకు వచ్చుచున్నారా? నీవు శ్రేష్ఠమగు తీర్మానములు చేయుదువను నమ్మిక

నీకున్నదా?

## 3. దైవభక్తిగల నాయకుడు అందరి యెడల మంచి సంబంధము కలిగి యుండును.

ఒక దైవభక్తిగల నాయకునిగా నుండుట యనగా యితరులతో కలిసిమెలసి వారితో సహకరించుచుండుటయే. ఇతరులను సరిగా పరామర్శించుచుండుట దైవభక్తిగల నాయకులకు కొన్ని గుణగణములను పౌలు ఒక జాబితాలో వ్రాసెను.

ఒక దైవభక్తిగల నాయకుడు **ముక్కోపియై యుండకూడదు** (తీతు 1:7). లేక **జగడము చేయనివాడు** (1 తిమోతి 3:3). ఇతరులతో వాదించని వ్యక్తి (సామెతలు 29:22). ఒత్తిడి వచ్చినను నెమ్మదిని ప్రదర్శించును. దైవిక కోపము కూడ ఉన్నది. యేసు దేవాలయము నందు వెళ్లగొట్టెను. అట్టిది పాపము నెదిరించుట యందే కనబరచవలెను. అయినను జాగ్రత్త వహించుచు మనము పాపము చేయకుండునట్లు ప్రవర్తించవలెను (ఎఫెసి 4:26). నాయకుడు జగడగొండియై యుండకూడదు (1 తిమోతి 3:3). **"వాదించువాడు"** అని అతడు పిలువబడకూడదు. ఎవరిని అవమానపరచకూడదు లేక విమర్శించకూడదు. సంభాషించునపుడు తాను చెప్పినదే సరియని హక్కుగా చెప్పకూడదు. ప్రతి విషయమునందు సరియైన రీతిగా నుండును (సామెతలు 20:3). వినుటలో యిష్టము, నేర్చుకొనుటలో ఆశ, అవసరమైనపుడు తన అభిప్రాయమును మార్చుకొనుట యనునవి చేయవలెను. ఎల్లప్పుడు తన యిష్టమునే జరిగించునట్లు ఆశించకూడదు.

గర్వించకూడదు (తీతు 1:7). మొండితనము చూపకూడదు. ఇతరులతో కలిసి సహకరించి పనిచేయుచు నుండవలెను. బృందములో నొకభాగముగా నుండును.

ఏ రీతిగా నుండవలెనో పౌలు చెప్పుచున్నాడు: శాంతము గలవాడు (1 తిమోతి 3:3). అనగా యితరుల యెడల ఓర్పు కలిగియుండుట! దయచూపుట మరియు పరిస్థితిని గ్రహించుట. తన్ను తాను తగ్గించుకొని, క్షమించుచు, తప్పును కప్పిపుచ్చుచుండుట. విమర్శించువాడు కాదని ప్రజలు నాయకుని గూర్చి చెప్పవలసినట్లు ప్రవర్తించవలెను.

నీవు త్వరగా కోపగించువాడవని నీ భార్య లేక పిల్లలు చెప్పుదురా? నీవు చెప్పునదే సరియని నీవనుకొనుచుండువాడని వారు చెప్పుచున్నారా? వారు మంచిని చెప్పినపుడు నీవు వినుటకును, సరిదిద్దుకొనుటకును మనసు మార్చుకొనుటకును యిష్టపడుచున్నావా? నీలో ఓర్పు ఉన్నదని చెప్పగలరా? ఎటువంటి పరిస్థితు లందును నీవు దయగలవాడని చెప్పగలరా?

## 4. దైవభక్తిగల నాయకుడు దైవికమగు మంచిపేరు, కీర్తి కలిగియుండును.

ఈ ప్రత్యేకమగు గుణము యితరులు నాయకుని గూర్చిన అభిప్రాయమును తెలియజేయుచున్నది. మరియు అతని వెనుక ఏమని చెప్పుకొనుచున్నారో దానిని కూడ చెప్పుచున్నది. వారు నిన్ను గూర్చి మరొకరికేమని చెప్పుచున్నారో దానిని కూడ చెప్పుచున్నది. ప్రతి క్రైస్తవ వ్యక్తి మంచిపేరు, కీర్తి కలిగియుండుట బహుగా ప్రాముఖ్యము.

ఎందుకనగా మనము యేసు యొక్క ప్రతినిధులము. నాయకులకు యిది మరియెక్కువ ప్రాముఖ్యము. మంచిపేరు మరియు కీర్తిని గూర్చి దేవుడు చెప్పిన దానిని తెలిసికొనవలెను.

నాయకునికి మంచిపేరు మరియు కీర్తిని కలిగిన నిందారహితునిగా నుండుట (1 తిమోతి 3:2). ప్రశ్నించదగిన ప్రవర్తన యుండక, రహస్య పాపమునందుండక, యితరులతో పోరాడక యుండునట్లు చూచుకొనవలెను. మనము ఎవరినో మోసగించితిమని యితరులు చెప్పుకొనకూడదు. మనలో దురాశ మరియు గర్వము లున్నవని వారు చెప్పుకొనకూడదు. అదియే నిందారహితులై యుండుట. తప్పు చేయని వాని గూర్చియే యిది చెప్పబడుచున్నది. నాయకత్వములో పవిత్రులై యుండకపోవచ్చును. కాని ఒకరిని బాధపరచినపుడు, లేక వారి యెడల తప్పు చేసినపుడు వెంటనే వినయముతో దాని ఒప్పుకొని సరిచేసికొనవలెను. మనము గౌరవింపదగిన వారమై యుండునట్లు పౌలు చెప్పుచున్నాడు (1 తిమోతి 3:2). ఇట్టిది గౌరవ, మర్యాదలకు తగిన వ్యక్తిని గూర్చి చెప్పబడినది: ఒక క్రైస్తవ వ్యక్తి! ఇతరులతో ఏ రీతిగా వ్యవహరించెదమో దానిని బట్టి మన న్యాయప్రవర్తన వలన ప్రతిదియు జరుగు చున్నది. అనగా మనము నీతి నిజాయితి, యథార్థత, నిజత్వము, మాట నిలబెట్టుట, ఖర్చులు చెల్లించుట మరియు ఎల్లప్పుడు యితరులను గూర్చి దయగల మాటలు చెప్పుచుండుట అనునవియే.

మరియు మనము అతిథి సత్కార్యమును చేయుచుండవలెను (తీతు 1:8). ఇతరుల అవసరతలను తీర్చవలెను. ఆ దినములందు హోటళ్లు లేకుండెను. కాబట్టి యాత్రికుల కొందరి గృహములను ఆశ్రయించెడివారు.

దైవభక్తిగల నాయకుడు త్యాగము, శ్రద్ధ మరియు యితరులతో పంచుకొనుట అను వాటిలో పాల్గొనుచుండవలెను.

వీటన్నిటి యొక్క ఫలితము మనము యితరుల యెడల మంచిపేరు, కీర్తిని పొందుటయే (1 తిమోతి 3:7). సమాజము నందు యితరులు మనలను గూర్చి గౌరవ, ఘనతలను ప్రదర్శించెదరు. మనము మంచివారమనియు, యథార్థ వంతుల మనియు, నమ్మకస్థుల మనియు వారనుకొందురు.

నీ సమాజమునందు నీకెటువంటి పేరు ఉన్నది? క్రైస్తవేతరులు నిన్ను గూర్చి ఏమని తలంచుదురు? నీ సంఘమునకు హాజరుకానివారు నిన్ను గూర్చి ఏమి చెప్పుచున్నారు? నీ మాట మంచిదని, నమ్మకమైనదని వారనుకొనుచున్నారా? నీవు యేసు ప్రతినిధిగా నున్నందున వారు ఆయనను గూర్చి ఏదైన మంచిది తెలిసికొని యున్నారా?

**5. దైవభక్తిగల నాయకుడు దైవికమగు ఆత్మీయ జీవితము గలవాడు.**

ఒక నాయకుని వ్యక్తిగత ఆత్మీయత యొక్క యెదుగుదలపై పౌలు అసలైన గుణము అని నొక్కి చెప్పెను.

ఒక దైవభక్తిగల నాయకుడు పవిత్రుడై యుండవలెను (తీరు 1:8). దేవుని కొరకు జీవించుచు ఆయననే మెప్పించు పురుషుడు లేక స్త్రీయై యుండవలెను. స్వకీయ జీవితము నందు తలంపులందు క్రియలందు పాపము లేకుండ చూచుకొనును. మన మెవరమును పవిత్రముగా యుండలేము. అయినను మన జీవితములో ఒప్పుకొనని పాపము ఉండకుండునట్లు చూచుకొనవలెను. నాయకుని జీవితమునందు

దైవసన్నిధి ఉన్నట్లు యితరులు చూచునట్లుండవలెను. క్రైస్తవ ప్రవర్తనలో యెదుగును తెచ్చుకొనుచు మరెక్కువ పవిత్రతను తెచ్చుకొనుచుండవలెను.

తన క్రైస్తవ్య జ్ఞానమందును నాయకుడు యెదుగుచుండవలెను. దైవభక్తిగల నాయకుడు నమ్మదగిన బోధను గట్టిగా చేపట్టుకొనువాడునై యుండవలెను (తీతు 1:9). దేవుని వాక్యపు సత్యమును వివరించుచు, దాని భద్రపరచు శక్తిగలవాడై యుండవలెను. దానినే తన అనుదిన జీవితమునందు ప్రయోగించుచు ప్రదర్శించ వలెను.

దైవిక జీవితము నందును, బైబిలు జ్ఞానము నందును యెదుగు తెచ్చు కొనుటకు సమయము తీసికొనును కావున పౌలు చెప్పుచున్నదేమనగా ఒక నాయకుడు క్రొత్తగా చేరినవాడై యుండకూడదు (1 తిమోతి 3:6). క్రొత్తగా చేరినవాడు ఒక మృదువైన మొలక. దానికి సూర్యరశ్మి కావలెను. యెదుగుటకు నీరు కావలెను. క్రొత్త విశ్వాసులు దేవుని వాక్యమును నేర్చుకొని దానిని వారి జీవితము నందు సాధకము చేసికొనవలసియున్నది. ఆత్మీయముగా యెదుగుటకు సమయము తీసుకొనుచున్నది. పౌలు చెప్పినదేమనగా యెదుగు కొరకు సమయము తీసికొనని యెడల క్రొత్తగా చేరిన వ్యక్తి తన స్థితిలో అతిశయము తెచ్చుకొని పాపములో పడిపోవును. ఒక క్రైస్తవ వ్యక్తి కొంతకాలము యెదుగుచున్నపుడు అతనికిచ్చు స్థితి ఒకరికి సహాయకునిగా నుంచుటయే. మంచి శిక్షణను పొందుదురు. నేర్చుకొందురు. ఒకరి అధికారములో నున్నపుడు జవాబుదారిగా నుండుట కూడ నేర్చుకొందురు. అట్లు యెదిగినపుడే నాయకత్వమును ఆర్జించుకొందురు. గర్వము, స్వార్థము లుండవు.

నాయకునిగా నుండుటలోని చివరి యోగ్యత ఆత్మీయజీవితమునకు సంబంధించి యున్నది. నాయకుడు బోధింపతగినవాడై యుండుట (1 తిమోతి 3:2). దీనిలోని భావము బైబిలు జ్ఞానము నందు యెదుగును. ఆత్మీయముగా యెదుగుచు, నేర్చుకొనుట కిష్టపడుచు, నేర్పుటయందు ఆసక్తి కలిగియుండవలెను. అప్పుడు దేవుని సత్యమును యితరులకు అందించగలడు. బోధించుటలో నాయకులైన ఎంతోమందికి తలాంతులేదు. అయినను దేవుని సత్యమును యితరులకు బోధించుటలో శక్తియంతటిని ఉపయోగించవలెను. నాయకత్వపు లక్షణములలో బోధించుట అనేది అందరిని కదలించేదిగా వుండాలి. **అందరిచేత వాక్యమును బోధించు తలాంతులలో** బైబిలును బోధించు నైపుణ్యత అది దేవుని వాక్యమని అందరికి బోధించాలి.

నీవు పవిత్రత మరియు పాపముపై విజయములందు యెదుగుచున్నావా? నీకు అపజయము తెచ్చునట్లు నీలో ఏదైనా పాపము ఉన్నదా? జయము కొరకు నీవేమి చేయుచున్నావు? నీవు యథార్థతతో బైబిలును పఠించుచు నేర్చుకొను చున్నావా? తప్పులను గుర్తించుకొనుచు యితరులకు దేవుని వాక్యములోని సత్యమును చూపుచున్నావా? ఇతరులకు దేవుని సత్యమును అందించుచున్నావా? నీ విశ్వాసము నందు బైబిలు జ్ఞానమునందు యింకను యెదుగుచున్నావా?

## 6. దైవభక్తిగల నాయకునికి దైవికమగు కుటుంబ జీవితము గలదు.

ఒక నాయకుని కుటుంబ జీవితమును గూర్చి చెప్పునపుడు పౌలు ఎక్కువగా నుండు వివరముల నిచ్చియున్నాడు. ఒక దైవిక కుటుంబము

యితర కుటుంబములకు ప్రాముఖ్యమగు మాదిరి నిచ్చుచున్నది. దైవికమగు కుటుంబము గల నాయకుడు యితర కుటుంబములకు పవిత్రులై యుండునట్లు నడిపించగలడు. నాయకునికి తన కుటుంబము మొదటి ప్రాధాన్యత. ఈ కారణములన్నిటిని బట్టి దైవభక్తిగల తండ్రి మరియు భర్తగా నుండుట బహుగా ప్రాముఖ్యము.

పౌలు చెప్పుచున్నదేమనగా ఒక దైవభక్తిగల నాయకుడు ఒక భార్యకే భర్తయై యుండవలెను (1 తిమోతి 3:2). ఆ భార్య యెడల యథార్థత చూపును. భార్య యెడల మరియు వివాహము యెడల హత్తుకొనిన విధానమును తన మాటలందును, క్రియలందును చూపును. ఇరువురును ఒక జంటగా సన్నిహితముగాను, శక్తివంతము గాను యెదుగుచుండవలెను.

దైవభక్తిగల నాయకుడు మంచి భర్తగాను, మంచి తండ్రిగాను ఉండవలెను. తన యింటి వారిని బాగుగా ఏలువాడునై యుండవలెను (1 తిమోతి 3:4,5). ఏలువాడనగా ముందుగా నిలుచుండి నడిపించుట. దాని భావము భవిష్యత్తును గూర్చిన యేర్పాటు, దైవికమైన వాటిని ముందుగా పెట్టుకొనుట, అవసరతలను తీర్చుట మరియు కుటుంబ సమస్యలను పరిష్కరించుట. వీటిని ఒక క్రమములో చేయవలసియున్నది. గృహము సంఘనాయకత్వము కొరకు గల మంచి శిక్షణా స్థలము. ఎందుకనగా కుటుంబము ఒక చిన్న సంఘము. అదే అవసరతలు మరియు సమస్యలు కలిగియున్నది. ఒకరు తన కుటుంమును దైవమార్గము నందు నడిపించకుండిన యెడల పెద్దసంఘమును నడిపించలేడు. తన భార్యబిడ్డలు అతని ముఖ్యమగు గొఱ్ఱెలైయున్నందున వారికి చేయు పరిచర్య

తదుపరి తన సంఘమునకు చేయవలెను.

తనకు విధేయులగు పిల్లలు ఉందురు (తీతు 1:6; 1 తిమోతి 3:4). వారు తగిన గౌరవముతో విధేయత చూపవలెను (1 తిమోతి 3:4). నేరము మోపబడని వారై అవిధేయులు కాక విశ్వాసులైన పిల్లలు గలవాడునై యుండవలెను (తీతు 1:6). దీనిలోని భావము పిల్లలు దేవుని గౌరవించుచు, విధేయులగుచు అదేరీతిగా వారి తండ్రి యెడల కూడ ప్రవర్తించెదరు. పిల్లలు అవిధేయులై యుండుట సాధారణము. కాబట్టి తండ్రి దైవజనుడైనందున ప్రేమతో మృదువుగా వారిని క్రమశిక్షణలో పెట్టును. అట్లు చేయని యెడల సంఘ సమస్యలను కూడ పరిష్కరించ లేడు. పిల్లలు పెద్దవారగుటతో వారు తల్లిదండ్రుల యెడల గౌరవమును ప్రదర్శించ వలెను. వారు ప్రేమతో క్రమశిక్షణలో పెంచబడిరనుటకు ఋజువు యిదియే.

నీలో యథార్థత యున్నదని నీ భార్య చెప్పగలదా? కుటుంబమును దైవికముగా నడుపుచున్నావని చెప్పగలదా? నీవు పిల్లలను ప్రేమించుచున్నావని వారు చెప్పగలరా? వారు నీతో ఏకీభవించుదురా?

**7. దైవభక్తిగల నాయకుడు దైవికమగు వ్యక్తిగత అలవాట్లు కలిగినవాడు.**

నాయకుని వ్యక్తిగత అలవాట్లు చివరి భాగముగా నున్నది. అతని స్వకీయమగు తలంపులు, క్రియలు యితరులకు తెలియనివి ఉన్నవి. వాటిని రహస్యముగా నుంచుచు అవి లేనట్లు నటించవచ్చును. ఇది వేషధారణ మరియు దేవుడు ద్వేషించు పాపము! ఎవరును చూడనపుడు మనమేమైయున్నామో అదియే మన శీలము. ఇట్టివన్నియు మన

వాస్తవికతను ప్రదర్శించుచున్నవి.

మొదటి రెండు లక్షణములు ధనము యెడల మన వైఖరి మరియు సంపాదించిన వాటి యెడల నుండు వైఖరి. ధనము నాశించకూడదు (1 తిమోతి 3:3). ఇవి రెండును అనగా ధనము మరియు ఆస్తి యెడల గురి యుండకూడదు. అవి యుండిన యెడల వాటిని బట్టి అతిశయించకూడదు. అవే మనలను పోషించుచున్నట్లు తలంచకూడదు. వాటి యెడల మన వైఖరి యెట్లున్నదో పరీక్షించు కొనవలెను. ఇవి లేకుండిన యెడల అవి లేవని బాధపడుట కూడ నేరము. అవి బహుసులభముగా విగ్రహములు కాగలవు. విగ్రహములనగా దేవుని కన్నను ముందుగా పెట్టుకొనునవి. అది పాపము (1 యోహాను 5:21).

పౌలు యింకను చెప్పునదేమనగా మనము దుర్లాభము నపేక్షించకూడదు (తీతు 1:7). స్వంతముగా చేసికొనుటకు దేనిని అన్యాయముగా యథార్థత లేకుండ చేయకూడదు. ఇతరులతో వ్యవహరించునపుడు వాస్తవికతను, యథార్థతను, న్యాయమును ప్రదర్శించవలెను.

ధనమును, ఆస్తిని ప్రేమించుటకు బదులుగా పౌలు చెప్పునదేమనగా మనము మంచిని ప్రేమించువారమై యుండవలెను (తీతు 1:8). మంచివారిని, మంచి విషయములను, మంచి తలంపులను ప్రోత్సహించవలెను. జీవితము నందు మంచిదేదో దానిని నిజముగా ప్రేమించవలెను. ఇతరమైన వాటి నుండి మరలిపోవలెను.

పౌలు చెప్పిన చివరి లక్షణము మద్యపానము చేయనివారు (1

తిమోతి 3:3; తీతు 1:7). దైవభక్తిగల నాయకునికి ఆశానిగ్రహము ఉండగలిగితే అతడు మద్యపాని కాకుండును. తనను స్వాధీనము చేసికొనగలిగిన యెడల ఏదియు యెక్కువగా ఆశించడు. భుజించుట, విశ్రమించుట మరియు నిద్రించుట అనునవి యెక్కువగా చేయడు. దానిని కూడ మరెక్కువగా ఆశించడు.

నీ హృదయమును పరిశోధించుకొనుచు వేరొక నియమము నీలో నున్నదేమో చూపుమని దేవుని అడుగుము (కీర్తనలు 139:23,24). ధనమును, ఆస్తిని ఎక్కువగా ప్రేమించుచున్నావా? నీలో ఒక విగ్రహమున్నదని దేవుడు చెప్పుచున్నాడా? అట్లుండిన యెడల ఒప్పుకొని దానిని తీసివేసికొనుము. నీ ఆశానిగ్రహమెట్లున్నది? యేసు చేయని క్రియను నీవు చేయుచున్నావా? చేయుచున్న యెడల ఒప్పుకొని వాటిని తీసివేసుకొనుము. మంచి శీలము, గుణములు మనకు త్వరగా వచ్చేవికావు. అవి జీవితాంతము వచ్చేవి. అయినా మనము అన్నియు కూడ పొందలేము. అవి మనకు గురిగా కల్గి క్రీస్తుని వలె వుండుటకు నడిపించును. అవి ప్రత్యేకంగా నాయకులకు సూచించబడినవి. అవి క్రైస్తవులందరు అనుసరించు మార్గములై వున్నవి. ఇవన్నియు నిన్ను క్రీస్తును పోలి నడుచుకొనునట్లే చేయగలవని ఆశించుచున్నాను.

నాయకత్వ యోగ్యతలు 1 తిమోతి మరియు తీతు 1లో నున్నవి. దైవభక్తి గల నాయకుడు

1. మంచి నాయకుడై యుండవలెను.
2. అంతర్యము నందు దైవిక గుణములను కలగి యుండవలెను.

3. దైవికమగు పరస్పర వ్యక్తిగల సంబంధమును కలిగి యుండవలెను.

4. మంచిపేరు, కీర్తి కలిగి యుండవలెను.

5. దైవికమగు ఆత్మీయ జీవితమును కలిగి యుండవలెను.

6. భక్తిగల కుటుంబమును కలిగి యుండవలెను.

7. దైవికమగు వ్యక్తిగత అలవాట్లు కలిగి యుండవలెను.

ఇవన్నియు నీలో ఉన్నవా? ఏవి ఉన్నవి? ఏవి లేవు? లేనివాటి నేరీతిగా పొందగలవు? వీటిని గూర్చి ప్రార్థించుచు యివన్నియు నీకుండునట్లు సహాయము చేయుమని దేవుని అడుగుము.

# ముగింపు

నాయకునిగా నుండుట సులభము కాదు. అది ప్రత్యేకమైనది, ఘనత కలిగినది, దివ్యమైనది (1 తిమోతి 3:1). నాయకులు హెచ్చగు స్థాయిలో నుండువారు. కాబట్టి క్రైస్తవ నాయకత్వములో నున్నవారిని గౌరవించవలెను. వారు గొప్ప శోధనల నెదుర్కొందురు. నీకు తెలిసిన సంఘనాయకులను గూర్చి ప్రార్థించు. ఎందుకనగా సాతానుడు వారిని వ్యతిరేకించు చున్నాడు. వారిని ప్రోత్సహించవలెను. కావున వారి కొరకు ప్రార్థించవలెను. నీ దైవిక నాయకత్వము సులభమైనది కాదు. కాని యిది గొప్ప ఘనతను, బాధ్యత నిచ్చునది. ఈ రీతిగా యేసును సేవించుట గొప్ప భాగ్యము. ఆ ఘనత కొరకు ఆయనకు వందనములు చెప్పవలెను. శ్రేష్ఠమగు దైవిక నాయకునిగా నుండునట్లు సమర్పించుకొనుము.

ఈ పుస్తకమును చదువుచుండగా దేవుడు నిన్ను ఒప్పింప జేసిన 2 లేక 3 లక్షణములను ఎంపిక చేసుకొని ప్రారంభించుము. వీటిలో నీవు అభివృద్ధి జెందునట్లు దేవుడు ఏమి కోరుచున్నాడో. వాటిని వ్రాసి యుంచుకొనుము. వీటిలో అభివృద్ధి జెందుటకు కొన్నింటిని సవరించుకొనుట లేక విడిచిపెట్టుట చూచుకొనుము. ప్రతిదాని గూర్చి ప్రార్థించుము. దేవుని సహాయమును కోరుము. వాటిని బైబిల్‌నందు జాబితా వ్రాసుకొని ప్రతి దినము వాటిని గూర్చి ప్రార్థించుటకు జ్ఞాపకముంచుకొనుము. నీలో అభివృద్ధి కనబడి ఆ విధంగా నీవు చేసినపుడు యేసును పోలియుండగలవు.

బైబిలులోని వ్యక్తులను గూర్చి చదువుమని ప్రేరేపించుచున్నాను. నీ సొంత బైబిల్ పఠనము కొరకు, ప్రసంగములను చేసుకొనుటకు, వాటి నుండి పాఠములు చూడుము. అవి దైవభక్తిగల నాయకత్వమునకు సహాయపడగలవు. దీనిని చదవుట ద్వారా నేను మిమ్ము అభినందిస్తాను, మీ నుండి వినగోరుచున్నాను.

దైవభక్తిగల నాయకత్వమను గూర్చి వ్రాసిన ఈ పుస్తకము ద్వారా దేవుడు నీతో ఏమి మాట్లాడాడో మీ అభిప్రాయములు వినగోరుచున్నాను. మీరు jerry@christiantrainingorganization.org వ్రాయండి. మీరు పరలోకమునకు వెళ్ళినపుడు నన్ను అక్కడ చూసినట్లయితే కలసి గొప్ప సహవాసము చేయగలము.

**మీకు నా కృతజ్ఞతలు మరియు దేవుడు మిమ్ములను దీవించును గాక!**

# గ్రంథకర్త ఇతర పుస్తకములు

1. **ఆధ్యాత్మిక పోరాటం**
2. **దేవుడు కాపరుల నుండి ఏమి ఆశిస్తున్నాడు**
3. **బైబిలు ప్రవచనం**
4. **వివాహము పరిచర్య**
5. **బైబిల్ సంక్షిప్త వివరణ**
6. **బైబిల్ పఠించుట**
7. **దేవుని వాక్యము బోధించుట మరియు ప్రకటించుట**